www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 23-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 295

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 8.41 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఆర్ద్ర తె. 6.27 తదుపరి పునర్వసు; వర్జ్యం: మ.1.53-3.35; దుర్ముహూర్తం: ఉ.9.07-9.51, రా.10.15-11.05; అమృతఘడియలు: రా.7.50-9.32; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.02

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జోడో యాత్రకు బ్రేకులు

అసోంలో బతద్రవ సత్ర ఆలయ దర్శనానికి రాహుల్‌కు అనుమతి నిరాకరణ

- వెళ్లకుండా అడ్డుకున్న యంత్రాంగం
- పాదయాత్ర, సమావేశానికీ ఆటంకం
- పార్టీ శ్రేణులతో కలసి రాహుల్ ధర్నా
- ఆలయానికి ఎవరెవరు వెళ్లాలో మోదీ నిర్ణయిస్తున్నారంటూ ధ్వజం

న్యూఢిల్లీ, జనవరి 22: భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా అసోంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆటంకాలు ఎదురయ్యాయి. సోమవారం ఉదయం బతద్రవ సత్ర ఆలయ సందర్శనకు వెళ్తున్న రాహుల్‌ను అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత కొన్ని గంటలకే మోరేగావ్ జిల్లాలో రాహుల్ పాదయాత్రను, వీధి సమావేశాన్ని నిలిపివేయాలని ఆ జిల్లా యంత్రాంగం సూచించింది. జిల్లాలో

మిగతా 13వ పేజీలో...

రామయ్యా.. వచ్చాడయ్యా..

> ఇప్పుడు ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే. నా పూర్వీకులు, కుటుంబ సభ్యులతోపాటు ఆ శ్రీరాముడి ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయి.
>
> \- బాలరాముడి విగ్రహ రూపశిల్పి అరుణ్ యోగిరాజ్



5 శతాబ్దాల తర్వాత సొంత గూటికి శ్రీరాముడు


- అయోధ్యలో ఆవిష్కృతమైన ఆధ్యాత్మిక అద్భుతం
- సాకేతపురిలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ
- కళ్లకు కట్టిన వస్త్రం తీసి.. కాటుక దిద్ది.. అద్దం చూపి
- నరేంద్ర మోదీ చేతుల మీదుగా చారిత్రక మహోత్సవం
- తొలి హారతి ఇచ్చి దర్శనం చేసుకున్న ప్రధాని మోదీ
- అభిజిత్ లగ్నంలో 84 సెకన్లపాటు కొనసాగిన క్రతువు
- గర్భగుడిలో యోగి, ఆనందీ, మోహన్ భాగవత్ కూడా
- తర్వాత శివుడికి అభిషేకం, జటాయు విగ్రహావిష్కరణ
- రామ మందిర నిర్మాణ కార్మికులకు మోదీ సత్కారం
- 8000 మందికిపైగా అతిథులు కార్యక్రమానికి హాజరు

దాదాపు నాలుగు దశాబ్దాల కిందట దేశవ్యాప్తంగా కోట్లాదిమంది రామ భక్తులు అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ఇటుకలు పంపించారు గుర్తుందా!? ఆ ఇటుకలు ఎప్పుడో మట్టిలో కలిసి పోయాయి! కానీ, ఆ సంకల్పం ఇప్పుడు దివ్య, నవ్య, భవ్య రామ మందిరంగా కళ్ల ముందు సాక్షాత్కరించింది!

రాముడి వనవాసం 14 ఏళ్లే! కానీ, అయోధ్యలో శ్రీరాముడికి మందిరం నిర్మించాలన్న హిందువుల పోరాటానికి మాత్రం 500 ఏళ్లు! ఐదు శతాబ్దాల ఆ ఉద్యమం దైవత్వం ఉట్టిపడే ప్రసన్న బాల రాముడి రూపంలో ఇప్పుడు ఫలించింది!

అయోధ్య, జనవరి 22: మనం జీవించి ఉండగా ఈ జన్మలో కళ్ల జూస్తామా!? అని ఎంతోమంది భారతీయులు ఆకాంక్షించిన అద్భుతం అయోధ్యలో ఆవిష్కృతమైంది! అక్కడ రామ మందిరం నిర్మించాలన్న హిందువుల కల సాకారమైంది! టెంట్‌లో ఉన్న రాముడు మందిరంలోకి రావాలన్న రామ భక్తుల ఆకాంక్ష ఫలించింది! భారత రాజకీయ, ఆధ్యాత్మిక చరిత్రలోనే మహోన్నత ఘట్టానికి శ్రీకారం చుట్టుకుంది! అయోధ్యలో దాదాపు 8000 మంది అతిథులు; ప్రపంచవ్యాప్తంగా టీవీ తెరలపై కోట్లాది మంది భారతీయులు భక్తి తన్మయత్వంతో చూస్తుండగా సాకేతపురిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో 51 అంగుళాల(4.25 అడుగుల) బాల రాముడు కొలువుదీరాడు! ప్రధాని మోదీ చేతుల మీదుగా రామయ్య ప్రాణ ప్రతిష్ఠ వేడుక సోమవారం అభిజిత్ లగ్నంలో అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మధ్యాహ్నం 12 గంటలకు ప్రాణ ప్రతిష్ఠ క్రతువు ప్రారంభమైంది. తొలుత ప్రధాని మోదీ

మిగతా 11వ పేజీలో...



బాలరాముడికి పట్టు వస్త్రాలు, వెండి ఛత్రం తీసుకెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

రామాలయ ప్రతిష్ఠ.. నవ శకానికి శ్రీకారం

- పురోగామి భారతానికి నిదర్శనం
- రాముడు ఇక టెంట్లో ఉండక్కర్లేదు
- అద్భుత ఆలయంలో నివసిస్తాడు
- శబరి, గుహుడు, ఉడుత, జటాయువు జీవితాలే మార్గదర్శకం
- కృషి చిన్నదైనా, పెద్దదైనా.. దానికంటూ ప్రత్యేకత ఉంటుంది 12
- అయోధ్యలో ప్రధాని మోదీ ఉద్ఘాటన



అయోధ్యలో ఇక కర్ఫ్యూలుండవు 12

- కాల్పుల మోతలు వినిపించవు
- అంతా రామోత్సవమే: యోగి

ప్రపంచవ్యాప్తంగా సంబరాలు

- న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్‌స్క్వేర్ వద్ద లడ్డూల పంపిణీ
- మార్చి 25 నుంచి అమెరికా, కెనడాల్లో వీహెచ్‌పీ రథయాత్ర 3

అయోధ్య రామోత్సవంలో బాబు, పవన్, చిరంజీవి

వారిని పలకరించిన ప్రధాని 12

నేటి నుంచి అందరికీ దర్శనం

ఉదయం 7 గంటల నుంచి 11.30, మ. 2 నుంచి రాత్రి 7 గంటల దాకా

మేడిగడ్డ మేడిపండే!



- బ్యారేజీకి రూ. 3,625 కోట్లు
- అవినీతితో 3200 కోట్లు వృథా
- 32 మంది అధికారులకు పాత్ర
- బ్యారేజీ నిండా సమస్యలే..!
- రిపేరు చేసినా నిరుపయోగమే
- విజిలెన్స్ ప్రాథమిక అంచనా
- త్వరలోనే మధ్యంతర నివేదిక
- మరమ్మతులకు 500 కోట్లకు పైనే
- అంచనా వేసిన నిర్మాణ సంస్థ

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతితో రూ.3,200 కోట్లు వృథా అయినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక అంచనాకు వచ్చింది. ఈ వ్యవహారంలో 32 మంది అధికారుల పాత్ర ఉందని నిర్ధారించింది. తొలుత మరిన్ని బ్లాకుల్లో సమస్యలున్నట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినా.. ఇప్పుడు బ్యారేజీ మొత్తం సమస్యలున్నట్లు తేల్చింది. మరమ్మతులు చేసినా నిరుపయోగమేనని విజిలెన్స్ భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వానికి త్వరలో మధ్యంతర నివేదికను అందజేసేందుకు సిద్ధమైంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంపై విజిలెన్స్ విచారణకు ఈ నెల 7న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి రోజు నుంచే విజిలెన్స్ అధికారులు బృందాలుగా విడిపోయి, విచారణను వేగవంతం చేశారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. 45 కేటగిరీల్లో సమాచారాన్ని నీటిపారుదల శాఖ అధికారుల నుంచి సేకరించారు. హైదరాబాద్‌లో ప్రధానంగా ఈఎన్‌సీ(జనరల్) నేతృత్వంలోని ప్రాజెక్టు అండ్ మానిటరింగ్ (పీ అండ్ ఎం) విభాగం, నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో), హైడ్రాలజీ విభాగాల్లో సోదాలు చేసి, కాళేశ్వరంతో ముడిపడి ఉన్న ఫైళ్లను స్వాధీనం

మిగతా 2వ పేజీలో...

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా

రిటైర్డ్ డీజీపీ!

- మాజీ ఐపీఎస్ పేరును గవర్నర్ ఆమోదం కోసం పంపిన ప్రభుత్వం
- విదేశీ పర్యటన నుంచి రాగానే టీఎస్‌పీఎస్సీపై దృష్టి పెట్టిన సీఎం
- చైర్మన్ పదవికి 50కి పైగా దరఖాస్తులు.. సభ్యుల పదవులకు 320
- దరఖాస్తులను పరిశీలించిన సెర్చ్ కమిటీ

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్‌గా రిటైర్డ్ డీజీపీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఐపీఎస్ అధికారిగా పనిచేసిన ఆయన ఎంపిక ద్వారా నిరుద్యోగుల్లో నమ్మకాన్ని ఏర్పరచడంతో పాటు నియామక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. చైర్మన్‌గా ఆయన పేరును ప్రతిపాదిస్తూ ఆమోదం కోసం గవర్నర్‌కు పంపించినట్టు సమాచారం. గవర్నర్ ఆమోదించిన వెంటనే ఆయన చైర్మన్‌గా నియమితులు కానున్నారు. డీజీపీగా పనిచేసి రిటైరైన వారిలో 62 ఏళ్లలోపు ఉన్న మాజీ అధికారి మహేందర్ రెడ్డి మాత్రమే ఉన్నారు. చైర్మన్ పోస్టుకు ఆయన పేరునే ప్రభుత్వం ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవి భర్తీపై దృష్టి పెట్టారు. చైర్మన్‌తో పాటు

మిగతా 2వ పేజీలో...

మెట్రో రెండోదశకు ఓకే



- విస్తరణకు రూట్‌మ్యాప్ ఖరారు చేసిన ప్రభుత్వం
- 70 కిలోమీటర్ల మార్గం నిర్మించేలా ప్రణాళికలు
- 29 కిలోమీటర్లతో నాగోలు-ఎయిర్‌పోర్టు కారిడార్
- మైలార్‌దేవ్‌పల్లి నుంచి ప్రతిపాదిత హైకోర్టు వరకు
- రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు
- మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు పొడిగింపు
- పాతబస్తీ మార్గం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- మరో 3 నెలల్లో డీపీఆర్‌లు: ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు రూట్ మ్యాప్ ఖరారైంది. సుమారు 70 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకోసం గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన పాత ప్రణాళికలను రద్దు చేసి.. నూతన ప్రణాళికలకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫేజ్-2 విస్తరణకు రూట్ మ్యాప్‌ను అధికారులు రూపొందించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టును, నూతనంగా హైకోర్టు భవనం నిర్మించే రాజేంద్రనగర్‌ను కూడా కలుపుతూ నగరం నలుమూలలను అనుసంధానం చేసేలా ఈ రూట్ మ్యాప్‌ను తయారు చేశారు. దీని ప్రకారం.. మెట్రో రెండో దశలో కారిడార్-2 కింద పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్లు, ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణ గుట్ట క్రాస్‌రోడ్డు వరకు 1.5 కిలోమీటర్ల మేర నూతన మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక కారిడార్-4 సూపర్‌లైన్‌లో

మిగతా 10వ పేజీలో...

మోసం చేయడానికి కేసీఆర్‌ను కాదు

త్వరలో గల్ఫ్ ప్రవాసీ సంక్షేమానికి ఒక విధానం

» దుబాయ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



దుబాయ్‌లో రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ నేత ఎస్వీరెడ్డి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ ఎన్నారైలను మోసం చేయడానికి తాను కేసీఆర్‌ను కాదని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి దుబాయ్‌లో హైదరాబాద్‌కు బయల్దేరే ముందు కాంగ్రెస్ పార్టీ దుబాయ్ శాఖ అధ్యక్షుడు ఎస్వీరెడ్డి ఆధ్వర్యంలో తనను కలిసిన ప్రవాసీయుల బృందంతో సీఎం మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మభ్యపెట్టే మాటలతో అందరినీ మోసం చేయడం కేసీఆర్‌కు అలవాటని, అందులో భాగంగా ఎన్నారైలను కూడా పాలసీ పేరిట మోసం చేశారని విమర్శించారు. దుబాయ్, బొంబాయి, బొగ్గుబాయి అంటూ ఉద్యమకాలంలో నినదించిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక గల్ఫ్ ప్రవాసీయుల ఊసే మరిచిపోయారన్నారు. దశాబ్దకాలం ప్రవాసీయులు ఎదురుచూసినా కేసీఆర్ మొండిచేయి చూపారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రవాసీయుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అతిత్వరలో దీనికి సంబంధించి ఒక విధానాన్ని ప్రకటిస్తుందని రేవంత్ చెప్పారు. ఎన్నారైల పాలసీకి సంబంధించి మంత్రి శ్రీధర్‌బాబు సౌదీఅరేబియాలో చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ సీఎం ఈ విషయం వెల్లడించారు. గల్ఫ్ దేశాల్లో పెద్ద సంఖ్యలో ఉన్న ప్రవాసీయులపై స్వదేశంలో ఆధారపడ్డ కుటుంబసభ్యులు ఎన్నికల్లో కీలకపాత్ర వహిస్తారని ఎస్వీరెడ్డి సీఎం దృష్టికి తెచ్చారు. దుబాయ్ పర్యటనకు రావాలని ఎస్వీరెడ్డి కోరగా.. దుబాయ్, ఇతర గల్ఫ్‌దేశాలకు తాను ప్రత్యేకంగా వస్తానని సీఎం చెప్పారు.

100 రోజుల్లోపే ఉచిత విద్యుత్ అమలు

మేనేజ్‌మెంట్ కోటా ఎమ్మెల్యే మాటలు నమ్మొద్దు

» కేసీఆర్ కుటుంబం తర్వాత జైలుకెళ్లేది జగదీశ్‌రెడ్డే: మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండటౌన్/తిప్పర్తి, జనవరి 22: 'గృహావసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలుపై మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన ఎమ్మెల్యే అవాకులు చవాకులు పేలుతున్నారు. బిల్లులు కట్టవద్దంటున్నారు. వంద రోజుల్లోపు ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తాం. హామీల విషయంలో ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు' అని ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమీషన్ల కారణంగా యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో అవినీతి జరిగిందన్నారు. త్వరలోనే ఈ బండారం బయటపడుతుందని వ్యాఖ్యానించారు. రూ.85 వేల కోట్ల నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థను గాడినపెట్టేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశాడని, రాష్ట్రానికి వచ్చే నీటిని ఏపీ సీఎం జగన్ తీసుకెళ్లాడని ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను సాధిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం తర్వాత జైలుకు వెళ్లే రెండో వ్యక్తి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డేనని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. 'తెలంగాణ కోసం మంత్రి పదవిని విసిరికొట్టిన నాపై అక్రమ మద్యం కేసులో అరెస్టయిన వ్యక్తి ఆరోపణలు చేయడం విడ్డూరం. ఒకనాడు మామూలు చెప్పులు వేసుకున్న వ్యక్తికి.. నేడు రూ.వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి. ఎన్ని గిమ్మిక్కులు చేసినా విజిలెన్స్ సిటింగ్ జడ్జితో విచారణ అనంతరం ఆయన్ను జైలుకు వెళ్లకుండా ఎవరూ ఆపలేరు. ఆరోపణలు మానేసి ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్‌కు భోజనం ఏర్పాట్లు చూసుకో' అని అన్నారు.

లోకం తీరు





జేఈఈహెచ్ ఏరోస్పేస్ పరిశ్రమను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పరిశ్రమల హబ్‌గా తెలంగాణ

» పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

» కొత్తూర్‌లో ఏరోస్పేస్ పరిశ్రమ ప్రారంభం

కొత్తూర్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు తరలివస్తున్నాయని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ ప్రాంత భూములు ఎంతో అనుకూలమని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వెంటనే అనుమతులు ఇస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, ప్రత్యేక రాయితీలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. దీంతో ప్రపంచ దేశాలకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూర్ పారిశ్రామికవాడలో జేఈఈహెచ్ ఏరోస్పేస్ పరిశ్రమను సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి శ్రీధర్ బాబు ప్రారంభించారు. రూ.23 కోట్లతో విమాన, రక్షణ రంగాలకు సంబంధించిన వాహనాల విడిభాగాల తయారీ పరిశ్రమను యువ పారిశ్రామికవేత్తలు విశాల్, వెంకీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రానున్నకాలంలో తెలంగాణ పరిశ్రమల హబ్‌గా మారనుందని, పరిశ్రమల ఏర్పాటుతో లక్షలాది మంది యువతీయువకులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. 4 నెలల్లో పూర్తిస్థాయిలో పరిశ్రమలో ఉత్పత్తులు ప్రారంభిస్తామని, మొదట విడతలో వంద మందికి ఉపాధి కల్పిస్తామని విశాల్, వెంకీ తెలిపారు.

దేవుడి పేరుతో రాజకీయం చేయొద్దు

» పదేళ్లలో రాష్ట్రానికి బీజేపీ చేసిందేంటి..?: పొన్నం

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతలు దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని రాజకీయం చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. 'నేను జన్మతః హిందువుని.. నిన్న, ఈరోజు గుడికి పోయా.. రేపు గుడికి పోతా.. నుదుట బొట్టు పెట్టుకుంటా.. దేవుడంటే భక్తి, భయం, శ్రద్ధ ఉంది. మీరు చెప్పినట్టు వినకపోతే నేను హిందువుని కాదా...? దేవుడి ఫొటోలు పెట్టి రాజకీయం చేయొద్దు'అని సోమవారం 'ఎక్స్'లో మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, మా ప్రజలకు గత 10 ఏళ్లలో ఏంచేశారో చెప్పండి అని బీజేపీ నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు.

ప్రాణప్రతిష్ఠను వ్యతిరేకించే వాళ్లు పౌరులేనా?

» అద్భుత ఘట్టాన్ని దారిమళ్లించేందుకే రాహుల్ ధర్నా: బండి



కరీంనగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 'రామ మందిర ప్రాణ ప్రతిష్ఠను వ్యతిరేకించే వాళ్లు అసలు ఈ దేశ పౌరులేనా? అయోధ్యలో రాముడు పుట్టారనడానికి, రామ మందిరం ఉందనడానికి ఆధారాల్లేవని అంటారా? సాక్షాత్తు సుప్రీంకోర్టే తీర్పు ఇచ్చిన తరువాత ప్రశ్నిస్తారా? బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి అనుగుణంగా ఇస్తున్న తీర్పునే అవమానిస్తారా?' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో సోమవారం రాత్రి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని, హిందువుల చిరకాల వాంఛను నెరవేర్చారని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పట్టుదలతో, సంకల్పంతో రామమందిరాన్ని నిర్మించి ప్రాణ ప్రతిష్ఠ చేశారన్నారు. నాటి అయోధ్య కరసేవకుల త్యాగాలను స్మరించుకుని భావోద్వేగానికి గురయ్యారు. అయోధ్యలో పాత కట్టడం కూల్చివేతలో పాల్గొన్న కరసేవకుల తొలి బ్యాచ్‌లో తానూ ఉన్నానని గుర్తు చేసుకున్నారు. అసోంలో రాహుల్‌గాంధీ ధర్నా పెద్ద డ్రామా అని, అయోధ్యలో అద్భుత ఘట్టం నుంచి ప్రజలను మళ్లించేందుకే కుట్ర పన్నారని విమర్శించారు. రామమందిర నిర్మాణాన్ని ఎందుకు వ్యతిరేకించారో కాంగ్రెస్‌నేతలు చెప్పాలనిడిమాండ్ చేశారు.

సూర్య ప్రసాద్, లక్ష్మీప్రియలకు పీఎం బాల పురస్కార్

» అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, జనవరి 22: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన 19 మంది బాలబాలికలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌లను అందజేశారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తొమ్మిదేళ్ల పర్వతారోహకుడు, తెలంగాణకు చెందిన 14ఏళ్ల కూచిపూడి నృత్య కళాకారిణి, దివ్యాంగ చిత్రకారుడు, కృత్రిమ మేధ శాస్త్రవేత్త కూడా ఉన్నారు. ఏపీకి చెందిన ఆర్.సూర్యప్రసాద్ ఐదేళ్ల ప్రాయంలోనే పర్వతారోహ శిక్షణ ప్రారంభించాడు. తొమ్మిదోయేట కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. తెలంగాణకు చెందిన పెండ్యాల లక్ష్మీ ప్రియ కూచిపూడి నృత్య కళాకారిణిగా గుర్తింపు పొందింది. గతేడాది శాస్త్రీయ నృత్య విభాగంలో కళా ఉత్సవ్ నేషనల్ అవార్డును అందుకొంది. లాస్యప్రియ అన్న బిరుదును పొందింది.

బెడిసికొట్టిన 'వ్యూహం'!

» ఆర్జీవీకి ఎదురుదెబ్బ.. సెన్సార్ సర్టిఫికెట్ రద్దు

హైదరాబాద్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్ వర్మకు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ జారీ చేసిన సర్టిఫికెట్‌ను సోమవారం హైకోర్టు క్వాష్ (రద్దు) చేసింది. సినిమాలో కోర్టు ధిక్కరణకు పాల్పడేలా పలు అంశాలు ఉండటంతోపాటు వ్యక్తుల పరువుకు, హక్కులకు భంగం కలిగే అంశాలున్నాయని.. వాటిని పట్టించుకోకుండా రివైజింగ్ కమిటీ సర్టిఫికెట్ జారీచేసిందని హైకోర్టు పేర్కొంది. వ్యూహం సినిమా కోర్టు ధిక్కరణకు పాల్పడే విధంగా, పరువు నష్టం కలిగించే విధంగా ఉందని, ఈ సినిమా సెన్సార్ సర్టిఫికెట్ రద్దు చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం సెన్సార్ సర్టిఫికెట్‌ను రద్దు చేసింది. ఈ మేరకు విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది.

'రియల్'కు అండగా నిలవండి

రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించండి.. 10 శాతం మార్టిగేజ్‌ను ఎత్తేయండి.. భట్టిని కోరిన రియల్టర్లు

» రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి ప్రాధాన్యం

» ఎల్ఆర్ఎస్ అర్జీలను పరిష్కరిస్తాం: భట్టి



సోమవారం సచివాలయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి అండగా నిలవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను కోరారు. ఈ మేరకు నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) ప్రతినిధులు సోమవారం డిప్యూటీ సీఎంను సచివాలయంలో కలిసి తమ సమస్యలను వివరించారు. భవన నిర్మాణాల సమయంలో తాత్కాలికంగా తీసుకుంటున్న విద్యుత్తు కనెక్షన్లకు యూనిట్‌కు రూ.9 నుంచి రూ.14కు చార్జీలు పెంచారని, వీటిని తగ్గించాలని కోరారు. భవన నిర్మాణ అనుమతులు తీసుకునే సమయంలో 10శాతం ఆస్తిని మార్టిగేజ్ చేసుకునే విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ఏర్పాటై కొనుగోలుదారుల హక్కులను రక్షిస్తోందని, అప్పుడు 10శాతం తనఖా విధానాన్ని అమలుచేయడం సమంజసంకాదన్నారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలు చాలా ఎక్కువగా ఉన్నాయని, వీటిని కూడా సాధ్యమైనంత మేర తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఆర్ఎస్ స్కీం కింద లక్షలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని క్లియర్ చేయాలని కోరారు. తద్వారా నిర్మాణాలు పుంజుకుని ప్రభుత్వానికి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. 'టీఎస్‌బీ-పాస్' కింద రంగారెడ్డి జిల్లాలోని వివిధ నిర్మాణ ప్రాజెక్టుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, రెండేళ్లుగా ఇవి క్లియర్ కాకపోవడంతో నిర్మాణ రంగంలో వేగం తగ్గిందని తెలిపారు. రాష్ట్రంలో ఆరు నెలలుగా 'ఎన్విరాన్మెంటల్ కమిటీ' లేదని, వెంటనే కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.

వెల్త్ క్రియేటర్లను ఇబ్బంది పెట్టబోం

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న రియల్టీ రంగం వంటి వెల్త్ క్రియేటర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టబోమన్నారు. థేమ్స్ నది మాదిరిగా మూసీనదీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించామని, రీజినల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రెండు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో నరెడ్కో ప్రతినిధులు మేకా విజయసాయి, కె.శ్రీధర్‌రెడ్డి, కాళీప్రసాద్, దశరథ్‌రెడ్డి,చలపతిరావు, భూపాల్‌రెడ్డి, మారోజు శ్రీధర్‌రావు, అశోక్, రామిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఆదాయ మార్గాలను అన్వేషించండి

మద్యం ధరలను పెంచకుండా ఎక్సైజ్ రాబడిని పెంచడానికి మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎక్సైజ్‌శాఖ అధికారులకు సూచించారు. ఎక్సైజ్, పర్యాటకం, సాంస్కృతిక శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై ఆ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, అధికారులతో సచివాలయంలో భట్టి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలైట్ బార్లు, ఎలైట్ వైన్ షాపులను ఏర్పాటు చేయడానికి నిర్దిష్ట విధానం, మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించడానికి ఎక్సైజ్, పోలీ సు, సమాచార పౌర సంబంధాల శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేయాలని, ఓ ప్రణాళికను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో టెంపుల్, ఎకో టూరిజాన్ని పెంచడానికి దేవాదాయ, పర్యాటక శాఖలు, ఆర్టీసీ సమన్వయంతో పని చేయాలని సూచించారు. టూరిజం పాలసీని రూపొందించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు.

ఎస్టీ గురుకులంలో రాజ్యాంగాన్ని ఉంచండి

» విద్యార్థులకు అవగాహన కల్పించండి

» గిరిజన శాఖ సమీక్షలో మంత్రి సీతక్క

» గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులకు తేనె అందజేత కార్యక్రమం షురూ

హైదరాబాద్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పుస్తకాన్ని ప్రతి గిరిజన గురుకులంలో ఉంచాలని, విద్యార్థులకు దానిపై పూర్తి అవగాహనను కల్పించాలని మంత్రి సీతక్క అధికారులు, ఉద్యోగులకు సూచించారు. రాజ్యాంగంపై క్విజ్ పోటీలను నిర్వహించి, విద్యార్థులు చురుగ్గా పాల్గొనేలా చూడాలన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బంజారాభవన్‌లో గిరిజన గురుకులాల, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులతో మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేవలం పరీక్షా ఫలితాల కోసమే కాకుండా గిరిజన విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని సూచించారు. మార్చిలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ విధమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల విద్యార్థులకు ప్రతీ రోజూ 50 గ్రాముల చొప్పున తేనెను ఉచితంగా ఇచ్చే పథకాన్ని మంత్రి ప్రారంభించారు. తదనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ మాట్లాడుతూ, పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత కోసం ప్రతీ గిరిజన విద్యాసంస్థలో పది నియమాల అమలుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వందశాతం ఫలితాలు సాధించిన గురుకులాల ప్రధానోపాధ్యాయులకు, టీచర్లకు సన్మానం ఉంటుందని వెల్లడించారు. అదే సమయంలో సరైన ఫలితాలను తీసుకురాలేని వారిపై చర్యలు కూడా ఉంటాయని అన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా రిటైర్డ్ డీజీపీ!

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుల పోస్టుల కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. వాటిని సోమవారం సెర్చ్ కమిటీ పరిశీలించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలోని ఈ కమిటీ సమావేశంలో లా సెక్రటరీ తిరుపతి, జీఏడీ అధికారిణి నిర్మల పాల్గొన్నారు. ఈ పోస్టుల కోసం వివిధ రంగాలకు చెందిన వారి నుంచి సుమారు 371 దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. ఇందులో 50కి పైగా చైర్మన్ పోస్టు కోసం వచ్చినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీలో చైర్మన్ పోస్టుతోపాటు 11 సభ్యుల పోస్టులున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇద్దరు సభ్యులు కొనసాగుతున్నారు. ఇందులో ఒక సభ్యురాలు రాజీనామా చేసినా ఇంకా గవర్నర్ ఆమోదించలేదు. మరో సభ్యురాలు కూడా రాజీనామా చేసే అవకాశం ఉంది. దాంతో మొత్తం 11 పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. సాంకేతికంగా ప్రస్తుతం 9 సభ్యుల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం చైర్మన్ పోస్టుకు సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వం గవర్నర్‌కు పంపించినట్టు తెలిసింది. టీఎస్‌పీఎస్సీని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాదిరిగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. సాధారణంగా టీఎస్‌పీఎస్సీలో 50శాతం పోస్టులకు సివిల్ సర్వీసెస్‌లో పనిచేసిన వారిని, మిగిలిన సగానికి సైన్స్, టెక్నాలజీ, అకడమిక్ తదితర రంగాల్లోని నిపుణులను పరిగణనలోకి తీసుకోనున్నారు. గత ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో చేపట్టిన నియామకాలపై తీవ్ర గందరగోళ పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. పలు పోస్టుల పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ కావడం, పరీక్షలు రద్దు చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అనేక పోస్టుల పరీక్షలు వాయిదా పడ్డాయి. దీంతో నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి యూపీఎస్సీ చైర్మన్‌ను కలిసి చర్చించారు. అధికారులు కేరళవంటి రాష్ట్రాలకు వెళ్లి అక్కడి వ్యవస్థను పరిశీలించారు.

గ్రూపు-4 పోస్టుల భవిష్యత్తు ఏమిటి?

గ్రూపు-4పోస్టుల విషయంలో ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం కీలకంకానుంది. సుమారు 8,039 గ్రూపు-4 పోస్టుల భర్తీకి ఇప్పటికే పరీక్షలు జరిగాయి. జూలై 1న నిర్వహించిన ఈ పరీక్షకు అక్టోబరులో తుది కీని విడుదల చేశారు. ఇప్పటి వరకు ఫలితాలు ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. దాంతో ఈ పోస్టుల భర్తీ విషయంలో కొత్త ప్రభుత్వ నిర్ణయం కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. మిగిలిన గ్రూపుల పోస్టులతో పోలిస్తే గ్రూపు-4 పోస్టుల భర్తీ కొంత ప్రత్యేకంగా ఉంది. గతంలో ఒకసారి రద్దు అయిన గ్రూపు-1 పోస్టుల కోసం రెండోసారి పరీక్ష నిర్వహించారు. అయితే ఈ పరీక్షను కూడా రద్దు చేయాలని హైకోర్టు ఆదేశించింది. దాంతో ఈ తీర్పుపై కమిషన్ సుప్రీం కోర్టుకు వెళ్లింది. సుప్రీం తీర్పు బట్టి గ్రూపు-1 పోస్టుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. గ్రూపు-2, 3 పోస్టులకు ఇంకా పరీక్షలు నిర్వహించలేదు. గ్రూపు-2 పోస్టులకు గతంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ ఎన్నికల వల్ల వాయిదా వేశారు. మళ్లీ నిర్వహించే తేదీలను ప్రకటించలేదు. గ్రూపు-3 పోస్టుల పరీక్షలకు ఇప్పటి వరకు తేదీలు ప్రకటించలేదు. దాంతో వీటికి కొత్త తేదీలు ప్రకటిస్తే సరిపోతుంది. గ్రూపు-2 పోస్టుల విషయంలో మాత్రం ఇప్పటికే పరీక్షలు నిర్వహించినందున వాటి ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మేడిగడ్డ మేడిపండే!

(మొదటి పేజీ తరువాయి)



చేసుకుంది. రోజువారీగా అధికారులను విచారిస్తోంది. విచారణ పురోగతిని ఏరోజుకారోజు ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తోంది. ఇప్పుడు విజిలెన్స్ అధికారులు మధ్యంతర నివేదికను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. "మేడిగడ్డ బ్యారేజీలో 11 పిల్లర్లు(పియర్లు) దెబ్బతిన్నాయి. రూ.3,625.82 కోట్లతో బ్యారేజీని నిర్మించగా.. అందులో రూ.3,200 కోట్ల వరకు వృథా అయ్యాయి. ఈ వ్యవహారం వెనక 32 మంది అధికారుల పాత్ర ఉంది. నిర్మాణ సమయంలో ప్రతీ అధికారి ఈ వృథా ఖర్చులకు బాధ్యత వహించాలి" అని ఆ నివేదికలో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇక మేడిగడ్డకు మరమ్మతులు చేసినా.. అది వృథా ప్రాజెక్టుగానే ఉంటుందనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కాగా.. మేడిగడ్డపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసింది.

బ్యారేజీ నిండా సమస్యలే

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ఒక్క బ్లాకుకే పరిమితం కాలేదని మరిన్ని బ్లాకులకు విస్తరించిందని విజిలెన్స్ గుర్తించింది. బ్యారేజీ కుంగుబాటుకు గల కారణాలపై ప్రస్తుతం పరీక్షలు చేస్తుండగా.. తాజా నివేదిక ప్రకారం మహారాష్ట్ర వైపు ఉన్న బ్లాకులన్నింట్లో సమస్యలున్నట్లు తేలింది. ప్రస్తుతం ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్(ఈఆర్‌టీ) పరీక్షలు జరుగుతున్నాయి. ఇక కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులపై కూడా నిర్మాణ సంస్థ చేతులెత్తేసింది. కాఫర్ డ్యామ్ నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని ఇస్తేనే.. పనులు చేస్తామని తేల్చిచెప్పినట్లు సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులకు రూ.500 కోట్లకు పైనే ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. నిర్మాణ సంస్థ ఈ వ్యయాన్ని భరిస్తుందని ప్రభుత్వం.. గత ప్రభుత్వ వర్గాలు చెబుతుండగా.. డిఫెక్ట్ లయిబులిటీ కాలం(రెండేళ్లు) 2021లోనే పూర్తయినందున.. మరమ్మతుల భారం మోసే ప్రసక్తే లేదని నిర్మాణ సంస్థ చెబుతోంది. మేడిగడ్డలో 11 పియర్లను తొలగించాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. క్రమంగా సమస్య మరిన్ని బ్లాకులు/పియర్లకు విస్తరించినట్లుగా గుర్తించారు. మేడిగడ్డ బ్యారేజీని 8 బ్లాకులుగా 87 పిల్లర్లతో నిర్మించిన విషయం తెలిసిందే..! ఇప్పటి దాకా పునరుద్ధరణకు 11 పియర్లను తొలగించాల్సిందేనని నిపుణులు అభిప్రాయపడుతుండగా... క్రమంగా సమస్య మరిన్ని బ్లాకులు, పియర్లకు విస్తరించినట్లు గుర్తిస్తున్నారు. తాజా విచారణలో.. బ్యారేజీ డిజైన్లు చేసింది నిర్మాణ సంస్థే అని, సీడీవోతో బలవంతంగా డిజైన్లను ఆమోదింపజేసుకుందని తేలింది. డిజైన్ మేరకు నిర్మాణం జరగలేదని, నిర్మాణంలో లోపాలతో ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్(ఓఅండ్ఎం) వైఫల్యాలు ఉన్నాయని నిర్ధారణ అయ్యింది. 2019లోనే బ్యారేజీ నిర్మాణం పూర్తవ్వగా.. తొలి ఏడాది వచ్చిన వరదలతోనే సమస్యలు వెలుగులోకి వచ్చాయని, వాటికి మరమ్మతులు చేపట్టకపోవడం వల్లే వైఫల్యాలకు కారణమని విజిలెన్స్ గుర్తించింది.

కాఫర్ డ్యామ్ నిర్మాణంలో వేగమేదీ?

కాఫర్ డ్యామ్ నిర్మాణంలో వేగమేదీ? అక్టోబరు 21వ తేదీన బ్యారేజీ కుంగగా.. రెండునెలలు గడుస్తున్నా కాఫర్ డ్యామ్ నిర్మాణం జరుగలేదు. మధ్యలో ఎన్నికల ప్రక్రియ ఉండటంతో అధికారులు దీనిపై దృష్టి సారించలేదు. వాస్తవానికి ఇప్పటికే కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. దీనికి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) కూడా డిజైన్లను అందించింది. బ్యారేజీ ముందువైపు, వెనుక రెండు దిక్కులా కాఫర్ డ్యామ్ కట్టాల్సి ఉండగా.. నిర్మాణ సంస్థ ముందువైపు మాత్రం కాఫర్ డ్యామ్‌ను కడుతున్నట్లు తెలిపింది. ఇప్పుడు కాఫర్‌డ్యామ్ నిర్మాణం దిశలో అడుగు ముందుకు పడడం లేదు. దీంతో మొత్తం ప్రాజెక్టు పరిస్థితే ప్రశ్నార్థకంగా మారుతోంది.

అనుమతులిచ్చిన వాటికి సాయం కావాలి!

ఏఐబీపీ కింద చనాకా కొరాటా, మొడికుంటవాగు, చిన్నకాళేశ్వరం కోసం సాయం కోరాలని నిర్ణయం

» ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశం

» టీఏసీ క్లియరెన్స్ తర్వాతే పాలమూరు-రంగారెడ్డి



హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) క్లియరెన్స్ లభించిన మూడు నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ) కింద సహాయం కోరాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌కు సీడబ్ల్యూసీలోని ఇతర డైరెక్టరేట్లు, టీఏసీ క్లియరెన్స్ లభించిన తర్వాతే ఏఐబీపీ కింద దరఖాస్తు చేయాలని నిర్ణయించింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఆధ్వర్యంలో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో చనాకా కొరాటా కింద రూ.173 కోట్లు, మొడికుంటవాగు కోసం రూ.463 కోట్లు, చిన్నకాళేశ్వరం(ముక్తేశ్వర్) ఎత్తిపోతల పథకం కింద రూ.233 కోట్లు కలిపి మొత్తం రూ.869 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని ఆయన అధికారులను నిర్దేశించారు. ఏఐబీపీ కింద కేంద్రం 60 శాతం నిధులు సమకూరిస్తే... రాష్ట్రం 40 శాతాన్ని భరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులను 2021 జూలైలో కేంద్రప్రభుత్వం అనుమతి లేని ప్రాజెక్టుల జాబితాలో చేర్చగా... ప్రభుత్వం డీపీఆర్‌లు సమర్పించడంతో టీఏసీ క్లియరెన్స్‌లు లభించాయి. టీఏసీ క్లియరెన్స్‌లు దొరికితే ఏఐబీపీ కింద సహాయం పొందే అవకాశాలు ఉంటాయి. ఇక పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్ వివిధ డైరెక్టరేట్ల పరిశీలనలో ఉన్నందున.. క్లియరెన్స్ వచ్చిన తర్వాతే కేంద్ర సహాయం కోసం ప్రతిపాదనలు సమర్పించాలని నిర్ణయించారు.

కోయ్‌నా సాధ్యాసాధ్యాలపై కమిటీ

కోయ్‌నా ప్రాజెక్టు నుంచి 100 టీఎంసీల నీటిని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించుకున్న రేవంత్ సర్కారు... సాధ్యాసాధ్యాల పరిశీలన కోసం కమిటీని వేయాలని నిర్ణయం తీసుకుంది. అంతరాష్ట్ర విభాగం కమిటీని వేసి, సాధ్యాసాధ్యాలతో పాటు ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించి, నివేదిక ఇవ్వాలని రాహుల్ బొజ్జా అధికారులను ఆదేశించారు. కోయ్‌నా నుంచి ఆల్మట్టి, ఆ తర్వాత నారాయణపూర్, జూరాల కు తరలించి, తాగునీటి అవసరాలతో పాటు 20 టీఎంసీలతో కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుంచి చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. అయితే మహారాష్ట్ర నుంచి 100 టీఎంసీలు తీసుకున్నప్పటికీ ఆ జలాలు జూరాలకు చేరడం కష్టమని పలువురు నిపుణులు సూచించడంతో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసే పనిలో ప్రభుత్వం పడింది.

శ్రీశైలం మా పరిధిలో లేదు

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీటి విడుదలతో దిగువ భాగంలో 40 మీటర్ల లోతు గుంత (ప్లంజ్ పూల్) ఏర్పడిందని, దిగువ భాగంలో రక్షణ చర్యలతో పాటు కాంక్రీట్ వాల్ నిర్మాణం, స్పిల్‌వేకు అత్యవసర మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంటుందని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ)తో పాటు కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయించడం... శ్రీశైలం, సాగర్‌లపై కమిటీ వేయడం వంటి అంశాలపై తెలంగాణ ప్రభుత్వం చర్చించింది. శ్రీశైలం ప్రాజెక్టు ఏపీ ఆధీనంలో ఉన్నందున.. ఆ ప్రాజెక్టు పునరుద్ధరణ/మరమ్మతుల బాధ్యత ఏపీదేనని, తెలంగాణకు దీనితో సంబంధం లేదని తేల్చిచెబుతూ కేంద్రానికి లేఖ రాయాలని రాహుల్‌బొజ్జా ఆదేశించారు. తెలంగాణ నిర్వహణలో ఉన్న నాగార్జున సాగర్ పునరుద్ధరణ బాధ్యతను మాత్రమే తాము చూస్తామని, శ్రీశైలం ప్రాజెక్టు ఏపీయే చూసుకుంటుందని తెలంగాణ లేఖ ద్వారా కేంద్రానికి తేల్చిచెప్పనుంది.

ఉద్యమాల స్ఫూర్తి ఉట్టిపడేలా తెలంగాణ శకటం

- ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో ప్రదర్శనకు సిద్ధం
- మూడేళ్ల అనంతరం రాష్ట్రానికి అవకాశం


తెలంగాణ శకటం

న్యూఢిల్లీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈ నెల 26న ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ప్రదర్శనకు తెలంగాణ శకటం సిద్ధమైంది. దాదాపు మూడేళ్ల అనంతరం అవకాశం లభించడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని శకటాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సమాచార, పౌర సంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ 'ప్రజాస్వామ్య మట్టి పరిమళాలు- జన సామాన్య ప్రజాస్వామ్య యోధులు' శీర్షికతో ఈ శకటాన్ని రూపొందించింది. తెలంగాణ పోరాట యోధుల స్ఫూర్తిని వివరిస్తూ.. స్వీయ పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని తెలియజేస్తూ శకటాన్ని తయారు చేసింది. కొమురం భీం, రాంజీ గోండు, చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధుల స్ఫూర్తి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమ స్ఫూర్తి ఈ శకటంలో ప్రతిఫలించాయి. కాగా, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2015లో ఒకసారి, 2020లో మరోసారి తెలంగాణ శకటాన్ని ప్రదర్శించడానికి అవకాశమొచ్చింది. మూడేళ్ల నుంచి మాత్రం అనుమతి లభించడం లేదు. ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డి శకటం ప్రదర్శనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో మూడేళ్ల అనంతరం మళ్లీ శకటాన్ని ప్రదర్శించబోతున్నారు. ఈ సంవత్సరంతో పాటు మరో రెండేళ్ల పాటు గణతంత్ర ఉత్సవాల్లో రాష్ట్ర శకటాన్ని ప్రదర్శించడానికి అనుమతి లభించింది.

ఎమ్మెల్సీలుగా.. బల్మూరి, మహేష్‌గౌడ్‌ల ఎన్నిక ఏకగ్రీవం

- ఇతర పార్టీల నుంచి దాఖలు కాని నామినేషన్లు
- ఆర్‌ఐ నుంచి ధ్రువీకరణ పత్రాలు అందుకున్న నేతలు

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు గానూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ల ఎన్నిక ఏకగ్రీవమైంది. నిజానికి ఈ రెండు స్థానాలకూ ఈ నెల 29న పోలింగ్ జరగాల్సి ఉంది. వేర్వేరుగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మినహా సభలోని ఏ ఇతర పార్టీకీ ఆ రెండు సీట్లను దక్కించుకునేంత సంఖ్యాబలం లేదు. ఈ స్పష్టత ఉండడంతో కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం.. నామినేషన్ల ఉపసంహరణకు గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగియడంతో బల్మూరి వెంకట్, మహేష్‌కుమార్‌గౌడ్‌ల ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో ఇరువురికి ఆయన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



ప్రపంచవ్యాప్తంగా సంబరాలు

- న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్‌స్క్వేర్ వద్ద లడ్డూల పంపిణీ

వాషింగ్టన్/పోర్ట్ ఆఫ్ స్పెయిన్: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ వేళ ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తులు వేడుకలు జరుపుకొన్నారు. పూజలు, ఇతర మతపరమైన కార్యక్రమాలు, కారు ర్యాలీలు నిర్వహించారు. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్ స్క్వేర్ వద్ద సోమవారం స్క్రీన్‌పై రామమందిర దృశ్యాలను ప్రదర్శించారు. భజనలు, భక్తిగీతాల ఆలాపన, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. లడ్డూలు పంపిణీ చేశారు. వాషింగ్టన్ డీసీ శివారు వర్జీనియాలోని ఫెయిర్‌ఫాక్స్ కౌంటీలోని ఎస్‌వీ లోటస్ టెంపుల్‌లో ఆదివారం నాస్‌డాక్ స్క్రీన్‌పై రామమందిరం ఫొటోలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో సిక్కులు, ముస్లింలు, పాకిస్థానీఅమెరికన్లు సహా 2,500 మంది వరకు పాల్గొన్నారు. లాస్ ఏంజెలిస్‌లో సుమారు 250 కార్లతో ర్యాలీనిర్వహించారు. మార్చి 25 నుంచి రామ మందిర యాత్ర పేరిట అమెరికా, కెనడా దేశాల్లో వెయ్యి ఆలయాల సందర్శన చేపట్టనున్నట్టు వీహెచ్‌పీఏ(వరల్డ్ హిందూ కౌన్సిల్ ఆఫ్ అమెరికా), వీహెచ్‌పీసీ(విశ్వ హిందూ పరిషత్ ఆఫ్ కెనడా) ప్రకటించాయి. వాహనంలో సీతారామ, లక్ష్మణ, హనుమ విగ్రహాలనుఈ యాత్రలో ఊరేగించడంతోపాటు అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలు, ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపాయి. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కరీబియన్ దీవుల్లోని ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశంలోనూ వేడుకలు నిర్వహించారు. అయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఇప్పటికే మారిషస్ ప్రభుత్వం పూజల నిమిత్తం హిందువులకు రెండు గంటల అనుమతి మంజూరు చేసింది. పసిఫిక్ దీవుల్లోని ఫిజి దేశంలో ఈనెల 18 నుంచి 22 వరకు అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు.అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ వేళ మెక్సికో దేశంలో తొలి రామాలయాన్ని క్యూరేటరో నగరంలో సోమవారం ప్రారంభించారు. మెక్సికో దేశ తొలి హనుమాన్ గుడిని కూడా ఇదే నగరంలో ప్రారంభించారు. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ వేళ తాను భారతదేశంలో అడుగుపెట్టడం సంతోషంగా ఉందని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు డెనిస్ ఫ్రాన్సిస్ సంతోషం వ్యక్తం చేశారు.

‘దేవాదాయం’పై రంగంలోకి నిఘా విభాగం

- ప్రధాన కార్యాలయంలో ఫైళ్ల పరిశీలన
- బడ్జెట్‌పై నేడు సమావేశం

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో కొందరు అర్చక, ఉద్యోగులకు జీతాల అంశం వివాదాస్పదంగా మారిన వ్యవహారంలో నిజాలను నిగ్గు తేల్చేందుకు నిఘావిభాగం రంగంలోకి దిగింది. ఇటీవల గ్రాంట్-ఇన్-ఎయిడ్ వేతనాల చెల్లింపులో చేర్చాలంటూ 82 మందితో ఓ జాబితాను పంపగా.. ఆర్థికశాఖ దానిపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ.. ఆ ఫైల్‌ను తిప్పి పంపింది. ఈ వ్యవహారంపై ‘ఆంధ్రజ్యోతి’లో ‘దేవాదాయంలో దందా’ శీర్షికతో ఇటీవల ప్రముఖంగా కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఆధారంగా నిఘావిభాగం అధికారులు దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో సంబంధిత విభాగాల అధికారులను కలిసి, విచారించారు. కాగా.. బడ్జెట్‌లో దేవాదాయశాఖకు కేటాయింపులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించేందుకు మంత్రి కొండా సురేఖ, ముఖ్య అధికారులు మంగళవారం సచివాలయంలో సమావేశం కానున్నారు.

కొండమల్లేపల్లిలో ‘గురుకుల’ విద్యార్థిని మృతి

ఉదయం ప్రార్థనలో స్పృహ కోల్పోయిన బాలిక

ప్రభుత్వం ఆస్పత్రికి తరలించేలోపే మృతి


భార్గవి

దేవరకొండ/కొండమల్లేపల్లి, జనవరి 22: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని గురుకుల బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలిక మంగళవారం ఉదయం ప్రార్థన చేస్తూ కింద పడిపోయింది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయింది. పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేటకు చెందిన భార్గవి(14). సంక్రాంతి సెలవులు ముగియడంతో ఆదివారం సాయంత్రం తండ్రి అంజనేయులు భార్గవిని పాఠశాలలో వదిలివెళ్లాడు. భార్గవి ఆదివారం రాత్రి భోజనం చేయలేదు. సోమవారం ఉదయం మెస్‌లో కిచిడీ పెట్టగా కడుపులో ఇబ్బందిగా ఉందని తినలేదు. ఆ తర్వాత వాంతులు చేసుకున్న భార్గవి పాఠశాల ఆవరణలో ప్రార్థన చేస్తుండగా స్పృహ తప్పి పడిపోయింది. పాఠశాల సిబ్బంది దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయింది. బాలికమృతికి పాఠశాల సిబ్బంది కారణమని భార్గవి కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. భార్గవి కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నేతలు రాస్తారోకో చేశారు. భార్గవి మృతిపై విచారణ జరిపిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రేవంత్ భుజంపై బీజేపీ తుపాకీ

మోదీ దానితో బీఆర్‌ఎస్‌ని కాలుస్తారట.. బీజేపీ, కాంగ్రెస్ అక్రమ బంధాన్ని మైనార్టీలకు చెప్పండి

- పార్టీకి ప్రభుత్వానికి సమన్వయం లేకనే ఓటమి: కేటీఆర్
- ప్రచారంలో అబద్ధం, పాలనలో అసహనం.. ఇదే కాంగ్రెస్: హరీశ్





హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీ సీఎం రేవంత్‌రెడ్డి భుజం మీద తుపాకీ పెట్టి బీఆర్‌ఎస్‌ను కాలుస్తారట. అదానీని ఒకవైపు రాహుల్‌గాంధీ దొంగ అంటుంటే.. రేవంత్ మాత్రం దొర అంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ అక్రమ బంధం నల్లగొండ మున్సిపాలిటీ అవిశ్వాసంలో బయటపడింది. వారి గురించి మైనార్టీ సోదరులకు చెప్పండి" అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఉదాసీనత, మీమాంస వీడి ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఏం మాట్లాడారు? ఇపుడేం చేస్తున్నారో ప్రజలకు వివరించాలన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో నాగార్జున సాగర్ ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించే దుస్థితి వచ్చిందన్నారు. ఇలాంటి పరిస్థితి మొదటిసారి అని పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ చివరి ఆయకట్టును ఎండగడుతున్నారని.. కరెంటు కోతలు మొదలయ్యాయని, కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించి తెలంగాణ జుట్టును కేంద్రం చేతిలో పెడుతున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ వాళ్లు ఊహించలేదని, ఇష్టమొచ్చినట్లు హామీలిచ్చి.. తప్పించుకోజూస్తున్నారని, హామీలు అమలు చేసేవరకు వదిలిపెట్టే పరిస్థితే లేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కరెంటు బిల్లులు కట్టొద్దని నవంబరులోనే కోరారని, నల్లగొండ ప్రజలు బిల్లులను ఆయనకు పంపాలని సూచించారు. కాంగ్రెస్‌కు ఇప్పటికే పలు వర్గాలు దూరమయ్యాయని, కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి వెల్లువలా ఉందని, లోక్‌సభ ఎన్నికల్లో దీనిని అనుకూలంగా మలచుకోవాలన్నారు.

నల్లగొండ నీటి కటకటపై సీఎం రేవంత్ రెడ్డిని నిలదీయాలి: హరీశ్

ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరిస్తూ కృష్ణా రివర్ బోర్డులో చేరేందుకు సంతకం పెట్టిందని, దాని వల్ల కలిగే నష్టాలపై దృష్టిపెట్టలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. నల్లగొండ తాగునీటి కటకటపై కోమటిరెడ్డి స్పందించాలని, కేఆర్‌ఎంబీపై సంతకం పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీయాలని కోరారు. కాంగ్రెస్ ఎండ్రకాయల పార్టీ అని.. ఒకరి కాలు ఇంకొకరు పట్టి లాగుతుంటారని, ప్రచారంలో అబద్ధం.. పాలనలో అసహనం ఇదే ఆ పార్టీ తీరని ఎద్దేవా చేశారు. పార్టీకి ద్రోహం చేసినవారిపై చర్యలు తీసుకోవాలన్న కార్యకర్తల డిమాండ్‌ను అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. సంస్థాగత బలోపేతంపై సూచనలు వచ్చాయని, మళ్లీ పొరపాట్లు చేయకుండా సాగుదామని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. త్వరలోనే కమిటీలు వేసుకుని అసెంబ్లీ సీట్లవారీ సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. తల్లిలాంటి పార్టీని కాపాడుకుందామని.. అభిప్రాయ భేదాలు పక్కనపెట్టి ఒక జట్టులాగా పని చేయాలని హరీశ్ పిలుపునిచ్చారు. ముఖ్య నేతలు కేకే, మధుసూదనాచారి, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫిబ్రవరి మొదటి వారం నుంచి అసెంబ్లీ సమీక్షలు

బీఆర్‌ఎస్ ఓటమికి అనేక కారణాలున్నాయని, ప్రత్యర్థులు అభూత కల్పనలు, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని, సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టలేకపోయామని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పార్టీకి ప్రభుత్వానికి సమన్వయం లేకనే ఈ పరిస్థితి వచ్చిందని కార్యకర్తలు అంటున్నారని.. వారి సూచనలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలు మొదలవుతాయని చెప్పారు. తాము ఇంకా మాట్లాడడం మొదలుపెట్టకుండానే కాంగ్రెస్ వాళ్లు ఉలిక్కిపడుతున్నారని ఎద్దేవా చేశారు. నల్లగొండలో ఎన్నికల సరళి అనుకూలంగా కనిపించిందని, ఫలితాలు మరోలా వచ్చాయన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

టీఎన్‌జీవో కేంద్ర సంఘం

హైదరాబాద్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎన్‌జీవో కేంద్ర సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ సోమవారం సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. లక్డీకాపూల్‌లో ఉండే రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం కొంగరకలాన్‌కు మారడం వల్ల ఉద్యోగులకు 24 శాతం హెచ్‌ఆర్‌ఏ అమలు చేయాలని కోరారు. కాగా, టీఎన్‌జీవోల న్యాయపరమైన సమస్యలపై సీఎంతో చర్చించి పరిష్కరిస్తామని రామకృష్ణారావు ఉద్యోగ సంఘం నేతలకు హామీ ఇచ్చారు. అనంతరం టీఎన్‌జీవో నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసి సమస్యలపై చర్చించారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

రాష్ట్రానికి మరో ఐపీఎస్ యువరాజ్ మర్మట్

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో ఐపీఎస్ అధికారి యువరాజ్ మర్మట్ వచ్చారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ కేడర్‌కు చెందిన ఈ 2022 బ్యాచ్ అధికారిని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ తెలంగాణ కేడర్‌కు బదిలీ చేసింది. యువరాజ్ భార్య, తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారిణి పి.మౌనిక(2022 బ్యాచ్) తెలంగాణలో పని చేస్తున్నందున... ఆయనను ఇక్కడికి బదిలీ చేసినట్లు తెలిసింది.

అసెంబ్లీలో బడుగులకు స్థానం ఇవ్వరా?

- మంత్రి పొన్నం వ్యాఖ్యలపై కవిత స్పందన

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బడుగులకు స్థానం ఇవ్వరా ? జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని కోరితే.. దానికి రాజకీయ రంగు పులుముతారా..? అని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. సోమవారం ఎక్స్ వేదికగా పొన్నం వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని భారత జాగృతి సంస్థ కోరడమే అభ్యంతరమా లేక విగ్రహం ఏర్పాటు చేయడమే మీకు అభ్యంతరమో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే జాగృతి పోరాటం చేసి అసెంబ్లీ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించామన్నారు. స్ఫూర్తిదాయక వీరులకు మీరిచ్చే గౌరవం ఇదేనా? పూలే విగ్రహం ఏర్పాటుకోసం రాజకీయాలకు అతీతంగా మరో పోరాటాన్ని సాగిస్తామని వెల్లడించారు.

మహిళలకు 2500 తక్షణం ఇవ్వాలి: శిల్పారెడ్డి

మహాలక్ష్మి పథకంలో ప్రకటించినట్లుగా మహిళలకు ప్రతీ నెలా రూ. 2500లు తక్షణం అందించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ హామీ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే తమ మొదటి కార్యాచరణ అని ప్రకటించారు. సోమవారం శిల్పారెడ్డి మహిళా మోర్చా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు.

కొమురవెల్లి భక్తజనసంద్రం.. బండారుమయం

- ఘనంగా పెద్దపట్నం, అగ్నిగుండాల నిర్వహణ

చేర్యాల, జనవరి 22: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యంలో ఓలలాడాయి. బండారి సింగిడిమయమైంది. మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ యాదవసంఘం ఆధ్వర్యంలో పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు తయారు చేశారు. దేవదేవుడి ఆవాహనంతో షైమరిచిన శివసత్తులు, పోతరాజులు, భక్తులు పెద్దపట్నం ఎక్కి అగ్నిగుండాలు దాటారు. యాదవ పూజారులు పంచరంగులతో సర్వాంగసుందరంగా పట్నం రచించిన అనంతరం పోలీసుల బందోబస్తు నడుమ ఆలయ అర్చకులు గర్భాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి ఆసీనులుగా చేశారు. అష్టదిక్పాలక బలిహరణం చేయగానే అర్చకులు పట్నం, అగ్నిగుండాలు దాటడం ప్రారంభించారు. ఇతరులను మల్లన్నగా భావించి పసుపు పూయగా ఆలయ పరిసరాలన్నీ బండారుమయమయ్యాయి. పట్నం పూర్తయిన తర్వాత దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను తోటబావికి తీసుకువస్తుండగా తోపులాట జరిగింది. ఇద్దరు భక్తులకు గాయాలయ్యాయి.





కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ.. పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, దీపా దాస్ మున్షీ, మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు

రాహుల్ యాత్రకు అడ్డంకులు శోచనీయం

బీజేపీ నేతల కుట్రలు ఫలించవు: సీఎం రేవంత్

అసోం సీఎం క్షమాపణ చెప్పాలి: శ్రీధర్‌బాబు

కాంగ్రెస్ వేవ్‌ను చూసి బీజేపీకి భయం: మున్షీ

హైదరాబాద్/కవాడిగూడ/తార్నాక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా అసోంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై స్థానిక బీజేపీ నేతల దాడిని సీఎం రేవంత్ రెడ్డి ఖండించారు. రాహుల్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం, గుడి సందర్శనకు అనుమతినివ్వకపోవడం శోచనీయమని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్ భద్రత విషయంలో సైతం అసోం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని, ఇలాంటి చర్యలతో ఆయన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలన్న బీజేపీ నేతల కుట్రలు ఫలించబోవని వ్యాఖ్యానించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు అండగా, పేదలకు న్యాయం జరగాలన్న లక్ష్యంతో రాహుల్ తలపెట్టిన యాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతుందని చెప్పారు. రాహుల్ యాత్రపై దాడిని ఖండిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు ఇటు టీపీసీసీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. సోమవారం సాయంత్రం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ శ్రేణులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి భద్రత కల్పించడంలో అసోం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌కు అసోం సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అరాచక విధానాలను అవలంబిస్తోందని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ మండిపడ్డారు. 'దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వేవ్‌ను చూసి బీజేపీ భయపడుతోంది. వారెన్ని కుట్రలు చేసినా దేశంలో కాంగ్రెస్ జెండా ఎగరేయబోతున్నాం. రాహుల్ ప్రధాని కాబోతున్నారు.' అని వ్యాఖ్యానించారు. కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, మధుయాష్కీగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాహుల్ యాత్రపై బీజేపీ శ్రేణులు దాడి చేయడం సిగ్గుచేటని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఓయూ ప్రధాన లైబ్రరీ వద్ద నిరుద్యోగ విద్యార్థులతో కలిసి ఆయన నిరసన ప్రదర్శన చేపట్టారు.

ఖమ్మంలో జోరుగా జీరో టిల్లింగ్‌తో మొక్కజొన్న సాగు

- సాగర్ ఆయకట్టులో నీరు లేకపోవడంతో మక్కపై రైతుల దృష్టి
- వరికోసిన వెంటనే దుక్కి దున్నకుండా విత్తనాలు వేసిన రైతులు
- 45వేల ఎకరాల్లో మక్క వేస్తే.. 5వేల ఎకరాలు ఈ పద్ధతిలోనే
- నీటితో పాటు సమయం ఆదా.. ఖర్చు కూడా తక్కువ


వరి కొయ్యల్లోనే మొలకెత్తిన మొక్కజొన్న

ఖమ్మం, జనవరి 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది సాగర్ ఆయకట్టులో యాసంగి సాగుకు నీరు లేకపోవడంతో బోర్లు, బావులు, చెరువుల తోపాటు ఆరుతడి అవకాశాలున్న చోట రైతులు ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించారు. జిల్లాలోని ఆయకట్టు పరిధిలో చింతకాని, ముదిగొండ, బోనకల్, కొణిజర్ల, మధిర, రఘునాథపాలెం, కారేపల్లి, కామేపల్లి, తిరుమలాయపాలెం, వైరా, కూసుమంచి తదితర మండలాల్లో 45వేల ఎకరాలపైగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. కొన్నిచోట్ల వినూత్న పద్ధతిలో జీరో టిల్లింగ్ విధానంలో మొక్కజొన్నను విత్తారు. వరికోతలు కోసిన వెంటనే అదే తడిపైనే సాళ్లుగా మొక్కజొన్న విత్తనాలను వేశారు. జిల్లాలో సుమారు 5వేల ఎకరాల్లో రైతులు ఈ పద్ధతిలో మొక్కజొన్న సాగుచేశారు. ఇలా సాగుచేయడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతోందని రైతులు చెప్తున్నారు. మామూలుగా దుక్కి దున్ని మొక్కజొన్న సాగు చేస్తే పంట చేతికి రావడానికి 120రోజులు పడుతుండగా.. జీరో టిల్లింగ్ విధానంలో వందరోజుల్లోనే పంట చేతికి వస్తుందని చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రతి యేటా యాసంగిలో సాగర్ ఆయకట్టులో నీటి లభ్యత పుష్కలంగా ఉన్నప్పుడు మొక్కజొన్న 80-90వేల ఎకరాల్లో సాగయ్యేది. ఈ ఏడాది బోర్లు, బావులు, చెరువుల ఆధారంగా 45వేల ఎకరాల్లో మాత్రమే సాగుచేస్తున్నారు.

మూడేళ్లుగా ఇదే పద్ధతిలో సాగుచేస్తున్నా



వరి కోసిన తర్వాత దుక్కి దున్నకుండా అదే తేమలో మొక్కజొన్న విత్తనాలను నేరుగా నాటుతున్నా. ఈ పద్ధతిలో మొక్కజొన్న సాగు సులభంగా ఉంది. నాకున్న రెండెకరాల పొలంలో మూడేళ్లుగా ఇదే పద్ధతిలో సాగుచేస్తున్నా. దీంతో సమయం తక్కువతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది. నీళ్లు కూడా తక్కువ అవసరం అవుతాయి. దుక్కులు, ఎరువుల ఖర్చు ఆదా అవుతుంది. ఎకరానికి 30క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

- కొండా భాస్కర్, లచ్చగూడెం, చింతకాని మండలం

హెచ్‌సీయూలో న్యూరో ఎండోస్కోపీ కోర్సు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జనవరి22(ఆంధ్రజ్యోతి): కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (కిమ్స్) సహకారంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో న్యూరో ఎండోస్కోపీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీ జగదీశ్వర్ రావు తెలిపారు. వర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహించిన సెమినార్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడిన ఆయన... ఈ కోర్సులో న్యూరో సర్జన్లకు న్యూరో ఎండోస్కోపీలో ప్రాథమిక నైపుణ్యాలతోపాటు అధునాతన పద్ధతుల గురించిన శిక్షణ ఉంటుందన్నారు. ఈ కోర్సును కిమ్స్ ఆస్పత్రి, బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ, ఆస్కులాప్ అకాడమీ, సన్‌ఫార్మా కలిసి రూపొందించాయన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ భాస్కర్‌రావు బొల్లినేని, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్‌హెల్త్ అండ్ న్యూరోసైన్స్ సంస్థ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఆర్ శాస్త్రి, కిమ్స్ న్యూరాలజీ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి, హెచ్‌సీయూ లైఫ్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఆనంద్ కుమార్ కొండపి, హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి ప్రకాష్‌బాబులు పాల్గొని కోర్సుకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజాసేవలోకి పదండి

'రానున్న వెయ్యి సంవత్సరాల దాకా గుర్తుండిపోయే ఘట్టం' అని అన్నారు ప్రధాని నరేంద్రమోదీ. అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం తరువాత మాట్లాడుతూ మోదీ మత, జాతీయ, సాంస్కృతిక ఉద్వేగాలను మేళవిస్తూ ప్రసంగించారు. రామాలయ ఆరంభం జాతీయ వేడుక అన్నారాయన. బానిసత్వపు సంకెళ్ల విచ్ఛేదన జరిగింది కూడా ఇప్పుడే అన్నారు. ఆయన ప్రస్తావించినట్టే, భారతదేశంలోను, ప్రపంచంలోని అనేక దేశాల్లోనూ సోమవారం నాటి కార్యక్రమం ఆనందోత్సాహాలను, గర్వభావనను నింపి ఉంటుంది. అయోధ్య నేపథ్య వివాదాలతో నిమిత్తం లేకుండా అనేక మంది సాధారణ హిందువులు బాలరామ ప్రాణప్రతిష్ఠను గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమంగా పరిగణిస్తూ వేడుక జరుపుకుంటున్నారు.

దేశంలో ఐక్యతను, జాతీయ భావనను రామాలయం పటిష్ఠం చేస్తుందన్న నరేంద్రమోదీ ఆకాంక్షను ఆహ్వానించవలసిందే. రామాలయ కార్యక్రమం ప్రశాంతంగా, సర్వసమ్మతితో జరుగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన, భారతీయ సమాజంలోని సమైక్యభావాన్ని నొక్కి చెప్పారు. వందలాది ఏళ్ల నుంచి ఉన్నదని చెబుతున్న వివాదం, కనీసం ముప్పాతికేళ్లుగా కొనసాగుతున్న వివాదం ఒక కొలిక్కి రావడం సంతోషించదగినదే అయినప్పటికీ, ఈ ప్రయాణం ఏమంత ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా లేకపోవడం చరిత్ర చెబుతున్న సత్యం. భారతీయ సమాజంలో పరస్పరత, సామరస్యం, సహిష్ణుత నిరంతరం కొనసాగాలని కోరుకునేవారికి గతంలోని అప్రియమైన ఘటనలు స్ఫురించి బాధిస్తాయి. ఆ దూరాన్ని, వేదనను తగ్గించడానికి అనంతరకాలంలో జరిగే ప్రయత్నాలే దేశ సామాజిక నిర్మితిని దృఢపరుస్తాయి.

భారతీయ సంస్కృతిలో, పౌరాణిక స్మృతిలో అవిభాజ్య పాత్ర అయిన శ్రీరాముడికి సంబంధించిన ఆలయ నిర్మాణ ప్రస్థానంలో రాజకీయాలు ముడిపడి ఉండడం విచారకరమే. కొన్ని సామాజిక, సాంస్కృతిక సంస్థలు, వాటితో కలసి ప్రయాణించే రాజకీయ సంస్థ, రామాలయ నిర్మాణ ఉద్యమంలో భాగస్వాములుగా ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా, వివాద భాగస్వాముల మధ్య సంప్రదింపులను కొనసాగించి, న్యాయస్థానాలకు వెలుపల ఒక అంగీకారాన్ని సాధించి ఉంటే అది ఉత్తమమైన పరిష్కారం అయి ఉండేది. అయోధ్య ఉద్యమంతో పాటు, భారతీయ జనతాపార్టీ బలపడుతూ పోవడం రాజకీయాల ప్రమేయాన్ని స్పష్టం చేసింది. ఒకనాడు రథయాత్రలు నిర్వహించినవారు, తరువాత, న్యాయవ్యాజ్యాలలో పాల్గొన్నవారు మునుపటి తరానికి చెందిన హిందూత్వ రాజకీయ నేతలు కాగా, చివరగా సుప్రీంకోర్టు తీర్పు ద్వారా సమస్య ముగింపునకు వచ్చింది. కానీ, ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రతిష్ఠ, కీర్తి అంతా ప్రస్తుత నరేంద్రమోదీకి సంక్రమించడం విశేషం. ఆలయ నిర్మాణం ఇంకా అసంపూర్తిగా ఉండగానే, ప్రాణ ప్రతిష్ఠను ఇప్పుడు సంకల్పించడం వెనుక రానున్న ఎన్నికల దృష్టి ఉన్నదేమోనన్న విమర్శ వింటున్నాము. రామాలయ ఉద్యమంలో పాల్గొన్న రాజకీయపార్టీకి ఇది ఎన్నికల ప్రయోజనాలను అందించే సందర్భం కావడం సహజమే. రాజకీయాలు ఉన్నాయని ప్రత్యర్థులు విమర్శించడం కానీ, లేవని బీజేపీ నిరాకరించడం కానీ అనవసరం.

సోమవారం నాడు అయోధ్యలోనూ, అనేక రాష్ట్రాలలోను జరిగిన కార్యక్రమాల తీరు చూస్తే, ఇవి ప్రభుత్వ కార్యక్రమాలేమో అనిపించేట్టుగా జరిగాయి. మత, పౌర జీవనాల మధ్య సరిహద్దు చెరిగిపోయినట్టు కనిపించింది. అనేకులు కోరుకుంటున్న 'హిందూ రాష్ట్రం' వాస్తవరూపం ధరించిందేమో అనిపించింది. భారతీయ ప్రజాజీవనంలో వేగంగా వస్తున్న ఈ మార్పులు ముందుముందు ఎటువంటి ప్రభావాలను కలిగిస్తాయో చూడాలి.

విజయోత్సాహంతో పాటు వినయం కూడా ఉండాలని చెబుతూ, ఇక అభివృద్ధి మీద దృష్టి పెడదామని ప్రధాని పిలుపు ఇచ్చారు. సమర్థమైన, అద్భుతమైన, దివ్యమైన భారత్‌ను నిర్మించడానికి శపథం తీసుకోవాలని ఆయన కోరారు. రాముని తలపు కేవలం వ్యక్తి మనసులోనే కాదు, సామాజిక చేతనలో భాగం కావాలని అన్నారు. ఐక్యత, ఏకోన్ముఖ చింతన సంఘాన్ని బలశాలిని చేస్తాయనడంలో సందేహం అక్కరలేదు. ఆ సమష్టి తనం అందరి మంచికి ఉపయోగపడితే అంతకంటే కావలసినదేమున్నది? అయితే, భావనలు, ఉద్వేగాలను సంతృప్తిపరచడం సులభమే కానీ, భౌతికమయిన, వాస్తవమయిన ఆకాంక్షలను నెరవేర్చడం సులువు కాదు.

అధిక ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, నల్లధనం వంటి అనేక సమస్యలు మోదీ అనేకమార్లు ప్రస్తావించినవే. వాటిమీద ఇక దృష్టి పెట్టాలి. పదిరోజులుగా దేశంలోని వివిధ దేవాలయాలలో రకరకాల పరిచర్యలు, పూజలు చేసి, తన నిష్ఠను ప్రదర్శించిన మోదీ, ప్రజాజీవితంలోని వాస్తవ సమస్యల మీద కూడా అదే కట్టుబాటును ప్రదర్శించడానికి ప్రయత్నించాలి. మాధవ

'శ్రీరాముడు మళ్లీ అయోధ్యకు వచ్చాడు'

అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేశం నలుమూలలా కనపడుతున్న భక్తి శ్రద్ధలు, ఉత్సాహోత్సవాలు సామాన్యమైనవి కావు. సంపన్నుల కాలనీల నుంచి పూరిగుడిసెలున్నవాడల్లో కూడా ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పండుగగా జరుపుకున్నారు. దేశమంతటా కోట్లాది మంది ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని దేశ్యాప్తంగా కోట్లాది భారతీయులు తిలకించారు. రామభక్తులు ఇవాళ పేద ప్రజలకు అన్నదానాలు చేశారు. ప్రజల్లో నెలకొన్న ఈ ఉత్సాహం భారతీయ జనతా పార్టీ కల్పించింది కాదు. ప్రజలు స్వచ్ఛందంగా పూజలు నిర్వహించారు. ఊరేగింపులు జరిపారు. 500 ఏళ్ల క్రితం అయోధ్యలో శ్రీరాముడి మందిరాన్ని విధ్వంసం చేశారు. ఇప్పుడు ఆ మందిరాన్ని పునర్నిర్మించి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ చేసినందుకు ప్రజలు ఆనందాతిరేకంతో ఉన్నారు. 'శ్రీరాముడు మళ్లీ అయోధ్యకు వచ్చాడు' అన్న భావన అంతటా నెలకొంది.

భారతదేశ ప్రజల్లో ఉన్న దైవభక్తిని, ఆరాధనను, విశ్వాసాలను భారతీయ జనతా పార్టీ ఏనాడో గ్రహించినందువల్లే వాటిని కాపాడుకోవడం ద్వారానే భారతదేశ అస్తిత్వం నిలబడుతుందని భావించింది. దీనికి దీనదయాళ్ ఉపాధ్యాయ సాంస్కృతిక జాతీయ వాదం అని పేరు పెట్టారు. ఈ దేశంలో కోట్లాది మంది నిత్యం ఆలయాలను దర్శించడం, నదుల్లో మునకలు వేయడం, బ్రహ్మోత్సవాలు, జాతరలు జరుపుకోవడం ఎప్పటినుంచో ఉన్నాయి. కాశీలో పవిత్ర గంగాతీర్థం వద్ద చివరి సంవత్సరాలు గడపాలని ఎందరో వృద్ధులు ఆశిస్తారు. ప్రతి ఏడాదీ లక్షలాది మంది చార్‌ధామ్ యాత్రకు వెళతారు. తిరుమలను కోట్లాది మంది దర్శిస్తారు. మథురలో గోవర్ధన గిరి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అంతే కాదు, రమణ మహర్షి, సాయిబాబా లాంటి సాధువులను ఆరాధిస్తారు. అనేక మఠాలకు వెళతారు. హిమాలయాల్లో కేదార్‌నాథ్ నుండి, రావణుడి చెరనుంచి సీతను కాపాడేందుకు లంకకు వెళ్లేముందు తమిళనాడులోని రామేశ్వరం వరకూ శ్రీరాముడి పాదముద్రలు ఈ దేశంలో అడుగడుగునా ఉన్నాయి. దేశం నలుమూలలా జ్యోతిర్లింగాలున్నాయి. భారత నాగరికత ఆవిర్భవించిన నాటి నుంచీ ప్రజల నమ్మకాలు, సంప్రదాయాలు, చారిత్రక కావ్యాలతో సన్నిహిత సంబంధం ఉన్న అనేక ఆలయాలున్నాయి. వాటికి వేలాది మంది ప్రజలు లక్షలాది ఏళ్లుగా, ప్రాంత, కుల వ్యత్యాసాలకు సంబంధం లేకుండా యాత్రలు చేస్తున్నారు. ఇది ఒక విశిష్టమైన జాతీయ ఐక్యతను ఏర్పర్చింది. దాని గురించి అర్థం చేసుకోనంతకాలం మన సుసంపన్నమైన, వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వ సంపదను ఏ విధంగా అర్థం చేసుకోగలం?


■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

భారతదేశం కేవలం ఒక మట్టి నేలకాదు. మన దేశం అనాదిగా ఒక సాంస్కృతిక ఐక్యతను కాపాడుతున్న నేల అని డా. బీఆర్ అంబేడ్కర్ ఎప్పుడో అభివర్ణించారు. భారతదేశంలో ఉన్న సాంస్కృతిక ఐక్యత రాజకీయ, జాతిపర విభజనలను అధిగమించిందని ఆయన చెప్పారు. హిందూ సమాజంలోని అస్పృశ్యత వంటి రుగ్మతలకు నిరసనగా ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించారు కాని మరే మతాన్ని ఆయన చేపట్టలేదు. 'భారతదేశ సాంస్కృతిక నేలనుంచి నేను దూరం కాదలుచుకోలేదు' అని ఆయన చెప్పారు.

ముస్లిం పాలకులు ఈ దేశాన్ని పాలించినప్పుడు కేవలం పాలనపైనే దృష్టి కేంద్రీకరించి ఉంటే సరిపోయేది. కాని వారు ఈ దేశంలోని ప్రజల భక్తి విశ్వాసాలతో చెలగాటమాడారు. మందిరాలను ధ్వంసంచేశారు. విగ్రహాలను విరగ్గొట్టారు. అయినప్పటికీ దేశం సంస్కృతిని వారు నాశనం చేయలేకపోయారు. బ్రిటిష్ వారు కూడా సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వ సంపదే భారతదేశ వెన్నుముకగా గ్రహించారు. ఆ వెన్నుముక విరగొట్టేంత వరకూ భారతదేశాన్ని జయించలేమని మెకాలే లాంటి వారు భావించినందువల్లే స్వదేశీ సంస్కృతిని దెబ్బగొట్టాలని నిర్ణయించారు. తమ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు పూనుకున్నారు. ఏది జరిగినా అది తాత్కాలికమేనని ఇప్పుడు రుజువైంది. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంతో కొన్ని వేన వేల ఏళ్ల భారతీయ ఆత్మ జాగృతమైంది. ప్రాచీన కాలం నాటి భారతీయ మహర్షుల కఠోర తపస్సు విఫలం కాలేదని నిరూపితమైంది.



> భారత దేశం అనాదిగా ఒక సాంస్కృతిక ఐక్యతను కాపాడుతున్న నేల అని డాక్టర్ అంబేడ్కర్ ఎప్పుడో అభివర్ణించారు. మన దేశంలో ఉన్న సాంస్కృతిక ఐక్యత రాజకీయ,జాతిపర విభజనలను అధిగమించిందని ఆయన చెప్పారు. హిందూసమాజంలోని అస్పృశ్యత వంటి రుగ్మతలకు నిరసనగా ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించారు కాని మరే మతాన్ని ఆయన చేపట్టలేదు. 'భారత దేశ సాంస్కృతిక నేలనుంచి నేను దూరం కాదలుచుకోలేదు' అని అంబేడ్కర్ చెప్పారు.

మన దేశం మరే దేశానికి ఛాయ కాదు. మన ప్రత్యేకత ఏమిటో రామమందిర నిర్మాణంతో మరోసారి వెల్లడైంది. రామాయణ, మహాభారతాలు భారతదేశ జాతీయ జీవితంలో సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను ప్రభావితం చేస్తున్నాయి. రాముడిని ఒక ఆదర్శవంతమైన రాజుగా, రామరాజ్యానికి మంచి పరిపాలనకు సంకేతంగా ప్రజలు అనాదిగా భావిస్తూ వచ్చారు. రామాయణ, మహాభారతాలు మతపరమైన ఆరాధనలో భాగంగా హిందువులు భావించవచ్చు కాని అవి కేవలం హిందువులకు చెందినవి కావు. మన సాంస్కృతిక వారసత్వ సంపదలుగా వాటిని అందరూ భావించాల్సిన అవసరం ఉన్నది. ఇవాళ భారతీయుడు ఏ మతానికి చెందినవాడైనా ఈ వారసత్వ సంపదలను గుర్తించినప్పుడే దేశం సమైక్యంగా నిలబడగలుగుతుంది. కాని మన కుహనా లౌకిక వాదులు మతాల మధ్య ఘర్షణను ప్రేరేపిస్తున్నారు. హిందూ అన్న పేరు వింటేనే వ్యతిరేకించే ఈ భావనను పెంచి పోషించడం వల్లే ఇవాళ కాంగ్రెస్, కమ్యూనిస్టులను ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. సాంస్కృతిక జాతీయవాదం మన నేల పరిమళంలో ఉన్నట్లు ప్రజలు ఏనాడో గ్రహించారు. ఇవాళ ఈ జాతీయ ఆత్మ జాగృతం అయింది. ఇప్పుడు శ్రీరాముడి మందిర నిర్మాణంతో భారతదేశం ఒక సాంస్కృతిక శక్తిగా ప్రపంచంపై అపార ప్రభావం చూపగలుగుతుందనడంలో సందేహం లేదు.

భారతదేశ వాస్తవికత గమనించినందువల్లే బీజేపీ కుహనా లౌకికవాదాన్ని తిరస్కరించి సాంస్కృతిక జాతీయవాదాన్ని తన సిద్ధాంతంగా చేపట్టింది. 1989 జూన్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లోని పాలంపూర్‌లో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో రామజన్మభూమి కోసం ఉద్యమం చేపట్టాలని తీర్మానించింది. అదే సమయంలో భారతదేశం కేవలం ఒకే మత రాజ్యంగా మారాలని బీజేపీ కోరుకోలేదు. మతంతో సంబంధం లేకుండా ప్రజలందరికీ సమానత్వాన్ని కోరుకునే రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. హిందూత్వకు అసలైన సంకేతం శ్రీరాముడి ఆలయం. మెజారిటీ, మైనారిటీ అన్న తేడాల్లేకుండా పరస్పరం గౌరవించుకోవడం వల్లనే భారతీయుడి భవిష్యత్తు స్థిరంగా ఉంటుందని బీజేపీ విశ్వసిస్తుంది. 'హిందూత్వ అంటే సాంస్కృతిక జాతీయవాదం. మతపరమైన జాతీయవాదం కాదు' అని రథయాత్ర ప్రారంభించిన అద్వానీ అన్నారు. దాన్నే భారతీయత అని దీనదయాళ్ ఉపాధ్యాయ అభివర్ణించారు. ఒక ఫీనిక్స్ పక్షిలా బూడిద నుంచి ఆవిర్భవించిన సోమనాథ మందిరం ప్రపంచంలో ఏ శక్తీ ప్రజల విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేయలేరని నిరూపించిందని నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇప్పుడు రామమందిరం కూడా పూర్వవైభవాన్ని సంతరించుకోవడంతో పాటు ప్రజల మనోభావాలను ఎవరూ ఎల్లకాలం అణగదొక్కలేరని నిరూపించింది.

నాగరికతలే సంఘర్షణలకు నిలయాలా?

యుద్ధాలు మనిషికి కొత్తకాదు. తెగల మధ్య జరిగాయి. రాజ్యాల మధ్య రగిలాయి. మతాల మధ్య చెలరేగాయి. సామ్రాజ్యాల మధ్య పెట్రేగాయి. యుద్ధం గురించి అంతో ఇంతో తెలియని మనిషే లేడు. నిరంతర యుద్ధస్థితి నుంచి క్రమేపీ శాంతియుత జీవనం వైపు నడవటమే మనిషి నాగరిక పయనంగా చెప్పుకోవచ్చు. అందరికీ ఎంతో కొంత తెలిసిన నిజమిది. అస్తిత్వ సంరక్షణ, విస్తరణ కాంక్ష, జాతి ఆధిక్య ధోరణి, గుడ్డి మతాభిమానం, శ్రమ దోపిడి, సంపదను కొల్లగొట్టటం.. లాంటి కారణాలే యుద్ధాల వెనుక ఉన్నాయి. ధర్మ పరిరక్షణ, జాతి భద్రత అంటూ ఎన్ని ఆదర్శాల ముసుగులు తొడిగినా అనేక సందర్భాల్లో ఆర్థిక కారణాలే యుద్ధాలను ప్రభావితం చేశాయి. మనందరికీ ఇప్పటివరకూ సుపరిచితమైన ఈ యుద్ధ కారణాలను తలతన్నే ఇంకో మహాకారణం ఉందా? అదే భవిష్యత్తు యుద్ధాలకు దారితీస్తుందా? దీనికి అవునంటూ 30 ఏళ్ల క్రితం చేసిన ఒక ప్రతిపాదన సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. 1993లో 'ఫారిన్ అఫైర్స్ మ్యాగజీన్'లో ప్రచురితమైన ఓ వ్యాసంలో చేసిన ఆ ప్రతిపాదన.. రాజకీయ, మేధో ప్రపంచాలను కుదిపివేసింది. దాని రచయిత శామ్యుల్ పి.హన్టింగ్‌టన్. ఆ వ్యాసానికి 'నాగరికతల మధ్య సంఘర్షణ' అని పేరు పెట్టారు. 28 పేజీల వ్యాసంలో వెలిబుచ్చిన భావాలపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన చర్చ అసాధారణమైంది. పత్రికలు, టీవీలు, విశ్వవిద్యాలయాలే కాదు.. చట్టసభల్లోనూ పౌర వేదికలపైనా వాదోపవాదాలు జరిగాయి. హన్టింగ్‌టన్ భావాలను ఖండిస్తూ వందలాది పుస్తకాలు వచ్చాయి. ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. పైపైన చూస్తే 'నాగరికతల సంఘర్షణ' భావంపై వాదోపవాదాల తీవ్రత ఇప్పుడు తగ్గినట్టే కనపడుతుంది. కానీ దాన్ని రకరకాల రూపంలో ఆచరించే, సమర్థించే వారి సంఖ్య మాత్రం పెరుగుతోంది.



> ప్రపంచ రాజకీయాలను నాగరికతల సంఘర్షణలు ప్రభావితం చేయనున్న విషయాన్ని చెప్పటమే తన ప్రతిపాదన లక్ష్యమని హన్టింగ్‌టన్ చెప్పినా అన్ని దేశాలూ క్రమేపీ పాశ్చాత్య నాగరికత వైపు వెళితేనే ఉద్రిక్తలు తగ్గుతాయన్న భావం ప్రధానంగా వ్యక్తం అవుతుంది. 'పాశ్చాత్య నాగరికత.. ఒక విశ్వనాగరికత. మనుష్యులందరికీ అది నప్పుతుంది' అని ప్రముఖ రచయిత వి.ఎస్. నైపాల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించటంలో ఉద్దేశం అదే. అందుకే హన్టింగ్‌టన్‌ను వ్యతిరేకించే వారూ ఎక్కువే ఉన్నారు.

ప్రతి భావానికీ నేపథ్యం ఉంటుంది. నాగరికతల సంఘర్షణా దీనికి మినహాయింపు కాదు. 1990ల నాటికి ప్రపంచ రాజకీయాలు మారిపోయాయి. సోషలిస్టు రాజ్యాలు కుప్పకూలాయి. చైనా ఆర్థిక విధానాలు మారిపోయాయి. ప్రచ్ఛన్నయుద్ధం ముగిసింది. స్వేచ్ఛా మార్కెట్ విధానాలే మానవాళికి గత్యంతరమన్న వాదన బలపడింది. ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయం లేదన్న భావన దేశాలను ప్రభావితం చేసింది. సోషలిజం, క్యాపిటలిజం అడ్డుగోడలు కూలిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఆర్థిక కారణాలు, సైద్ధాంతిక విభేదాలు ఇక మీదట ప్రపంచ రాజకీయాలను ప్రగాఢంగా ప్రభావితం చేయలేవనీ, నాగరికతల మధ్య సంఘర్షణలే భవిష్యత్తు యుద్ధాలకు కారణాలవుతాయని హన్టింగ్‌టన్ ప్రతిపాదించారు. మరి ప్రపంచ రాజకీయాల్లో దేశాల పాత్ర ఏమిటి? అవి ప్రాధాన్యాన్ని కోల్పోతాయా? వాటి మధ్య వైషమ్యాలు ఉండవా? పరస్పరం కలహించుకోవా? ఆర్థిక ఆధిక్యత కోసం పెనుగులాడవా? అంటే అవన్నీ కూడా ఏదో ఒకస్థాయిలో ఉంటాయి. కానీ ఒక నాగరికతలో భాగమైన దేశాల మధ్య విభేదాలు విషమించి తీవ్ర యుద్ధాలకు దారితీయవు. అవి ఏదో ఒక స్థాయిలో పరిష్కారం అవుతాయి. భిన్న నాగరికతలకు చెందిన దేశాల మధ్య తలెత్తే సంఘర్షణలు ఇందుకు పూర్తి భిన్నం. అవి యుద్ధాలకు దారితీసే ప్రమాదం ఉంటుంది. సంఘర్షణలకు దారితీసే నాగరికతలు ప్రపంచంలో ఎన్ని ఉన్నాయని ప్రశ్నించుకుంటే అవి ప్రధానంగా ఎనిమిదికి మించి కనపడవు. అందులో మొదటిది పాశ్చాత్య నాగరికత. రెండోది కన్‌ఫ్యూషన్ (చైనా), మూడోది జపాన్, నాలుగోది ఇస్లామిక్, అయిదోది హిందూ, ఆరోది స్లావిక్–ఆర్థడాక్స్ (రష్యా–కొన్ని తూర్పు యూరోపు దేశాలు), ఏడోది లాటిన్ అమెరికా, చివరిది ఆఫ్రికా నాగరికత. ఆఫ్రికా నాగరికతలకు తన విశ్లేషణలో హన్టింగ్‌టన్ పెద్ద ప్రాధాన్యం ఇవ్వలేదు.

ఈ నాగరికతల మధ్య తేడాలు మౌలికమైనవి. అవి సృష్టించిన, సృష్టిస్తోన్న భిన్న వైఖరులు ఏమిటి? ప్రతి నాగరికత మనుషుల మధ్య సంబంధాలనే నిర్దేశిస్తుంది. అలాగే వ్యవస్థలు–వ్యక్తుల మధ్య విధిగా ఉండాల్సిన సంబంధాలను శాసిస్తుంది. దైవం–మనిషి, వ్యక్తి–సమూహం, పౌరుడు–రాజ్యం, పిల్లలు–తల్లిదండ్రులు, భార్య–భర్త, హక్కులు–బాధ్యతలు, అధికారం–స్వేచ్ఛ, సమానత్వం– తారతమ్యం లాంటి విషయాల చుట్టూనే నాగరికతలన్నీ తిరుగుతాయి. మత సాహిత్యమంతా దైవం–మనిషి సంబంధాలను వివరించేదే. రాజకీయ సిద్ధాంతాలన్నీ పౌరుడు–రాజ్యం మధ్య సంబంధాలను విశ్లేషించేవే. అందుకే పైన చెప్పిన సంబంధాల మంచిచెడులను నిర్దేశించటమే నాగరికతల సారాంశం. కథలు, గాథలు, కావ్యాలను తరచిచూసినా చివరికిదే కనపడుతుంది. ప్రతి నాగరికతలోనూ సంబంధాలు భిన్నంగా ఉంటాయి. హిందూ నాగరికతలో వివాహం ధర్మబద్ధమైన ఘటన. దానికి విచ్ఛిన్నత లేదు. ఇస్లాంలో అది ఒక ఒడంబడిక. కులాలు హిందువులకు చాలా సహజమైనవి. ఇస్లాంలో ఏకేశ్వరోపాసన ప్రధానం. హిందువుల్లో బహు దేవతారాధన సహజం. ఇట్లా ఎన్ని తేడాలనైనా చెప్పుకోవచ్చు.


■ రాహుల్ కుమార్

భిన్న నాగరికతల మధ్య సంబంధాలు బాగా పెరుగుతున్నాయి. నాగరికతల తేడాలు మరింత స్పష్టంగా మన మనస్సుల్లో నాటుకోటానికి ఇవి కారణం అవుతున్నాయి. నాగరికతల్లోని సారూప్యతలు, తేడాలు మనలో సానుభూతిని, భేదభావాన్ని బాగా ప్రభావితం చేస్తున్నాయి. వలస వచ్చే ఆఫ్రికా ప్రజలపై ఫ్రాన్స్‌లో వ్యతిరేకత ఉంది. అదే పోలెండు నుంచి వచ్చే క్యాథలిక్కుల పట్ల సానుకూలత వ్యక్తమవుతుంది. జపాన్ పెట్టుబడుల పట్ల అమెరికాలో విముఖత ఉంటుంది. కెనడా, యూరోపు పెట్టుబడుల విషయంలో అది కనపడదు. ప్రజల నాగరికతను బట్టి సుముఖత, విముఖతలు భిన్నంగా ఉంటాయనటానికి ఇట్లాంటివన్నీ నిదర్శనాలు. ఆధునిక ఆర్థిక విధానాలతో ఉపాధి కోసం ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వస్తోంది. మనిషి స్థానికతకు అర్థం లేకుండా పోతోంది. ప్రపంచీకరణతో జాతీయ రాజ్యాలు (నేషన్ స్టేట్స్) బలహీనం అవుతున్నాయి. 'నేను ఫలానా రాజ్యం–దేశానికి చెందిన వ్యక్తిని' అని చెప్పుకోవటం తగ్గిపోతోంది. మతపరంగా ఫలానా వ్యక్తినని చెప్పుకోవటం పెరుగుతోంది. మత దృష్టి పెరగటంతో ఛాందస ధోరణులు విజృంభిస్తున్నాయి. యువకులు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, సాంకేతిక నిపుణులు మతపరమైన గుర్తింపును, ఆధిక్యతను ప్రదర్శించటంలో ముందుంటున్నారు. ప్రపంచమే లౌకికవాదానికి వ్యతిరేక దిశలో కదులుతోంది. పాశ్చాత్య ప్రపంచం అన్నిరకాలుగా ఉచ్ఛస్థితికి చేరుకుంటే సాంస్కృతికంగా సొంత మూలాల్లోకి వెళ్లాలన్న తాపత్రయం మిగతా దేశాల్లో పెరిగిపోతోంది. ఇస్లాం దేశాల్లోనే గాక భారత్, జపాన్, రష్యాల్లోనూ ఇది కనపడుతోంది. ఒకప్పుడు ఈ దేశాల్లో చదువరులు పాశ్చాత్య విలువలు, వైఖరుల వైపు మొగ్గుచూపే వారు. సాధారణ ప్రజలు స్థానిక సంస్కృతుల పరిధుల్లోనే ఉండి పోయేవారు. ఇప్పుడది మారిపోయింది. చదువరులు పాశ్చాత్య విలువల పట్ల విముఖతను ప్రదర్శిస్తుంటే.. కిందిస్థాయి ప్రజలు పాశ్చాత్య అలవాట్లు, అభిరుచుల వైపు మొగ్గు చూపుతున్నారు. రాజకీయ, ఆర్థిక విషయాల్లో మనుషుల వైఖరులు తొందరగా మారతాయి. సాంస్కృతిక మార్పులు వాటంత వేగంగా జరగవు. కమ్యూనిస్టులు సునాయాసంగా ప్రజాస్వామ్యవాదులుగా మారుతారు. ధనికులూ పేదలూ అటూఇటూ అవుతారు. కానీ రష్యన్లు ఎస్టోనియన్లుగా మారలేరు. సాంస్కృతిక అస్తిత్వాన్ని తేలికగా మార్చుకోలేం. మత, జాతి ప్రత్యేకతా భావాలు మనుషులను వేరుచేస్తాయి. ఒకపట్టాన వాటిని వదులుకోలేరు. సంస్కృతుల్లో సారూప్యత ఉన్న దేశాల మధ్య ఆర్థిక సహకారం ఎక్కువగా ఉంటుంది. యూరోపు దేశాల మధ్య అది ఎక్కువగా ఉండటానికి క్రైస్తవం, ఉమ్మడి సంస్కృతి ప్రధాన కారణం. జపాన్‌కు ఈ సౌలభ్యం అంతగా లేదు. చైనాకు కొంతమేరకు ఇది ఉంది. ప్రజలు ఎంతగా తమ అస్తిత్వాన్ని.. జాతి, మత పరంగా నిర్వచించుకుంటే అంతగా 'మనం–ఇతరులు' అనే ధోరణి పెరిగిపోతుంది. సోషలిస్టు ప్రభావం అంతరించాక తూర్పు యూరపు, రష్యాల్లో ఇదే జరుగుతోంది.

ఏడు నాగరికతల్లో (ఆఫ్రికా మినహా) ప్రబల శక్తిగా ఉన్న పాశ్చాత్య దేశాల కూటమి (అమెరికా, కెనడా, పశ్చిమ యూరపు దేశాలు) అన్నింటా (1993 నాటికి) ఆధిక్యతను ప్రదర్శిస్తోంది. అంతర్జాతీయ సంస్థలన్నీ ఈ కూటమి ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయి. ప్రపంచ బాగు కోసమేనని చెబుతూ తమకు బాగా మేలుచేసే విధానాలను పాశ్చాత్య కూటమి ఇతర దేశాలపై రుద్దుతోంది. ఈ కూటమికి చైనా నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. కొన్ని ఇస్లాం దేశాలను కలుపుకొని చైనా ఈ దిశగా కదులుతోంది. భిన్న నాగరికతలకు చెందిన చైనా, ఇస్లాం దేశాలు ఎందుకు సహకరించుకుంటున్నాయి? పాశ్చాత్య ఆధిక్యతను ఎదుర్కోటానికే అది పరిమితమన్న భావనను హన్టింగ్‌టన్ వ్యక్తం చేశారు. నాగరికతల సంఘర్షణ చైనాలోనూ ముస్లింల అణచివేత రూపంలో కనపడుతోంది. రష్యాలో ముస్లింల అణచివేతను అలాగే అర్థం చేసుకోవాలి. బాబ్రీ విధ్వంసం తర్వాత భారత్‌లో తలెత్తుతున్న హిందూ ఆధిపత్య ధోరణులను నాగరికతల సంఘర్షణగానే హన్టింగ్‌టన్ పేర్కొన్నారు.

ప్రపంచ రాజకీయాలను నాగరికతల సంఘర్షణలు ప్రభావితం చేయనున్న విషయాన్ని చెప్పటమే తన ప్రతిపాదన లక్ష్యమని హన్టింగ్‌టన్ చెప్పినా అన్ని దేశాలూ క్రమేపీ పాశ్చాత్య నాగరికత వైపు వెళితేనే ఉద్రిక్తలు తగ్గుతాయన్న భావం ప్రధానంగా వ్యక్తం అవుతుంది. 'పాశ్చాత్య నాగరికత.. ఒక విశ్వనాగరికత. మనుష్యులందరికీ అది నప్పుతుంది' అని ప్రముఖ రచయిత వి.ఎస్. నైపాల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించటంలో ఉద్దేశం అదే. అందుకే హన్టింగ్‌టన్‌ను వ్యతిరేకించే వారూ ఎక్కువే ఉన్నారు. ఒకటి మాత్రం నిజం. నాగరికతలు, సంస్కృతుల విశిష్టతలను ఆధిక్యతా ధోరణిలో ఘనంగా చెప్పుకుంటున్న వారి వల్లే మానవహక్కులు నలిగిపోతున్నాయి. విశ్వజనీన విలువలు శిథిలమవుతున్నాయి. అసమ్మతి గళాలపై నిర్బంధాలు అమలవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

రాష్ట్రం ఏర్పడిన పదేళ్ళకి కోరుకున్న తెలంగాణ!

'ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడ మానవుడు సగర్వంగా తలెత్తుకుని తిరుగుతాడో, ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా వికసిస్తుందో, ఎక్కడ మనసు నిరంతరం వికసించే భావాలలోకి నీచే నడుపబడుతుందో, అటువంటి స్వేచ్ఛా స్వర్గానికి, ఓ తండ్రీ నా దేశాన్ని మేల్కొలుపు' అని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నట్టు తెలంగాణ స్వేచ్ఛకోసం దశాబ్ద కాలంగా పరితపించింది. తెలంగాణ జనావళి కోరుకున్న ఆ స్వేచ్ఛ గత దశాబ్దకాలపు నియంతృత్వ పాలనలో కొరవడింది. ఇప్పుడు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో లభిస్తున్నది. నెల రోజుల్లోనే ఎంత మార్పు! పాలనతోపాటు పాలకులు ప్రజలకు అందుబాటులోకి రావడంతో అన్ని వర్గాలు హర్షిస్తున్నాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత పదేండ్లుగా గడీలను తలపించిన పాలనతో విసిగి వేసారిన తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి పాలన సాంత్వన కలిగిస్తున్నది.

త్యాగాల పునాదుల మీద అనేక పోరాటాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు అడుగడుగునా అవినీతికి పాల్పడి నియంతృత్వ ధోరణిని ప్రదర్శించారు. మేము పాలకులం మీరు సేవకులు అనే రీతిలో ప్రవర్తించి నిర్బంధం పెంచారు. స్వేచ్ఛను హరించి ప్రజాస్వామ్యాన్ని దూరం చేశారు. తెలంగాణ ఉద్యమ పోరులో అమరులను చూసి తల్లడిల్లిన కాంగ్రెస్ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో సమిధగా మారి మరీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది. ప్రాణాలు బలి ఇచ్చిన అమరుల కుటుంబాలతోపాటు ఉద్యమించిన ప్రజలను, ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని, పార్టీ అధినేత్రి సోనియాగాంధీని కేసీఆర్ మోసం చేశారు. తెలంగాణ వస్తే ప్రజలందరి బతుకులు బాగుపడుతాయనుకుంటే కేసీఆర్ కుటుంబ సభ్యులు, వారి వందిమాగధులు తప్ప, ఏ ఇతర వర్గం ప్రయోజనం పొందలేదు. పైగా కక్షపూరిత వాతావరణం, నిర్బంధకాండ పెచ్చుమీరింది. ప్రశ్నిస్తే కేసులు పెట్టి స్వేచ్ఛకు భంగం కలిగించారు. ధర్నా చౌక్ ఎత్తివేశారు. నిరసన తెలిపితే కేసులు పెట్టించారు. అన్యాయంపై అణచివేతపై తిరుగుబాటు చేసే తత్త్వం, పెత్తందారితనాన్ని ధిక్కరించే స్వభావం తెలంగాణ ప్రజలకు సహజంగానే ఉంటుంది. దశాబ్దకాలంగా బాధలను మౌనంగా భరించిన తెలంగాణ ప్రజలు గత నాయకత్వంపై ప్రజాస్వామ్య బద్ధంగా ఓట్లతో తిరుగుబాటు చేశారు. మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడ్డారు.

> నిన్నమొన్నటిదాకా సచివాలయం పార్కింగ్ ప్రాంతం క్రికెట్ గ్రౌండ్‌లా ఖాళీగా దర్శనమిచ్చేది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక పరిస్థితి మారింది. నేనున్నదే మీ కోసం అన్నట్లు ప్రజల గుండెల్లో రేవంత్ రెడ్డి తనదైన ముద్ర వేసుకుంటున్నారు. సమస్యలతో, అర్జీలతో వచ్చే వారందరితో సచివాలయం ఫ్లోర్‌లు అన్నీ కిటకిటలాడుతున్నాయి. వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం సరిపోవడం లేదు.



ప్రభుత్వం ఏర్పడి కేవలం నెలరోజులే దాటింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, వ్యవహరిస్తున్న తీరు అందరి నోటా మన్ననలు అందుకుంటున్నది. ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి లేకుండా రేవంత్ రెడ్డి సాగిస్తున్న పాలన భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు ఇస్తుందన్న విశ్వాసం పెరుగుతున్నది.

డిసెంబర్ 7న ఎల్బీ స్టేడియం వేదికగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తక్షణమే గడీల పాలనకు రేవంత్ రెడ్డి చరమగీతం పాడారు. ప్రగతి భవన్ ఇనుప కంచెలను కూల్చివేసి ప్రగతి భవన్ పేరును ప్రజా భవన్‌గా మార్చారు. ప్రజల సొమ్ముతో కట్టిన భవన్‌లోకి ప్రజలు స్వేచ్ఛగా రావచ్చని స్వాగతించారు. ప్రజల బాధలు తెలుసుకుని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి హోదాలో స్వయంగా ప్రజావాణికి శ్రీకారం చుట్టారు. ఇక్కడే పాలనలో తన మొదటి మార్క్ చూపించారు. తన ప్రభుత్వం తెలంగాణ ప్రజల కోసమే అన్న సంకేతం పంపించారు.

ఎన్నికల్లో గెలిచిన పార్టీకి, ముఖ్యమంత్రికి ఓడినవారు రాజకీయాలను పక్కనపెట్టి శుభాకాంక్షలు చెప్పడం ఆనవాయితీగా వస్తుంది. ఎన్నికల్లో పరాజయం పొందిన కేసీఆర్ దీన్ని పాటించకపోవడం విమర్శలకు దారితీసింది. కనీసం ఆయనకు ఓటు వేసిన ప్రజలకు కూడా ధన్యవాదాలు చెప్పలేదు. రేవంత్ రెడ్డి మాత్రం రాజకీయాలు పక్కన పెట్టి తుంటి ఎముక విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను పరామర్శించారు. ఈ సన్నివేశంతో రేవంత్ రెడ్డి గొప్ప వ్యక్తిత్వం తెలిసొచ్చింది. తన కోసం ట్రాఫిక్ నిలిపివేయద్దంటూ పోలీసు అధికారులకు ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలు అందరి మన్ననలు అందుకున్నాయి. చిన్న చితకా లీడర్లే హంగామా కనబర్చే ఈ రోజుల్లో స్వయానా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలా చెప్పడంతో అధికారులే నివ్వెరపోయారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లే దివ్యాంగురాలైన రజనీకి ఉద్యోగం ఇవ్వడం, చనిపోయిన కానిస్టేబుల్ భార్యకు అదే శాఖలో ఉద్యోగం కల్పించడం ఆయన మానవతా దృక్పథానికి మచ్చుతునక. అంతేగాక ప్రజా పాలనలో భాగంగా అందజేసిన దరఖాస్తు ఫారాల్లో అమర వీరులకు న్యాయం చేసేలా ఒక అంశాన్ని పేర్కొని తెలంగాణ కోసం ప్రాణాలిచ్చిన వ్యక్తుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణ పోరాట యోధులను గుర్తించి వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా అన్యాయం జరిగిన నిరుద్యోగ అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చర్యలు చేపట్టడం మరో మంచి చర్య.

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో సామాన్యులెవరైనా నిర్భయంగా ప్రజాభవన్‌కు, సచివాలయానికి వచ్చే స్వేచ్ఛను కల్పించారు. ప్రజలకు అధికారులు, అమాత్యులు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. తన ఇంటి నుండి వచ్చే మార్గంలో వినతులను ఇచ్చేందుకు వచ్చిన వారిని చూసి కాన్వాయ్ నుంచి దిగి సమస్యలు విని వినతి పత్రాలు స్వీకరించారు. ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలా ముఖాముఖీ ప్రజలను కలుసుకోవటం చాలా అరుదు. నేనున్నదే మీ కోసం అన్నట్లు ప్రజల గుండెల్లో రేవంత్ రెడ్డి తనదైన ముద్ర వేసుకుంటున్నారు. తన కాన్వాయ్ పోతున్న సమయంలో అంబులెన్స్ వస్తుంటే దారి ఇచ్చి అంబులెన్స్ వెళ్లిపోయాక తన ప్రయాణం సాగించిన గొప్ప వ్యక్తి రేవంత్ రెడ్డి. అదే విధంగా ప్రజలకు నష్టం చేసే నిర్ణయాలు తీసుకున్న అవినీతి అధికారులను ప్రాధాన్యం లేని శాఖలకు బదిలీ చేశారు.

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 9న ఆరు గ్యారంటీలకు శ్రీకారం చుట్టి రెండు గ్యారంటీల అమలుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూనుకున్నది. గ్యారంటీల అమలు సంక్షేమానికి సంబంధించినదైనప్పటికీ ఈ నిర్ణయం స్వేచ్ఛతో ముడిపడి ఉన్నది. గత ప్రభుత్వంలో మహిళలకు పెద్దగా ప్రాధాన్యత లేనప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు స్వేచ్ఛ లభించింది. క్యాబినెట్‌లో ఇద్దరు మహిళలకు స్థానం కల్పించడంతోపాటు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి స్వేచ్ఛగా ఉండేలా గౌరవం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే.

ఇప్పుడు తాము కోరుకున్న మార్పు వచ్చిందని జనం సంబురపడుతున్నారు. గ్రామ సచివాలయాల దగ్గరి నుంచి రాష్ట్ర సచివాలయం వరకు కార్యాలయాలు కళకళలాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర సచివాలయంలోని అన్ని ఫ్లోర్లూ ఖాళీగా దర్శనమిచ్చేవి. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, అధికారులు చాలావరకు అందుబాటులో ఉండేవారు కారు. దీంతో పాలన అస్తవ్యస్తంగా సాగేది. సచివాలయం పార్కింగ్ ప్రాంతం క్రికెట్ గ్రౌండ్‌లా ఖాళీగా దర్శనమిచ్చేది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక పరిస్థితి మారింది. అటెండర్ నుంచి ఐఏఎస్‌ల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. సమస్యలతో, అర్జీలతో వచ్చే వారందరితో అన్ని ఫ్లోర్‌లు కిటకిటలాడుతున్నాయి. వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం సరిపోవడం లేదు. 'ఇప్పుడు వినేవాళ్లు ఉన్నారు. సమస్యలు పరిష్కరించేవాళ్లు ఉన్నారు. అందుకే సచివాలయానికి వస్తున్నాం' అంటున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది.

• బోరెడ్డి అయోధ్య రెడ్డి
తెలంగాణ ముఖ్యమంత్రి సీపీఆర్‌ఓ



2024 కవిత

గిప్పుడు నిప్పు కల్లి పొరలు లేచిన నెగడు
పొగిలి రగిలిన తరంగ సుడిగాలి అగడు తల్లే
పాత గంగాలం కొత్త నీటి జల ప్రవాహ కైత్యం
పునర్జన్మ అబద్ధం గడియలో
పునర్మాణం ద్రోహపద్దు

ఆలి అమ్మకం అందొచ్చిన అవకాశవాది
సమూహ అవార్డ్
బానిసలూ... బంధుగణం బలి గుణం
పదవి వ్యామోహవాదం
గూస్ బంప్స్ గానం కాకులబంధం
పోప్ గింజలు కమ్యూనిస్టులూ
కారు కిరాయి మూకదాడి
సెక్యులర్ ముసుగు లిక్కర్దందా కవ్లే!
సకలం ముఖిలం కచర గాడి పేర్మీద
అవార్డ్ లక్ష పదారూపథకం

హర హరీ! క్రిస్టియన్స్ గిటార్!
ముస్లిం హర్యాలీ!! డప్పుల్ భజా...
అగ్రకుల కొరడా! పాడనా! జై భీమ్ పాట
భోగం మాస్టర్ ఆఫ్ కీ
సీటుకు నోటు ఏనుగును అమ్మిన
బహుజనపార్టీ చేరిక స్థలంల
సెక్యులా నక్షత్రం పుంతలో పై రవి!
కవి కాంచెన్ బ్రోకరిజం 2024

– వేముల ఎల్లయ్య

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



వినతులు స్వీకరిస్తున్న జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్

వినతుల స్వీకరణతోనే సరి..

- సమస్యలు పరిష్కారం కావడం లేదు..
- కుక్కలు, కోతుల బెడద నుంచి రక్షించాలి..
- బల్దియా ప్రజావాణిలో ప్రజల విన్నపాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 22 : వినతుల స్వీకరణతోనే సరిపెడుతున్నారని, సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ ప్రజలు జీడబ్ల్యూఎంసీ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి జరిగింది. ప్రజలు వివిధ సమస్యలపై వినతులు అందచేశారు. వినతుల స్వీకరణ మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తే న్యాయం జరుగుతుందని ప్రజలు విన్నవించారు. జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 57 వినతుల సమర్పణ జరిగింది. ప్రజావాణి వినతుల వివరాలు ఇలా.....

- వరంగల్‌లోని 17వ డివిజన్‌లోని స్తంభంపల్లి ఆదర్శనగర్‌కు చెందిన మావిశెట్టి సురేందర్ తాగునీరు సరఫరా కావడం లేదని ఫిర్యాదు చేశారు. అంతకు ముందు తమకు యధావిధిగా నల్లా వచ్చేదని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసిన తరువాత గతంలో ఉన్న నల్లా నీరు కూడా రావడం లేదన్నారు. ఆస్తి, నల్లా పన్ను సక్రమంగా చెల్లిస్తున్నామన్నారు.
- వరంగల్ మక్కా మసీద్ ప్రాంతంలో డ్రెయినేజీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మసీద్ కమిటీ ప్రతినిధులు తెలిపారు.
- ఫోర్ట్ వరంగల్ ఈద్గాలో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించాలని పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతూ కమిటీ ప్రతినిధులు కోరారు.
- భీమారం ఎర్రగట్టుగుట్ట శ్రీనివాస కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రోడ్లపై మురికినీరు చేరుతోందని ఫిర్యాదు చేశారు. కాలనీలోని రోడ్ నెంబర్-1లో కల్వర్టు దెబ్బతినడంతో మురికినీరంతా రోడ్లపైకి చేరి దుర్గంధం వ్యాపిస్తుందని, సమస్యను పరిష్కరించాలని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడురాజయ్య, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్ విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీలోని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పన, విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ రెవెన్యూ కాలనీ-3 డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ఎస్ సాయిలు, ప్రధాన కార్యదర్శి జే దేవేందర్‌రావు కోరారు.
- హనుమకొండ భీమారం విద్యారణ్యపురి ఇంటి నెంబరు 2-12-14/1కు చెందిన డాక్టరు ఉప్పు శివనాగయ్య నల్లా పన్ను విషయమై ఫిర్యాదు చేశారు. తన ఇంటికి నల్లా లేనప్పటికీ పన్ను డిమాండ్ నోటీసు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై పలుమార్లు కాజీపేట సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు.
- హనుమకొండ గుండ్ల సింగారానికి చెందిన తిరుపతి కుక్కలు, కోతుల సమస్య నుంచి నగర ప్రజలకు విముక్తి కల్పించాలని కోరారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో కుక్కలు, కోతులు గుంపులుగా ఉంటూ ప్రజలపై దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు.
- 64వ డివిజన్ మడికొండలోని శ్రీనగర్ కాలనీ, శ్రీసాయి కాలనీ ప్రజలు డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.
- 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు కబ్జాకు గురవుతోందని రమేశ్, శ్రీధర్, శరత్ తదితరులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే చెరువు కొంత భాగం కబ్జాకు గురైందని కబ్జారాయుళ్లు మరింతగా ఆక్రమించే చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే పరిరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కబ్జాకు గురైన చెరువు విషయంలో విచారణ జరిపించి స్వాధీనం చేసుకోవాలని, హద్దులు పెట్టాలని కోరారు. అదనపు కమిషనర్ రవీందర్ యాదవ్, ఎస్ఈలు క్రిష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీపీ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేశ్ పాల్గొన్నారు.



వరంగల్ భద్రకాళి దేవాలయం నుంచి ప్రారంభమైన శ్రీరాముడి శోభాయాత్ర



కమలాపూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మార్మోగిన శ్రీరామ నామం

- ఊరూవాడ శ్రీరాముడికి పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు
- శోభాయాత్రలు, అన్నదానాలు, కల్యాణాలు
- బాలరాముడి ప్రాణప్రతిష్ఠను టీవీల్లో వీక్షించిన ప్రజలు
- పులకించిన భక్త జనం
- అయోధ్య రామమందిర అక్షింతల పంపిణీ
- సాయంత్రం ఇళ్ల ముందు వెలిగిన దీపాలు

హనుమకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచే అన్ని దేవాలయాల్లో సందడి మొదలైంది. ఆదివారమే గ్రామాలు, పట్టణాలు, పలు కాలనీల్లోని దేవాలయాలను శుభ్రం చేసి అందంగా ముస్తాబు చేశారు. ఒక పక్క అయోధ్యలో కార్యక్రమం జరుగుతుండగా మరో పక్క గుళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణాలను, హోమాలను, శ్రీరామ జయజయ రామ మహాజప యజ్ఞాలను, హనుమాన్ చాలీసా, సుందరకాండ, రామ చరిత మానస్ పారాయణం, అన్నదానాలను నిర్వహించారు. అక్షింతలను పంపిణీ చేశారు. భక్త బృందాలు భజనలు చేశాయి. పలు చోట్ల సీతారామ చంద్ర స్వామి విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించారు. మహిళలు కోలాటాలు ఆడారు. కళాకారులు సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయ వేషధారణలో పాల్గొన్నారు. రామాయణ ఘట్టాలను ప్రదర్శించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, బీజేపీ కార్యకర్తలు ఓం జెండాలతో ర్యాలీలు నిర్వహించారు. దారి పొడవున శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేశారు.

ప్రత్యేక పూజలు

భక్తులు తమ ప్రాంతాల్లోని సీతారామచంద్రస్వామి ఆలయాలు, భక్తాంజనేయ స్వామి ఆలయాలతో పాటు ఇతర అన్ని ప్రసిద్ధ దేవాలయాలకు చేరుకున్నారు. ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. ప్రజలు తమ ఇళ్ల ఎదుట శ్రీరామతత్వం ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. ఇళ్లలో శ్రీరామచంద్రుడి పటాలు, విగ్రహాలను పెట్టి పూజలు చేశారు. శ్రీ రామనామాలను పఠించారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ జరిగిన సమయంలో అక్షింతలను తలపై చల్లుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం పూజా మందిరంలో, ఇళ్ల ముందు అయిదేసి దీపాలను వెలిగించారు.

మరోవైపు అన్ని మండలాల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్, కొత్తకొండ, రత్నగిరి, వంగర గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయ స్వామి గుళ్లలో సీతారామచంద్ర స్వామికి పూజలు, కల్యాణాలు నిర్వహించారు. ఎల్కతుర్తి మండలం గోపాలపురంలోని రామాలయంలో సీతారాముల కల్యాణంతో పాటు హోమాన్ని నిర్వహించారు. కమలాపూర్ మండల కేంద్రంలో రామాలయంలో అర్చనలు, అభిషేకాలు, అన్నదానం నిర్వహించారు. ఉప్పల్‌లో సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.పరకాల పట్టణం లోని కుంకుమేశ్వరాలయం, రామాలయం, చెన్నకేశవ ఆలయంలో శాంతి హోమాలను నిర్వహించారు. పురవీధుల్లో రథయాత్ర నిర్వహించారు.

• వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సౌరభం •



అంబేద్కర్ జంక్షన్ ఆంజనేయస్వామి దేవాలయంలో భారీ స్క్రీన్ వద్ద భక్తులు

నడికూడ మండలంలోని కంఠాత్మకూరు, వరికోలుఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. కొకొండలో భక్తులు భజనలు చేస్తూ పాటలు పాడుతూ శోభాయాత్ర నిర్వహించారు.

నగరంలోని అన్ని దేవాలయాల్లోనూ పూజా కార్యక్రమాలు జరిగాయి. 54వ డివిజన్‌లోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై అయోధ్య కార్యక్రమాన్ని ప్రజలతో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తిలకించారు. కాజీపేటలోని రామాలయం, హనుమకొండ బాలసముద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, హనుమకొండ బ్రాహ్మణవాడలోని చిన్నకోవెల, పెద్ద కోవెలలో ప్రశాంత్ నగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయం, పరిమళ కాలనీలోని భక్తాంజనేయ స్వామి ఆలయం, చైతన్యపురి కాలనీలో వెంకటేశ్వరాలయం తదితర గుళ్లలో శ్రీరాముడికి అభిషేకాలు, అర్చనలు జరిపారు.



హనుమకొండ డీసీసీ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్వర్ణ తదితరులు

రాహుల్‌పై దాడి అప్రజాస్వామికం

- బీజేపీ గూండాలకు భయపడే ప్రసక్తే లేదు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జనవరి 22 : ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీపై అసోం రాష్ట్రంలోని సోనిత్‌పూర్ జిల్లాలో జరిగిన దాడి అప్రజాస్వామికమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. దాడికి నిరసనగా పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులతో హనుమకొండలోని అశోకా జంక్షన్ వద్ద శాంతియుత నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రకు దేశ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. రాహుల్‌గాంధీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి బీజేపీ కార్యకర్తలు, గూండాలు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. అప్రజాస్వామికంగా దిగజారుడు చర్యలకు పాల్పడుతూ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. నిరసన కార్యక్రమం అనంతరం హనుమకొండ అశోకా జంక్షన్ నుంచి పబ్లిక్‌గార్డెన్‌లోని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దొమ్మాటి సాంబయ్య, బత్తిని శ్రీనివాస్‌రావు, మోజెస్ ఆనంద్ పాల్, బంక సరళా, కూర వెంకట్, రామక్రిష్ణ, గుంటి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు

- మంత్రి కొండా సురేఖ

హనుమకొండ అర్బన్, జనవరి 22 : కుక్కలు, కోతుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. నగర పరిధిలోని 21వ డివిజన్ ఎల్‌బీ నగర్‌లో ఆదివారం జరిగిన కుక్కల దాడిలో గాయపడిన బాలుడు అలీ అక్బర్ గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంత్రి సురేఖ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నగరంలో కుక్కలు, కోతుల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు. కుక్కల బెడద ఉన్న ప్రాంతాల్లో పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తోడుగా వెళితే ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. బల్దియా నుంచి ప్రతీ రోజు 30 కుక్కలను పట్టుకొని 20 కుక్కలకు శస్త్రచికిత్సలు నిర్వహించి రెండు, మూడు రోజులు పర్యవేక్షణలో ఉంచడం జరుగుతుందన్నారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని పరామర్శిస్తున్న మంత్రి కొండా సురేఖ

కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలి

- ఆడపిల్లలపై వివక్ష రూపుమాపాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 22 : ఆడపిల్లలపై వివక్ష రూపుమాపాలంటే ముందుగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జిల్లా మిషన్ శక్తి, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ముందుగా బాలికా సంరక్షణ, విద్యాసాధికారత కోసం ఏర్పాటు చేసిన బ్యానర్‌పై తొలి సంతకం చేసి, బాలికా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీవో సంతోష్ కుమార్, డి.కల్యాణి, ప్రొటెక్షన్ ఆఫీసర్ సౌరం ప్రవీణ్ కుమార్, సుమలత, హైమావతి, మాధవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు

'రేషన్' మాఫియా

- చౌకబియ్యానికి పాలిష్ చేసి ఇతర రాష్ట్రాల్లో విక్రయం
- కోట్లు దండుకుంటున్న అక్రమార్కులు
- మామూళ్లకు మరిగి వత్తాసు పలుకుతున్న అధికారులు
- తెరవెనుక కొందరు పోలీసు అధికారుల ప్రమేయం
- వరంగల్-హనుమకొండ సరిహద్దు కేంద్రంగా దందా



వరంగల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం దందా ఓ ముఠాకు నోట్లు కురిపిస్తోంది.. వరంగల్-హనుమకొండ సరిహద్దు కేంద్రంగా డీలర్లు, జనాల వద్ద నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్న ముఠా.. లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలించి కోట్లు గడిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని కొందరు రైస్ మిల్లర్లు రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్చి అక్రమంగా విక్రయించడంలో సిద్ధహస్తులుగా మారారు. ఈ దందాకు కొంతమంది అధికారులు, పోలీసుల తెరవెనుక మద్దతు ఇస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ మాఫియాలో కీలకమైన వ్యక్తి కోటి విద్యలు ప్రదర్శిస్తూ కోట్లు దండుకుంటున్నాడు. నెలనెలా అధికారులకు లక్షల్లో మామూళ్లు ఇచ్చి రేషన్ బియ్యాన్ని తన పెట్టుబడిగా మార్చుకుని అక్రమాలను యథేచ్ఛగా సాగిస్తున్నాడు. పుష్ప సినిమాను తలదన్నేలా ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా రేషన్ బియ్యాన్ని చెక్‌పోస్టులు దాటిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ 'కోటి' విద్యల పెద్ద మనిషికి పోలీసులు, సివిల్ సప్లయిస్, ఆర్టీఏ, టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ అధికారుల అండదండలు ఉండడంతో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోందని సమాచారం. అంతేగాక తన సామ్రాజ్యాన్ని విస్తరించుకునేందుకు 12 మంది వ్యక్తులతో కలిసి ఓ ముఠాను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గ్రామాల్లోని రేషన్ డీలర్ల వద్ద ఒప్పందాలు కుదుర్చుని రేషన్ బియ్యాన్ని అక్కడి నుంచి ఓ చోట భద్రపరిచి లారీ లోడు అయ్యేలా చేస్తున్నట్టు తెలుస్తోంది. అనంతరం లారీలను రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బియ్యం చేరవేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. హనుమకొండ జిల్లా ముల్కనూరు ప్రాంతానికి

మిగతా 8వ పేజీలో..

ఐనవోలు ఆలయ మాజీ చైర్మన్ ఆత్మహత్య



వడిచర్ల శ్రీనివాస్

ఐనవోలు, జనవరి 22: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ మాజీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత నందనం సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్(55) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం... శ్రీనివాస్ కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఐనవోలులో తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య అనురాధ, కుమారుడు కమలహాసన్, కుతురు శివాని ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించినట్టు తెలిపారు. కాగా, లండన్‌లో ఉంటున్న కుమారుడు కమలహాసన్ మంగళవారం ఐనవోలు చేరుకుంటారని, అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

కాగా, పుట్టిన రోజు నాడే శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడటాన్ని కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు జీర్ణించుకోలేకపోతున్నారు. శ్రీనివాస్ రాజకీయ నాయకుడిగా స్వయంకృషితో ఎదిగారు. 2001లో టీడీపీ నుంచి ఐనవోలు ఎంపీటీసీగా గెలుపొందారు. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరి పూర్వ వర్ధన్నపేట మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 2012-15 వరకు ఐనవోలు దేవస్థానం చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఐనవోలు మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. నందనం సొసైటీ డైరెక్టర్‌గా కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. గత ఏడాది మళ్లీ బీఆర్ఎస్‌లో చేరారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావుకు సన్నిహితుడిగా మెదిలారు. శ్రీనివాస్ మృతి విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మధుమతి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల జిల్లా, మండల నాయకులు తరలివచ్చి భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.



సాలహారానికి రంగులు వేస్తున్న దృశ్యం

చకచకా ముస్తాబు

- మేడారంలో పనులు ముమ్మరం
- వనదేవతల సాలహారానికి రంగులు
- వైద్య శిబిరాల ఏర్పాటుకు స్థల సేకరణ

వివరాలు : 8లో..

30 నుంచి ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జనవరి 30 నుంచి ఇంజనీరింగ్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6 ,8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తులిపారు. బీటెక్ (సీబీసీఎస్) మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ రెగ్యూలర్, సప్లిమెంటరీ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 22: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

జాతీయ స్వచ్ఛాగ్రహి అవార్డుకు ఎంపిక

జంగాలపల్లి సర్పంచ్ దంపతులకు ఢిల్లీ నుంచి ఆహ్వానం



అనిత-వినయ్‌కుమార్

ములుగు, జనవరి 22: ములుగు మండలం జంగాలపల్లి సర్పంచ్ మసర గాని అనిత, ఆమె భర్త వినయ్‌కుమార్‌కు అరుదైన అవకాశం దక్కనుంది. ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథులుగా పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులను విజయవంతంగా చేపట్టడం, ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో వంద శాతం చేపట్టడంతో స్వచ్ఛాగ్రహి అవార్డుకు ఎంపిక చేశారు. ఐదు వేల మంది జనాభా, 2,860 మంది ఓటర్లు, 1,150 ఇళ్లు కలిగిన జంగాలపల్లిలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, అన్ని వీధుల్లో అంతర్గత రోడ్లు, సైడ్‌డ్రెయినేజీల నిర్మాణం జరిగింది. ఇటీవల గ్రామాన్ని సందర్శించి స్వచ్ఛభారత్ కేంద్ర బృందం దీనిపై సంతృప్తి వ్యక్తం చేసింది. బృందం సభ్యులు ఇచ్చిన నివేదిక ఆధారంగా సర్పంచ్ దంపతులకు పురస్కారం దక్కనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు గ్రామపంచాయతీలు, ఇద్దరు రాష్ట్ర కోఆర్డినేటర్లు ఈ అవార్డుకు ఎంపిక కాగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి జంగాలపల్లి పంచాయతీ ఒక్కటే ఉండటం విశేషం. ఈనెల 24 నుంచి 29 వరకు ఢిల్లీ పర్యటన కొనసాగనుండగా సర్పంచ్ అనితతో పాటు ఆమె భర్త వినయ్‌కుమార్ పాల్గొననున్నారు.

నేడు కేడీసీలో అతిథి

అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్, మైక్రో బయాలజీ సబ్జెక్టులో ఒక్కో పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు జనవరి 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ధృవపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు కళాశాలలో హాజరు కావాలని కోరారు.

నరికివేత సరే, తొలగింపేది..?

● విద్యుత్‌శాఖ - జీడబ్ల్యూఎంసీ మధ్య 'ట్రీ వార్' ● రోడ్ల పక్కనే రోజుల తరబడి చెట్ల కొమ్మలు ● తరలింపు మీదంటే మీదని ఇరు సంస్థల దాగుడుమూతలు ● సమన్వయ లోపంతో నగరవాసుల ఇబ్బందులు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 22: విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్న విద్యుత్‌శాఖ.. ఆ తర్వాత వాటి తొలగింపును మాత్రం విస్మరిస్తోంది. నరికిన చెట్ల తొలగింపు వ్యవహారం బల్దియా, విద్యుత్ శాఖ మధ్య వివాదంగా మారింది. ఈ బాధ్యత మీదంటే.. మీదే అంటూ రెండు శాఖలు ఒకరిని ఒకరు నిందించుకుంటున్నాయి. రెండు శాఖల తీరుతో నగరవాసులు మాత్రం చెట్ల కొమ్మల నరికివేతతో సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీడబ్ల్యూఎంసీ, విద్యుత్‌శాఖల మధ్య..

నరికిన చెట్ల కొమ్మలను ఎవరు తొలగించాలనే వ్యవహారం కొన్నేళ్లుగా పరిష్కారం కావడం లేదు. విద్యుత్ శాఖ, బల్దియాల మధ్య ఈ అంశం పెద్ద రగడగానే పరిణమించింది. ఇరుశాఖలు పరస్పరం సహకారం, సమన్వయంతో వ్యవహరించడం లేదు. దీంతో సమస్య తీవ్రమై రెండు శాఖల మధ్య వార్ జరుగుతోంది.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

విద్యుత్ శాఖ నరికిన చెట్ల కొమ్మలను తొలగించడం లేదు. ట్రీ కటింగ్ పేరుతో ఇష్టారాజ్యంగా చెట్ల కొమ్మలను నరికివేసి కాలనీల్లోని ఇళ్ల ముందే పడవేసి వెళ్తున్నారు. ఇదేమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తే కూడా చెట్ల కొమ్మలు నరికిన వారు దురుసుగా సమాధానం ఇస్తున్నారనే విమర్శలు పెల్లుబికుతున్నాయి. తరువాత తీస్తామని.. లేదంటే బల్దియా వారు తీస్తారంటూ సమాధానమిస్తున్నారు. మరోవైపు విద్యుత్ శాఖ వ్యవహారం బల్దియా తలనొప్పిగా మారింది.

బాధ్యత మరుస్తున్న విద్యుత్ శాఖ

వాస్తవానికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛభారత్ మార్గదర్శకాల మేరకు చెట్ల కొమ్మలు నరికిన తరువాత విద్యుత్ శాఖ మాత్రమే వాటిని తొలగించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో జీడబ్ల్యూఎంసీకి తొలగింపు చర్యల నిమిత్తం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, పన్ను మదింపు అంశాన్ని జీడబ్ల్యూఎంసీ ఉదహరిస్తోంది. ఇంటి నుంచి చెత్త సేకరణకు గాను ఆస్తిపన్నులో చెత్తపన్నును కలిపి వసూలు చేస్తున్న సంగతిని జీడబ్ల్యూఎంసీ ప్రస్తావిస్తోంది. ఇదేక్రమంలో విద్యుత్ శాఖ కూడా బల్దియా ద్వారా తొలగింపు జరగాలనుకుంటే ఈ మేరకు పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జీడబ్ల్యూఎంసీ స్పష్టం చేస్తోంది. అలాకాకుండా పన్ను విధించకపోవడం, సొంతంగా కొమ్మలను తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు పెల్లుబికుతున్నాయి.

రూ.15లక్షల చెల్లింపు నోటీసుల జారీ

చెట్ల తొలగింపు జరిపిన క్రమంలో ఈ మేరకు రూ.15లక్షల పన్ను మదింపు విద్యుత్ శాఖకు జరిగింది. ఇటీవలే ఈ డిమాండ్ నోటీసులను విద్యుత్ శాఖకు జీడబ్ల్యూఎంసీ అందచేసినట్లు తెలిసింది. దీనిపై విద్యుత్‌శాఖ స్పందించడం లేదని బల్దియా చెబుతోంది. నిబంధనల మేరకు చెట్ల కొమ్మలు నరికిన క్రమంలో ఆ చెత్త తొలగింపు బాధ్యత విద్యుత్‌శాఖదే.. లేనిపక్షంలో తొలగింపు చేపట్టిన బల్దియాకు పన్ను అయినా చెల్లించాల్సి ఉంది.



వడ్డేపల్లి టీచర్స్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పడి వున్న చెట్ల కొమ్మలు

కానీ విద్యుత్ శాఖ తీరు మాత్రం నగరవాసులకు సమస్యను తెచ్చిపెడుతోంది. ఒక డివిజన్‌లో విద్యుత్ శాఖ తొలగించిన కొమ్మలను తీసుకెళ్లేందుకు రోజుకు పది ట్రాక్టర్ ట్రిప్పులు అవసరం అవుతుందని బల్దియా చెబుతోంది. డివిజన్‌కు ఒకే ట్రాక్టర్ కేటాయింపు వల్ల ఈ సమస్య మరీ తీవ్రం అవుతోంది. చెట్ల తొలగింపునకే ట్రిప్పులు సరిపోకపోవడంతో రోజు వారి తొలగించే చెత్త మరో సమస్య బల్దియాకు ఎదురవుతోంది. పెద్ద పెద్ద కొమ్మలను ఇష్టారాజ్యంగా కాలనీల్లో రోడ్లపై పడవేయడం, ఆకులు ఎండి ఆ చెత్త ఇళ్లలోకి రావడం, చెట్లకొమ్మలు రోడ్లపై ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రెండు శాఖ మధ్య సమన్వయం లోపం నగర వాసులకు శాపంగా పరిణమించింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు చర్చించుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి శ్రీలక్ష్మినరసింహుడి బ్రహ్మోత్సవాలు

గీసుగొండ, జనవరి 22: గీసుగొండ శ్రీలక్ష్మినరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగులు సాంబరెడ్డి, అర్చకులు అర్చకులు వేదాంత వెంకటనరసింహాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 23న గీసుగొండ గ్రామంలోని ఆలయం నుంచి గుట్టపైకి ఉత్సవమూర్తులు చేరుట, కళ్యాణోత్సవం, 24న హోమబలిహరణం, 25న పూర్ణాహుతి, రాత్రి జాతర బండ్లు తిరుగుట, మొక్కులు సమర్పించుట, 26న కేశఖండన, పుష్పయాగం, 27న ఉత్సవమూర్తులు గ్రామాలయానికి పునఃప్రవేశం జరుగునని వారు వివరించారు.

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

శంభునిపేట, జనవరి 22 : శంభునిపేట దూపకుంట రోడ్‌లోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ తాళ్ల నీలిమాదేవి అన్నారు. సోమవారం గురుకులంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 5వ తరగతితో పాటు ఇంటర్‌లో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు మైనారిటీ, నాన్ మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6,7,8 తరగతుల్లో మైనారిటీలకు బ్యాక్‌లాక్ ఖాళీలను భర్తీ చేయటానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 77804 02391 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మహాజాతరలో సేవలకు అవకాశం ఇవ్వండి

దేవాదాయ శాఖకు సింగరేణి కార్మికుల వినతి

మేడారం, జనవరి 22 : మేడారం మహా జాతరలో ఉచితంగా స్కౌట్ సేవలు అందించడానికి తమకు అవకాశం ఇవ్వాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా కార్మికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వాహక అధికారి రాజేంద్రంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత జాతరలో జంపన్నవాగు పరిసరాల్లో భక్తులకు 90 మంది కార్మికులతో భక్తులకు ఉచిత సేవలు అందించామన్నారు. అవకాశం కల్పిస్తే ఈసారి మహాజాతరలో కూడా సేవలు అందిస్తామన్నారు.

బండారి సింగిడిలో కొమురవెల్లి

ఘనంగా పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు

నిప్పుల్లో చిందేసిన శివసత్తులు, పోతరాజులు, భక్తులు



అగ్నిగుండంలో చిందేస్తున్న శివసత్తులు, భక్తులు

చేర్యాల, జనవరి 22: కొమురవెల్లి మల్లిఖార్జునస్వామిని స్తుతిస్తూ శివసత్తులు, పోతరాజులు, భక్తులు కణకణమని రగిలే నిప్పుల్లో చిందులేసి మైమరచిపోయారు.. దేవుడు..మల్లన్న దేవుడు... అంటూ స్వామివారి నామస్మరణతో అశేష భక్త జనులు పులకించారు. దేవదేవుడి ఆవాహనంతో చేతిలో వీరకోలతో సిగమూగుతూ అగ్నిగుండాలు దాటి తన్మయత్వం చెందారు. భక్తిపారవశ్యంలో కొముర వెల్లి ఓలలాడింది. కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభంలో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని హైదరాబాదుకు చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆలయతోటబావి ప్రాంగణంలో మల్లన్నకు అత్యంత వైభవోపేతంగా పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహించారు.

యాదవ పూజారులు పసుపు, కుంకుమ, పచ్చ, బియ్యంపిండి, సునేరు, పంచ రంగులతో పెద్దపట్నాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. వంటచెరుకుతో అగ్నిగుండాలను తయారుచేశారు.పెద్దపట్నానికి చిత్రకన్ను అమర్చి గుమ్మడికాయలను అష్టదిక్పాలకు లకు అలంకరించారు. మల్లన్న చరిత్ర, మహిమలను వివరిస్తూ యాదవపూజారులు ఒగ్గుకథను ఆలపించగా భక్తులు జయజయధ్వానాలు చేయడంతో ఆలయపరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తిప్రపత్తులతో వేస్తున్న పట్నాన్ని తిలకిస్తూ అశేష భక్తజనం పులకించిపోయారు. భక్తులు మల్లన్నను స్మరిస్తూ బండారిని వంటినిండా ధరించడంతో ఆలయ పరి సరాలన్నీ పసుపుమయంగా మారింది. పట్నం వేయడం, అగ్నిగుండాలను తయారు చేయడం పూర్తికాగానే గర్భాలయంనుంచి అర్చకులు మహదేవునిమల్లికార్జున్ తదితరులు ఉత్సవవిగ్ర హాలను పోలీసు బందోబస్తు నడుమ తీసుకు వచ్చి పట్నంచుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాదవులు గుమ్మడికాయలను బలిహరణ చేయగానే అర్చకులు అగ్నిగుండాలను దాటడం ప్రారంభించారు. అనంతరం మల్లన్నను స్మరిస్తూ అగ్నిగుండాలను దాటి స్వామివారిని దర్శించుకు న్న శివసత్తులు, భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో బాలాజీశర్మ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు కనుములు(ఆచారం) అందించి సత్కరించారు. పలువురు భక్తులు బెల్లంపానకం, నీళ్లప్యాకెట్లను, మరికొందరు అన్నదానం వితరణ చేశారు. బండారిని పంపిణీ చేశారు.

మేడారంలో ప్లాస్టిక్ నిషేధంపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డీపీవో వెంకయ్య

మేడారం, జనవరి 22 : మేడారం మహాజాతరలో ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు అవగాహన చేసేందుకు ములుగు డీపీవో వెంకయ్య సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మొబలైజర్లు ఇందులో పాల్గొనగా ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ మేడారం మహాజాతరకు సుమారు కోటిన్నర మంది భక్తులు మేడారం తరలివచ్చి విడిది చేస్తారని అన్నారు. వారు వదిలిన వ్యర్థాలతోపాటు ప్లాస్టిక్ అధికంగా ఉంటుందని తెలిపారు. ప్లాస్టిక్ ఫ్రీ మహాజాతరను నిర్వహించుకునేందుకు మొబలైజర్లు కృషి చేయాలన్నారు. భక్తులకు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలను చూపడానికి స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు ఐటీడీఏ ఏటూరునాగారం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జ్యూట్ బ్యాగుల వినియోగంపై భక్తులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో రహీం, పెసా కమిటీ జిల్లా అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామపంచాయతీల మొబలైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులపై వీధికుక్కల దాడి

ఇద్దరు విద్యార్థులకు గాయాలు



శునకాల దాడిలో గాయపడిన విద్యార్థులు

సుబేదారి, జనవరి 22 : నగరంలో వీధి కుక్కల దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. రెండు రోజులు దాటకముందే మళ్లీ కుక్కలు విజృంభించాయి. ఆదివారం వరంగల్ 21వ డివిజన్ లోని ఎల్‌బీ నగర్‌లో అలీ అక్బర్, అనాస్ అనే ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి చేసి గాయపరిచిన ఘటన తెలిసిందే. అలాగే గత వారం రోజుల క్రితం న్యూశాయంపేట జంక్షన్ నుంచి పద్మాక్షి టెంపుల్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కాలనీలో ముగ్గురు వ్యక్తులను గాయపరిచాయి. ఈ రెండు ఘటనలు మరువక ముందే తాజాగా సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వెల్దండి కాలనీకి చెందిన వి. శ్రీహిత, ఎస్. దేవిప్రసాద్‌లు ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. కాగా, సోమవారం ఇద్దరు ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా శునకాలు మీద పడి దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన విద్యార్థులకు టీటీ ఇంజక్షన్లు ఇప్పించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 22: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రం, చిల్డ్రన్స్ పార్కు ఏరియా, మునిసిపల్ కమిషనర్ క్యాంపు ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా క్రిష్టా కాలనీ, స్టేషన్‌రోడ్, వరంగల్ చౌరస్తా, రామ్‌కీ, గ్రేన్ మార్కెట్, దయానంద్ కాలనీ, లక్ష్మీపురం, శివనగర్, ఏఎస్ రెడ్డినగర్, రంగశాయిపేట, మహంకాళి గుడి ఏరియా, హంస బేకరీ, గొల్లవాడ, కుమ్మరివాడ, నాయుడు పంపు, గణపతి ఇంజనీరింగ్ కాలేజీ, పెరుకవాడ చమన్, ఎస్‌ఆర్‌ఆర్ తోట, బీరన్నకుంట, మామునూర్ టౌన్, కుమ్మరిపల్లి, గవర్నమెంట్ డైరీ ఫామ్, పీవీ ఎన్‌ఆర్ వెటర్నరీ కాలేజీ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా రామన్నపేట, బట్టల బజార్, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్, ఓఎస్.నగర్, పాపయ్యపేట చమన్, దేశాయిపేట, బాలాజీనగర్, ఎంహెచ్ నగర్, నజరేత్‌పుర, కొత్తవాడ, డాక్టర్స్‌కాలనీ, బ్యాంక్ కాలనీ, మర్రివెంకటయ్య కాలనీ, రామ్‌నాథ్‌పురి, ఫిల్టర్‌బెడ్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేశి మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల ప్రవేశానికి నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 22 : గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులకు ఈ నెల 23వ తేదీ చివరి అవకాశమని వరంగల్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎస్.విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. www.tswreis.ac.in www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు గణిత టాలెంట్ టెస్ట్


హనుమకొండ రూరల్, జనవరి 22: ఈ నెల 24న గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించాలని గణిత ఫోరం బాధ్యులు జిల్లా అధ్యక్షుడు తౌటం భాస్కర్, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ, జిల్లా, మోడల్ స్కూల్స్ రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు తెలుగు మీడియం నుంచి, మరో ముగ్గురు ఇంగ్లీష్ మీడియం నుంచి అనుమతించాలన్నారు. 24న ఉదయం టెస్ట్ నిర్వహించి వెంటనే ఫలితాలు ప్రకటించాలన్నారు. ప్రతి మండలం నుంచి గెలుపొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ నెల 27వ తేదీన రీజినల్ సైన్స్ సెంటర్‌లో జరిగే టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులను పంపాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

26న చేపట్టే కిసాన్ ర్యాలీలో పాల్గొనండి

గిర్మాజీపేట, జనవరి 22 : ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఈనెల 26న చేపట్టిన కిసాన్ వాహన ర్యాలీలో రైతులు పాల్గొనాలని మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని ఓంకార్ భవన్‌లో చిర్ర సూరి అధ్యక్షతన జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ కార్మిక సంఘాల బాధ్యుల సమావేశంలో రమేష్ కేంద్ర రైతు వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కనీస మద్దతు ధర, రుణ విముక్తి చట్టాల కోసం దేశ వ్యాప్తంగా రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చాగా ఏర్పడి ఉద్యమాలు చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 26న రిపబ్లిక్ డే రోజున దేశ వ్యాప్తంగా 500 జిల్లాల్లో కిసాన్ వాహన ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఫిబ్రవరి 10న గ్రామీణ బంద్ పాటిస్తున్నట్లు చెప్పారు. 26న వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి జరిగే కిసాన్ వాహన ర్యాలీలో వరంగల్ జిల్లా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పి.రమేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు, కార్మిక, ప్రజాసంఘాల బాధ్యులు గోనే కుమారస్వామి, రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య, కుసుంబ బాబురావు, భూక్య సమ్మయ్య,ఓదెల రాజన్న, ఈర్లపైడి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు పాదయాత్ర

నెక్కొండ నుంచి పాదయాత్ర చేపట్టిన సర్దార్‌సింగ్



పాదయాత్రతో బయలు దేరిన సర్దార్‌సింగ్

నెక్కొండ, జనవరి 22 : దేశంలో రామరాజ్యం రావాలని, హిందువులందరూ సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరుతూ నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన రైతు జరుపుల సర్దార్‌సింగ్ సోమవారం నెక్కొండ నుంచి అయోధ్యకు పాదయాత్రను చేపట్టారు. ప్రతీ హిందువు నిత్యం జైశ్రీరాం అన్నప్పుడే తన పాదయాత్ర సఫలీకృతమౌతుందన్నారు. రామ భక్తుడైన తాను శ్రీరాముడి ఆజ్ఞమేరకే తాను ఈ పాదయాత్ర చేపట్టానన్నారు. నెక్కొండ నుంచి అయోధ్యకు 1300 కిలో మీటర్లు ఉంటుందని ప్రతీ రోజు 60 నుంచి 70 కిలోమీటర్లు నడుస్తానన్నారు. ఈ పాదయాత్రను సర్దార్‌సింగ్ చెప్పులు లేకుండా చేస్తున్నారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రామభక్తులు సర్దార్‌సింగ్ యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఘనంగా సన్మానించారు.

రామాలయంలో ముస్లింల పూజలు



చెన్నారావుపేటలోని శ్రీరామ ఆలయంలో పూజలు చేసిన ముస్లింలు

చెన్నారావుపేట, జనవరి 22 : అయోధ్యలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరాముని ఆలయంలో ఓ ముస్లిం కుటుంబం ప్రత్యేక పూజలను చేసింది. గ్రామానికి చెందిన మహమ్మద్ సుబాన్, నషీమా బేగం దంపతులు కుటుంబంతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాముని విగ్రహ ప్రతిష్ఠాపన రోజున మతాలకు అతీతంగా రామునికి పూజలు చేయటంపై ఆ కుటుంబాన్ని పలువురు అభినందించారు.

రాములవారికి చిరుధాన్యాలతో నైవేద్యం

హనుమకొండ రూరల్, జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమకొండ పెగడపల్లి డబ్బాల సమీపంలోని హనుమాన్‌నగర్‌లో సోమవారం రికార్డ్ సర్వీస్ సొసైటీ మిల్లెట్ హబ్ నిర్వాహకురాలు, మిల్లెట్ కుకింగ్ ఎక్స్‌పర్ట్ కుసుమ కవిత తనదైన రీతిలో చిరుధాన్యాల (మిల్లెట్స్)తో తయారు చేసిన కొర్రల పాయసం, ఊదల పులిహోర, రాగిపిండి పూస (మురుకులు), సామల ఉప్మా తదితర ప్రసాదాలను రాము ల వారికి నివేదించి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో యశోద, జ్యోతి, సింధు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



ఇంట్లో చిరుధాన్యాలతో తయారు చేసిన నైవేద్యంతో మహిళలు

మార్మోగిన రామ నామస్మరణ

• ఎల్ఈడీ స్క్రీన్‌పై అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ వీక్షణ
• పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు

హసన్‌పర్తి, జనవరి 22: అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం హసన్‌పర్తిలో హిందువులు సీతారాముల విగ్రహాలతో శోభాయాత్రను నిర్వహించారు. హసన్‌పర్తి ఆర్టీసీ కాలనీ, బస్టాండ్ వద్ద గల మార్కండేయ దేవస్థానం, అంబేద్కర్ నగర్ వద్ద గల రాజరాజేశ్వరీ దేవస్థానంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. జై శ్రీరాం నినాదాలతో హోరెత్తించారు. మధ్యాహ్నం మహాన్నదాన కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం దేవాలయాల్లో, ఇళ్ళ ముందు దీపాలను వెలిగించారు.

● సుబేదారి : హనుమకొండ హంటర్ రోడ్ నందిహిల్స్ కాలనీలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో నందిహిల్స్ అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో భక్తులు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని చూసేందుకు వీలుగా డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నందిహిల్స్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రావుల శ్రీధర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు దొంతి దేవేందర్‌రెడ్డి, పొగాకు శ్రీనివాస్, శ్యాంసుందర్ రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, ఆలయ పూజారులు ఎం. రంగనాథాచార్యులు, పెద్ద సంఖ్యలో రాముడి భక్తులు పాల్గొన్నారు.

హంటర్‌రోడ్‌లోని 31వ డివిజన్ దుర్గాదేవి కాలనీలో ఘనంగా రాములవారి కళ్యాణం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై రాములవారి ఆశీస్సులు తీసుకుని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, స్థానిక కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావుతోపాటు దుర్గాదేవి కాలనీ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హన్మకొండ న్యూశాయంపేటలోని రాజరాజేశ్వర స్వామి(కోటమ్మ గుడి)దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో అన్నదాన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని శ్రీసాయికృష్ణ కాలనీలో గల శ్రీమహాలక్ష్మి దేవాలయంలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ తంతును నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని గావించారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ హైస్కూల్ విద్యార్థులు శ్రీరాముడి శోభాయాత్రను వైభవంగా జరిపారు. విద్యార్థులు రామాయణంలోని పాత్రల వేషధారణలతో ఆద్యంతం ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ వెలగందుల ముక్తీశ్వర్, ప్రిన్సిపాల్ శ్రీరాం జయప్రభ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెపల్లి శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ ప్రధానార్చకులు మణికొండ వామన్‌కుమార్ శర్మ, ఛైర్మన్ కటకం ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. వడ్డెపల్లి ప్రణయ్ మార్గ్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చారగొండ సదానందం, కట్ల రఘుపాల్‌రెడ్డి, వల్లెపు శ్రీనివాస్, కల్వాల రాజమల్లారెడ్డి, కూనూరు రంజిత్‌గౌడ్ , బండారి జనార్దన్ తదితరులు బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని శ్రీరామ సీత లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామిని కొలిచారు.

● కాజీపేట : కాజీపేట శ్వేతార్క గణపతి దేవాలయంలో కొలువై ఉన్న సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి మూర్తులకు 500 సంవత్సరాల నాటి పంచలోహ ఉత్సవ పట్టాభిషేక సీతారామ లక్ష్మణ ఆంజనేయ మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, రామనామ సంకీర్తనలు అయోధ్య సుముహూర్తమునకు జరిగిన రామ ప్రతిష్ఠను భక్తులకు టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారంద్వారా చూపించారు. అనంతరం అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను ప్రసాదంగా ఇచ్చి అన్నప్రసాదంగా ఇచ్చి అన్న ప్రసాదన వితరణ చేశారు. అనంతరం కాజీపేట రహ్మత్ నగర్‌లో ద్వారకా స్వీట్ హౌస్, గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రామ మందర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా స్థానికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భగవాన్ ఉపాధ్యయ, లోకేశ్ ఉపాధ్యాయ, హేమంత్ ఉపాధ్యాయ, నరేశ్, తోపాటు ఆలయ సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● మడికొండ : మడికొండలోని బొడ్రాయి వద్ద శ్రీరామ హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కళ్యాణం నిర్వహించారు. స్థానిక కళాకాడు జానపట్ల లక్ష్మణ్ నేలపై రంగులతో చిత్రించిన రాముడి చిత్రం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అయోధ్యలో జరిగిన బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని లైవ్‌లో ప్రసారం చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ గుజ్జేటి వేణు, ఎస్సై రాజాబాబు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, శ్రీరామ హనుమాన్ భక్త మండలి సభ్యులు పొనగోటి వెంకట్రావు, గడ్డం మహేందర్, బుర్ర శ్రీధర్ గౌడ్, ఎలగొండ శి వ, బొల్లికొండ వినోద్, బైరపాక వెంకటేష్, ముత్తోజు సురేష్, బైరి సతీష్, గడ్డం మౌళి, కొప్పుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలోని బురుజు వద్ద గల ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజారి మంత్రవాది వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 64వ డివజన్ కార్పొరేటర్ ఆవాల రాధికా నరోత్తం రెడ్డి దంపతులు, బీజేపీ సీనియర్ నాయకులు తొటిరెడ్డి రవీందర్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. పూజల్లో పరవస్తు రఘు, అరుణ, తండ శంకర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మడికొండలోని వాల్మీకి మహర్షి ఆలయంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదానం చేశారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, నాయకులు కుర్ల మోహన్, బైరి వరలక్ష్మీ లింగమూర్తి, కంచనపల్లి వెంకటయ్య, బోగి లింగయ్య, పెనుకల రవిందర్, నిగ్గుల వెంకటప్రసాద్, ముష్కె సాంబయ్య, సందీప్, సతీష్, అజయ్, విజయ్, క్రిష్ణ తదతరులు పాల్గొన్నారు.

● ఐనవోలు : అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మండలవ్యాప్తంగా ఆలయాల్లో సీతారామచంద్ర స్వామి(రాములోరి)కల్యాణంను నిర్వహించారు. ఐనవోలు, వెంకటాపూర్, పంథిని గ్రామాల్లో శోభయాత్రాలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

రుద్రేశ్వరాలయంలో...

హనుమకొండ కల్చరల్ : నగరంలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పుష్పాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు శ్రీరామ, జయరామ, జైజై రామ అంటూ నినాదాలు చేశారు. వరంగల్ భద్రకాళి ఆర్చిగేట్ నుంచి భారీ శోభా యాత్రను ఆర్యవైశ్య సంఘం నాయకుడు గట్టు మహేశ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌బాబు మాట్లా డుతూ..హిందూ సమాజం కరసేవకుల పోరాట ఫలితమే అయోధ్య రామమందిర పునర్ నిర్మాణమని ఇది హిందూజాతి గర్వించతగ్గ శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రేశ్వర సేవా సమితి ప్రధాన కార్యదర్శి పులి రజినికాంత్, వేద పండితుడు మణి కంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌లతోపాటు వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని చిన్న కోవెల పేరుగాంచిన సీతారామ చంద్రస్వామి ఆలయం, అదాలత్ సమీపంలో వెంకటేశ్వరా లయం, ఏకశిల పార్కు సమీపంలోని హనుమత్ సమేత రామాల యం, రెవెన్యూ కాలనీలోని రామాలయం, ఎక్సైజ్ కాలనీలోని వెంకటేశ్వరా లయాల్లో సహస్ర దీపోత్సవాలను నిర్వహించారు.

డిజిటల్ స్క్రీన్లు

బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రజలు ప్రత్యక్షంగా తిలకించేందుకు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణాలు, ఫంక్షన్ హాళ్ళు, బహిరంగ ప్రదేశాల్లో టెంట్లు వేసి వాటి కింద ఏర్పాటు చేసిన ఈ స్క్రీన్ల వద్ద కు ప్రజలు పెద్దఎత్తున చేరుకొని ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆసక్తిగా తిలకించి భక్తిపారవశ్యానికి లోనయ్యారు. కార్యక్రమం జరుగుతు న్నంత సేపు జై శ్రీరాం అంటు నామస్మరణ చేశారు. కొన్ని చోట్ల ఆధ్యాత్మిక ప్రసంగాలను ఏర్పాటు చేశారు. ప్రవచకులు రామాయ ణ ఘట్టాలను భక్తులకు వివరించారు. అయోధ్యలో రామమందిరం విశిష్టతను తెలియచేసే కరపత్రాలను పంపిణీ చేశారు.



హసన్‌పర్తి ఆర్టీసీ కాలనీలో భక్తుల శోభాయాత్ర



హంటర్‌రోడ్ పంచముఖ ఆలయంలో సీతారాముల కల్యాణం చేస్తున్న పూజారులు



నక్కలగుట్టలో శోభాయాత్రను నిర్వహిస్తున్న విద్యార్థులు



రుద్రేశ్వరాలయంలో శ్రీరాముడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

బైక్‌ను ఢీకొట్టిన కారు .. ఇద్దరికి తీవ్ర గాయాలు

వేలేరు(ధర్మసాగర్), జనవరి 22: కారు అతి వేగంతో వచ్చి బైక్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరు మండల కేంద్రానికి చెందిన మటం శ్రీశైలం, అతడి కూతురు శిరీష ఇరువురు కలిసి వేలేరు నుంచి హనుమకొండకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. హనుమకొండలో శ్రీశైలం కూతురు కాలేజీ ఫీజును చెల్లించి, తిరిగి ఇరువురు వేలేరుకు వస్తున్నారు. ఈ క్రమంలో పీచర క్రాస్ దాటి వేలేరుకు వస్తున్న క్రమంలో కారు అతి వేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇరువురు బైక్ పై నుంచి ఎగిరి కింద పడిపోవడంతో శ్రీశైలం, శిరీషలకు కుడి కాళ్ల విరిగిపోయి తీవ్రగాయా లయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని 108వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బైక్ నుజ్జునుజు కాగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది.

వినతులు వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 22 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు.

వివిధ సమస్యలపై ప్రజల నుంచి 45 వినతులు అం దినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్‌డీఏ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, ఇంటర్మీడియేట్ అధికారి ఎ.గోపాల్, మైనింగ్ విభాగం ఏడీ నర్సిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీడబ్ల్యూవో మధురిమ, మెప్మా పీడీ భద్రునాయక్, డీపీవో జగదీశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని స్వచ్ఛ ఆటో డ్రైవర్ల ధర్నా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 22 : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీడబ్ల్యూఎంసీ స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. సోమవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. స్వచ్ఛభారత్ ఆటో యూనియన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కిషోర్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆటోలు తిప్పమని, చెత్తను సేకరించబోమని చెప్పారు. నాలుగు నెలలుగా వేతనాలు లేవని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, బ్యాంకు వాయిదాలు చెల్లించాలని, ఈఎస్ఐ కార్డులు జారీ చేయాలనే తదితర తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఆటోలు నడిపేది లేదని స్పష్టం చేశారు. ఇటీవలే మంత్రి కొండా సురేఖకు కూడా సమస్యలు వివరించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మురళీవిజయ్‌కుమార్, అజ్మీరా మోహన్, జానీ, సురేందర్, శ్యామ్, నరేశ్, అశోక్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

వడ్డెపల్లి అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



వడ్డెపల్లి సమస్యలను పరిష్కరించాలని నాయినికి వినతి పత్రం అందజేస్తున్న స్థానిక ప్రజలు

వడ్డెపల్లి, జనవరి 2 2: వడ్డెపల్లి అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లిలోని శ్మశానవాటికతో పాటు వడ్డెపల్లి చెరువు ప్రాంతాన్ని స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి వడ్డెపల్లిలో సమస్యలు పేరుకు పోయాయని అన్నారు. వడ్డెపల్లి గ్రామం నుంచి శాసన సభ్యుడిగా ఇంతకు ముందు ఎన్నికైన దాస్యం వినయ్ భాస్కర్ అభివృద్ధిని విస్మరించారని పేర్కొన్నారు. వడ్డెపల్లి చెరువు మత్తడిని ఆనుకుని ఉన్న శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కా తొలగించాలని, శ్మశాన వాటిక అన్యాక్రాంతం కాకుండా చూడాలని గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, కాంగ్రెస్ శ్రేణులు ఎనుకొంటి పున్నం చందర్, తాళ్లపెల్లి విజయ్, మేరుగు శివ, తాళ్లపెల్లి రవీందర్, లలిత, మేరితో పాటు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టెపల్లి నర్సింగం, మట్టెపల్లి శంకర్, సభ్యులు మండల సమ్మయ్య, మట్టెపల్లి జగన్ తదితరులు కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, పి. రవికిరణ్, నాగపురి దయాకర్, బంక చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మోంట్‌రో ఎలక్ట్రికల్ ఆటో షోరూం ప్రారంభం



మోంట్‌రో ఎలక్ట్రికల్ ఆటో షోరూమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హనుమకొండ రూరల్, జనవరి 22 : నిట్ సమీపంలో మోంట్‌రో ఎలక్ట్రికల్ ఆటో షో రూం సోమవారం రీజినల్ హెడ్ ఎస్.కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ ఆటోకు సంబంధించి టీఐ క్లీన్ మొబిలిటీ అనేది వైవిధ్యభరితమైన సమ్మేళనమన్నారు. ఉత్తమ 10 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్, ఏఆర్ఏఐ సర్టిఫైడ్‌తో 203 కిలోమీటర్ల అత్యుత్తమ పరిధి, సాధారణ పరిధిలో 155 నుంచి 160 కిలోమీటర్లను అందిస్తుందన్నారు. అత్యుత్తమ గరిష్ఠ టార్క్ 60 ఎన్ఎం, గరిష్ఠ వేగం 55 కేఎంపీహెచ్ అని తెలిపారు. కీర్తి మోటార్స్ అధినేత కీర్తిరెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ ఆటోలకు ఫైనాన్స్ సౌకర్యం కూడా ఉందన్నారు. చోళ ఫైనాన్స్, విద్యుల్ టెక్, రాఘవ ఫైనాన్స్, పీఎన్‌బీ, ఎస్‌బీఐ బ్యాంకులలో రుణ ఎంపిక కూడా అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ ప్రారంభోత్సవంలో రీజినల్ హెడ్ సర్వీస్ సందీప్ సిద్ధం, సేల్స్ హెడ్ తెలంగాణ రావణ్‌రెడ్డి, హరీష్ కుమార్, చందుపట్ల సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యం అందుబాటులో ఉంటా..

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి, జనవరి 22 : నేను మీ సేవకుడిని.. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం హసన్‌పర్తి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల సభకు ఎమ్మెల్యే మొదటి సారిగా హాజరవుతున్న సందర్భంగా మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శాలువా మెమొంటోలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, నిత్యం అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలు ఉన్నా స్వయంగా వచ్చి చెప్పాలని అధికారులకు సూచిస్తూ.. ప్రజలకు చేవ చేసే విధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యపై ప్రత్యేక దృష్టి పెడతానని, పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని ఎంఈవో రామకిషన్‌రాజును కోరారు. అనంతరం ఈ నెల 30న సర్పంచుల పదవి ముగిస్తుండడంతో సర్పంచ్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. ఎంపీపీ కేతపాక సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'రేషన్' మాఫియా

(5వ పేజీ తరువాయి)

చెందిన వ్యక్తి... మొదటగా హసన్‌పర్తి, ముల్కనూరు, జనగామ జిల్లా రాజారం కేంద్రంగా బియ్యం అక్రమ వ్యాపారానికి తెరతీశాడని తెలుస్తోంది.

వరంగల్, హనుమకొండలోని కొందరు అధికారుల అండదండలతో పోలీసులు, సివిల్ సప్లయి, రెవెన్యూ, ఆర్టీఏ, విజిలెన్స్ అధికారులను మచ్చిక చేసుకుని దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఒక్కో విభాగానికి నెలకు రూ. 3 లక్షల నంచి రూ.4 లక్షల వరకు మామూళ్లు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వరంగల్ టూ మహారాష్ట్ర..

హసన్‌పర్తి కేంద్రంగా పాత ఇనుప సామాను సేకరణ పేరిట 12 మందితో ముఠా ఏర్పాటు చేసిన వ్యాపారి ఎలాంటి బెదురు లేకుండా రేషన్ బియ్యం దందా నడుపుతున్నట్లు సమాచారం. వరంగల్ నుం చి మహారాష్ట్రకు రోజుకు రెండుమూడు లారీల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు వరంగల్, హనుమకొండ, కాజీపేట సమీప గ్రామాల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్నట్లు సమాచారం. ఆయా గ్రామాల్లో దొరికే రేషన్ బియ్యం మొత్తం తనకే విక్రయించాలని సదరు డాన్ కొనుగోలు దారులకు హుకుం జారీ చేసినట్టు తెలుస్తోంది. తన మాట వినని వారిని పోలీసుల సాయంతో దారికి తెచ్చుకుంటు న్నాడనే విమర్శలున్నాయి. దీంతో ఎందుకొచ్చిన గొడవ అని కొనుగోలుదారులు గ్రామాలు తిరిగి సేకరిస్తు న్న బియ్యం అతడికే విక్రయిస్తున్నట్లు సమాచారం.

దందా ఇలా..

వరంగల్ నగరంలోని రేషన్ షాపుల లబ్ధిదారులతో పాటుగా పలు గ్రామాల్లో దళారులు ఇంటింటా కిలోకు రూ.7 నుంచి రూ.10కి కొనుగోలు చేసి కిలోకు రూ.15కు కోళ్ల దాన కోసం ఫారాలకు, రాజస్థాన్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు సరఫరా చేసి లాభాలు పొందుతున్నారు. గతంలో రేషన్ దుకాణాల్లోకి వచ్చిన బియ్యంను దళారులు రైస్ మిల్లులకు సరఫరా చేసేవారు. బియ్యం సేకరించిన మిల్లర్లు వాటిని రీసైక్లింగ్ చేసి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) తిరిగి సరఫరా చేసి లాభాలు గడించేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సొసైటీలు, ఐకేపీ కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంను మిల్లర్లకు కేటాయించి, లెక్క ప్రకారం మిల్లర్ల నుంచి బియ్యం కొనుగోళ్లు చేస్తోంది. దీంతో అదనంగా బియ్యం సరఫరా చేయలేని పరిస్థితి మిల్లర్లకు ఏర్పడింది. మిల్లర్లు సైతం రేషన్ బియ్యం కొనుగోలును తగ్గించి వేశారు.

అధికారులకు ముడుపులు

ఒక్కో విభాగానికి నెలకు లక్షల్లో మామూళ్లు ఇస్తుండడంతో అధికారులు సదరు వ్యక్తి వాహనాలకు బార్లా గేట్లు తెరుస్తూ సహకరిస్తున్నట్లు సమాచారం సాగుతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఓ సబ్ డివిజనల్ స్థాయి అధికారికి నెలకు రూ.2 లక్షలకు పైగా, అలాగే వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై ఉన్న ఓ సర్కిల్ స్థాయి అధికారికి నెలకు రూ.లక్ష వరకు మామూళ్లు ముట్టజెప్పుతున్నట్లు తెలుస్తోంది. మిగతా విభాగాల అధికారులకు సైతం వారి వారి స్థాయిలో ముట్టచెప్పి లారీలను ఇతర రాష్ట్రాలకు సాగనంపుతున్నాడని తెలుస్తోంది.

టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ

హనుమకొండ రూరల్, జనవరి 22 : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా యూనిట్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి కొండా సురేఖ సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీవో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి ఫణి కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

'ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలి'

వడ్డెపల్లి, జనవరి 22: వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తిపై మేయర్ గుండు సుధారాణి చేసిన ఫిర్యాదును వెంటనే వెనక్కి తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఒక ప్రకటనలో కోరారు. వివిధ మార్గాల ద్వారా వచ్చిన సమాచారాన్ని వార్తలుగా మలిచే జర్నలిస్టులపై ప్రజా ప్రతినిధులు బెదిరింపులకు గురిచేయడం తగదని పేర్కొన్నారు. 24 గంటల్లోగా జర్నలిస్టు కేశవ మూర్తిపై చేసిన ఫిర్యాదును మేయర్ సుధారాణి ఉప సంహరించుకోవాలని, లేని యెడల తగుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వారు హెచ్చరించారు.

మేడారం ముస్తాబు

• మహాజాతర పనులు ముమ్మరం
• వనదేవతల సాలహారానికి రంగులు

మేడారం, జనవరి 22 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మహాజాతర పనులు చురుగ్గా సాగుతున్నాయి. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్ పర్యవేక్షణలో అభివృద్ధి పనులు సాగుతుండగా ఆయా శాఖల అధికారులు వాటిలో నిమగ్నమయ్యారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు సమ్మక్క, సారలమ్మ మహాజాతర జరగనుండగా అధికారులు చురుగ్గా పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా వనదేవతల సాలరానికి సోమవారం పెయింటింగ్ పనులు ప్రారంభించారు. తల్లుల గద్దెల ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ప్రాకారం, సాలారం, ప్రధాన గేట్లు, క్యూలైన్లకు రంగులు దిద్దుతున్నారు. అదేవిధంగా రంగు రంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

మహాజాతరకు హాజరయ్యే భక్తుల కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గద్దెల సమీపంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతర సమయంలోనే కాకుండా ముందస్తుగానే భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం సుమారు 20 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా ప్రస్తుతం జంపన్నవాగు వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య స్థలాన్ని సేకరించారు.

స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన రైతు జాలపు అనంతరెడ్డిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహాజాతరలో వైద్య శిబిరాల కోసం కేటాయించిన స్థ లాలను వ్యాపారులు ఆక్రమిస్తున్నారని అన్నారు. జాతర సమయంలో దుకాణాలను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారులు విజయ భాస్కర్, మహమ్మద్, సంజీవరావు, సిబ్బంది సమ్మయ్య తిరుపతి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

డాక్టర్

పుష్కలంగా ప్రొటీన్

శాకాహారంతో సరిపడా ప్రొటీన్‌ను పొందే వీలుండదు అనుకుంటే పొరపాటు. పదార్థాల పట్ల అవగాహన పెంచుకుంటే, శాకాహారంతో కూడా ప్రొటీన్ పుష్కలంగా పొందవచ్చు.

సోయా: చవకగా, సులువుగా మార్కెట్లో దొరికే శాకాహార ప్రొటీన్ ఇది. 100 గ్రాముల సోయాలో 52 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. కాబట్టి ప్రొటీన్ పొందాలనుకుంటే, తరచూ సోయా వంటకాలు వండుకుంటూ ఉండాలి.

గుమ్మడి విత్తనాలు: వీటిలో ప్రొటీన్‌తో పాటు అన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అలాగే పీచు, యాంటీఆక్సిడెంట్లు కూడా గుమ్మడి విత్తనాల్లో ఎక్కువే!

ఓట్స్: విటమిన్లు, ప్రొటీన్లను కలిగి ఉండే ఓట్స్‌లో మాంసకృత్తులు ఎక్కువ.

హెల్త్ వెల్త్



ఎన్నో రకాల బ్రాండ్లలో దొరుకుతున్న ఓట్స్‌ను బ్రేక్‌ఫాస్ట్‌గా తినడం అలవాటు చేసుకోవాలి. వంద గ్రాముల ఓట్స్‌లో 18 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

మినుములు: మినుముల్లో, నల్లబియ్యంలో ప్రొటీన్లు ఎక్కువ. నల్లబియ్యంలో అదనంగా పిండిపదార్థాలు, పీచు కూడా ఉంటాయి. వంద గ్రాముల మినుముల్లో 19 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. కాబట్టి మినప సున్నుండలు లాంటివి తింటూ ఉండాలి.

వేరుసెనగలు: వీటిలో ప్రొటీన్లు, కొవ్వులు, పీచు ఉంటాయి. విటమిన్ ఇతో పాటు, మెగ్నీషియం, ఫోలేట్, రాగి లాంటి పోషకాలు కూడా ఉంటాయి. వంద గ్రాముల వేరుసెనగల్లో పాతిక గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. కాబట్టి వీటిని కూరలు, వేపుళ్లు, పచ్చళ్లలో విరివిగా వాడుకుంటూ ఉండాలి.

కేన్సర్



ఈ లక్షణాలే సూచనలు

కేన్సర్ వ్యాధి బయల్పడడానికంటే ముందు కొన్ని సాధారణ నలతలు తరచూ వేధిస్తూ ఉంటాయి. అవేంటంటే..

- **చర్మ సమస్యలు:** ఆహారం, సౌందర్య సాధనాలతో సంబంధం లేకుండా చర్మ సమస్యలు మొదలవుతాయి. హఠాత్తుగా మొదలయ్యే ఈ చర్మ సమస్యలు చర్మపు అలర్జీలను కూడా పోలి ఉండవు. ఈ సమస్యతో పాటు రొమ్ముల్లో గడ్డలు ఉన్న అనుమానం వస్తే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.
- **దగ్గు:** దగ్గు విడవకుండా వేధిస్తూ, ఆకలి మందగించినా, నిస్సత్తువ ఆవరిస్తున్నా వైద్యులను సంప్రతించాలి. దగ్గు, ఆకలీ, బరువూ తగ్గడం కేన్సర్ ప్రధాన లక్షణాలు.
- **దురదలు:** దురద పెరుగుతున్న కేన్సర్ కణితికి సూచన కావచ్చు. ఇది స్కిన్ ఎలర్జీ ప్రధాన లక్షణమైనా, దురద తీవ్రంగా ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. బైల్ డక్ట్, చర్మ కేన్సర్లు, కాలేయానికి పాకే కేన్సర్లు, రక్త కేన్సర్లలో దురద ప్రధాన లక్షణంగా ఉంటుంది.
- **విసర్జన:** మలంలో మ్యూకస్, రక్తం, చీము కనిపిస్తే, పెద్ద పేగు కేన్సర్‌గా అనుమానించాలి.
- **మూత్రం:** రక్తంతో కూడిన మూత్రం, అధిక రక్తపోటు, కటి ప్రదేశంలో నొప్పి, అలసటలు మూత్రపిండ కేన్సర్ లక్షణాలు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/wvzNr2uలో చదవండి.

హెయిర్ హెల్త్



వెంట్రుకలు రాలడం అనే సమస్య ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొనేదే! అయితే ఆ సమస్యను గృహ చిట్కాలతో సరిదిద్దే ప్రయత్నం చేస్తూ ఉంటాం. కానీ వెంట్రుకలు రాలడానికి అంతర్గత కారణాలను వెతికి వాటిని చక్కదిద్దే ప్రయత్నం చేయడం అవసరం.

జుట్టు రాలుతోందా?



వెంట్రుకలు రాలితే గుండెల్లో గుబులు మొదలవుతుంది. నిజమే మరి! అందంలో తలకట్టు పాత్ర ప్రధానం కాబట్టి ఆ మాత్రం కంగారు సహజమే! అయితే నిజానికి వెంట్రుకలు, వాటి తత్వాలు, వాటి మీద ప్రభావం చూపించే అంశాల మీద అవగాహన ఉంటే సమస్యను సమర్థవంతంగా సరిదిద్దుకోవచ్చు.

పోషకాహారలోపం ప్రధానం

వెంట్రుకల సమస్యలకు ప్రధాన కారణం పోషకాహారలోపం. ప్రతి మహిళలోనూ ఈ లోపం ఎంతో కొంత ఉంటూ ఉంటుంది. కుటుంబానికంతటికీ తినిపించి, తాము తినడం నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు మహిళలు. దీనికి తోడు ప్రతినెలా నెలసరి ద్వారా జరిగే రక్త నష్టం భర్తీ కాదు. ఫలితంగా వాటి ప్రభావం వెంట్రుకల మీద తప్పనిసరిగా పడుతుంది. వెంట్రుకలు పలుచబడడం, ఊడిపోవడం, నిర్జీవంగా తయారవడం లాంటి సమస్యలన్నీ కనిపిస్తాయి.

వెంట్రుకలు ఊడుతుంటే?

వెంట్రుకలు ఊడటానికి పోషకాహారలోపం ఒక్కటే కారణమైతే, దాన్ని సరిదిద్దితే సమస్య తొలగిపోతుంది. అలా జరగలేదంటే, అందుకు వేరే కారణాలు అయి ఉండొచ్చు. అవేంటంటే..

వంశపారంపర్య బట్టతల: బట్టతల పురుషులతోపాటు కొందరు స్త్రీలకూ వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. ఇలాంటి వారికి 18 ఏళ్ల వయసు నుంచీ వెంట్రుకలు ఊడడం మొదలై 35 ఏళ్ల లోపు తల ముందు భాగంలో బట్టతల వచ్చేస్తుంది.

- **థైరాయిడ్:** హైపో, హైపర్... రెండు థైరాయిడ్ సమస్యల్లోనూ వెంట్రుకలు రాలడం జరుగుతుంది.
- **పిసిఓడి:** పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ రుగ్మతకు లోనయినప్పుడు హార్మోన్లలో జరిగే అసమతౌల్యం వల్ల వెంట్రుకలు రాలతాయి.
- **గర్భం:** ప్రసవం తర్వాత శరీరంలో పెరిగి తరిగే హార్మోన్లు, తల్లిగా కొత్త బాధ్యతతో ఒత్తిడికి లోనవడం, నిద్ర తగ్గడం వల్ల ఈ దశలో వెంట్రుకలు ఊడొచ్చు.
- **హెయిర్ ఎక్స్‌టెన్షన్స్:** బరువైన విగ్గులు, సవరాలు వాడటం వల్ల వెంట్రుకల మీద ఒత్తిడి పడి ఊడిపోతాయి.
- **హెయిర్ ట్రీట్మెంట్లు:** తరచుగా డైయింగ్, స్ట్రయిటెనింగ్ మొదలైన బ్యూటీ ట్రీట్మెంట్లను వాడుతూ ఉన్నా జుట్టు రాలిపోవచ్చు.
- **తలలో పుండ్లు:** తలలో చుండ్రు పెరిగిపోయి పుండ్లు ఏర్పడినా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల వల్ల వెంట్రుకలు రాలిపోవచ్చు.
- **అలోపేసియా:** పేను కొరుకుడు వల్ల కూడా వెంట్రుకలు రాలిపోతాయి.
- **హెయిర్ స్టయిల్స్:** వెంట్రుకలను బిగుతుగా వెనక్కి లాగి కట్టే 'పోనీ టెయిల్' హెయిర్ స్టయిల్, వెంట్రుకలను బిగుతుగా పట్టి ఉంచే క్లిప్పుల వల్ల వెంట్రుకలు ఊడతాయి.

వంశపారంపర్యంగా సంక్రమించిన బట్టతల మినహా, మిగతా సమస్యలన్నిటినీ కాలంతోపాటు, సమర్థమైన చికిత్సలతో సరిద్దితే వెంట్రుకలు ఊడడం తగ్గి, తిరిగి చక్కగా పెరుగుతాయి.

ఎన్ని వెంట్రుకలు?

రోజుకి 50 నుంచి 100 వెంట్రుకలు రాలడం సర్వసాధారణం. అలా రాలుతూ పోతే ఇక తల మీద వెంట్రుకలే మిగలవని భయపడవలసిన అవసరం లేదు. రాలే వెంట్రుకలు రాలుతూ ఉంటే కొత్త వెంట్రుకలు పుడుతూ, పెరుగుతూ ఉంటాయి. అయితే ప్రతి రోజూ రాలే వెంట్రుకల్ని లెక్కపెట్టుకుండా ఉండలేం కాబట్టి, వెంట్రుకలు అవసరానికి మించి రాలుతున్నాయో, లేదో తెలియాలంటే ఓ విషయాన్ని గమనించాలి. ఎప్పుడూ ఒకే పరిమాణంలో రాలుతున్న వెంట్రుకలు హఠాత్తుగా కుచ్చులుగా రాలడం మొదలుపెడితే, అప్పుడు సమస్యగా గుర్తించాలి. మన చర్మం, గోళ్ల కులాగే వెంట్రుకలు కూడా పాతవి ఊడి కొత్తవి పుడుతూ ఉంటాయి. అలా పుట్టి పెరిగే క్రమం మూడు దశల్లో సాగుతుంది. అవే... అనాజెన్, కెటాజెన్, టీలోజెన్.

- **అనాజెన్:** ఇది వెంట్రుకలు పెరిగే దశ. తల మీద ఈ దశలో ఉన్న కొన్ని వెంట్రుకలు 3 నుంచి 5 ఏళ్లపాటు పెరుగుతూనే ఉంటాయి. సుమారుగా నెలకు ఒక సెంటీమీటరు వరకూ వెంట్రుకలు పెరగొచ్చు. కొందరికి ఈ వేగం ఇంకొంత ఎక్కువగా ఉంటుంది. ఎటువంటి శిరోజాల సమస్యలు, అనారోగ్యాలు, పోషకాహారలోపాలు లేకపోతే వెంట్రుకలు పూర్తి స్థాయిలో పెరుగుతాయి.
- **కెటాజెన్:** ఇది ఇంటర్మీడియట్ స్టేజ్. ఈ దశలో పూర్తి స్థాయి వరకూ పెరిగిన కొన్ని వెంట్రుకలు ఇక పెరగకుండా ఆగిపోతాయి. ఈ దశ కొన్ని వారాల వరకూ కొనసాగుతుంది.
- **టీలోజెన్:** ఇది విశ్రాంతి దశ. రెండు నుంచి మూడు నెలల వరకూ ఉండే ఈ దశ చివర్లో వెంట్రుకలు ఊడిపోతాయి. తిరిగి వాటి స్థానంలో కొత్త వెంట్రుకలు పెరగడానికి అనాజెన్ దశకు వెంట్రుకలు చేరుకోవాలి. ఇలా ఈ మూడు దశలూ ఒకదాని తర్వాత ఒకటిగా తిరుగుతూనే ఉంటాయి.

తల మీదున్న వెంట్రుకల్లో 90% అనాజెన్ దశలో ఉంటే, మిగతా 10% టీలోజెన్ దశలో ఉంటాయి. అయితే వంశపారంపర్యంగా బట్టతల సంక్రమించినవారిలో టీలోజెన్ దశకు చేరుకున్న కొన్ని వెంట్రుకలు తిరిగి కెటాజెన్ దశకు చేరుకోకపోవచ్చు. అలాగే పెరిగే వయసు కారణంగా కూడా ఇలా జరగవచ్చు. ఇలాంటప్పుడు తల పలచబడుతుంది. ఒకవేళ ఈ రెండు కారణాలు మినహా తల పలుచబడిందంటే, తల మీద నిర్దిష్ట ప్రదేశంలో 50% వెంట్రుకలు ఊడిపోయాయని అర్థం. అంత శాతం ఊడిపోయినప్పుడు మాత్రమే వెంట్రుకలు ఊడిపోతున్నట్టు గ్రహింపుకొస్తుంది.

అపోహలు - వాస్తవాలు



- **నూనెతో వెంట్రుకలు పెరుగుతాయి!**
  ఇది అపోహ. నూనె వాడకపోయినా వెంట్రుకలు పెరుగుతాయి. వెంట్రుకల పెరుగుదల జన్యుపరంగా సంక్రమించిన లక్షణం మీద ఆధారపడి ఉంటుంది. వెంట్రుకలు పొడిబారినా, మెత్తగా తయారవ్వాలన్నా తలస్నానానికి అరగంట ముందు వెంట్రుకలకు నూనె పట్టించి మసాజ్ చేసి తల స్నానం చేయాలి. ఇందుకోసం తలనూనెను వాడొచ్చు.
- **హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు రాలుతుంది!**
  ఇది కూడా అపోహ! జుట్టు రాలడానికి హెల్మెట్ ధరించడం కారణం కాదు. హెల్మెట్ పెట్టుకోవడం వల్ల తలలో చమట పట్టి, చుండ్రు ఎక్కువై, దాని వల్ల పుండ్లు పడి వెంట్రుకలు రాలే అవకాశం ఉంటుంది. అంతేగానీ తలను శుభ్రంగా ఉంచుకున్నంతకాలం హెల్మెట్ పెట్టుకున్నా వెంట్రుకలు రాలవు.
- **చిట్కాలు పాటిస్తే వెంట్రుకలు పెరుగుతాయి!**
  ఎన్ని చిట్కాలు పాటించినా అవి వెంట్రుకలను మెత్తగా మారుస్తాయే తప్ప పెరగడానికి ఏ విధంగానూ ఉపయోగపడవు.

ఇవి కూడదు

వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. అవేంటంటే...

- క్లోరిన్ కలిపిన స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లేముందు మంచినీళ్లతో తలస్నానం చేసి క్యాప్ పెట్టుకోవాలి. ఈత కొట్టిన తర్వాత చివర్లో మళ్లీ మంచి నీళ్లతో తలస్నానం చేయాలి.
- ఎండలోకి వెళ్లే ప్రతిసారీ సన్‌స్క్రీన్ హెయిర్ స్ప్రే వాడాలి.
- తలకు వేడి లేదా చల్లని గాలి పదే పదే తగలకుండా చూసకోవాలి.
- ఎండలో వెళ్లేటప్పుడు తలకు స్కార్ఫ్ కట్టుకోవాలి, లేదా క్యాప్ పెట్టుకోవాలి.
- హెయిర్ డ్రయ్యర్, స్ట్రయిటెనర్, హెయిర్ స్ప్రేలు తరచుగా వాడకూడదు.
- హార్ష్ షాంపూలు వాడకూడదు.

చివర్లు చిట్లడం

పోషకాహారలోపం, కాలుష్యం, ఎండ, గాలులు... వీటి వల్ల వెంట్రుకల చివర్లు చిట్లుతాయి. ఇలాంటప్పుడు కత్తెరతో చివర్లను కత్తిరించి, లోపాన్ని సరి చేసుకోవాలి.

బాల నెరుపు


టీనేజర్లలో తెల్ల వెంట్రుకలకు ఈ మధ్య కాలంలో సర్వసాధారణమైపోయాయి. ఇందుకు కారణం... వంశపారంపర్యం, వాతావరణ మార్పులు, కాలుష్యం, ఆహారం ద్వారా శరీరంలోకి చేరే రసాయనాలు. వెంట్రుకలలో మెలనిన్ ఉత్పత్తి తగ్గితే వెంట్రుకలు తెల్లబడతాయి. అలొపేసియా తర్వాత పెరిగే వెంట్రుకలు కూడా మొదట తెల్లగా పెరిగి తర్వాత నల్లగా మారతాయి. విటిలిగో (బొల్లి) ఉన్న వాళ్లలో కూడా తల మీద బొల్లి ఉన్న ప్రదేశంలో వెంట్రుకలు తెల్లగా మారిపోతాయి.

వెంట్రుకలు ఆరోగ్యంగా!

శరీరంలో ఎలాంటి చెడు జరిగినా ఆ ప్రభావం వెంట్రుకల్లో ప్రతిబింబిస్తుంది. శరీరానికి సరిపడా పోషకాలు అందకపోయినా ఆ ప్రభావం వెంట్రుకల మీద పడుతుంది. ఆహారం ద్వారా చేరే పోషకాలను శరీరం ప్రధాన అంతర్గత అవయవాల కోసం కేటాయిస్తుంది. వాటిలో ఖర్చయిపోగా మిగిలినవి మాత్రమే వెంట్రుకలు, గోళ్లకు వెళ్తాయి. ఒకవేళ సరిపడా పోషకాలు తీసుకోకపోతే వెంట్రుకల మీద ఆ ప్రభావం పడి, రాలిపోతూ ఉంటాయి. కాబట్టి వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండాలంటే, పోషకాహారంతో పాటు, విటమిన్ ఇ, డి, సి, బి - కాంప్లెక్స్ సక్రమంగా, సరిపడా అందేలా చూసుకోవాలి. ఇందుకోసం తాజా ఆకుకూరలు, కూరగాయలు, మాంసకృత్తులు సరిపడా అందించాలి. అలాగే వెంట్రుకలను శుభ్రంగా ఉంచుకోవాలి. వాతావరణ మార్పుల ప్రభావానికి లోనవకుండా, కాలుష్యం బారిన పడకుండా చూసుకోవాలి.

ఫుడ్ ఫ్యాక్ట్

మొలకలు ఇలా కూడా తినొచ్చు



మొలకలు కచ్చితంగా పోషక భాండాగారాలే! అయితే వాటిని పచ్చిగానే తినాలా? ఎలా తినడం ఆరోగ్యకరం?

మొలకలతో ఫుడ్ పాయిజనింగ్ జరిగే ఆస్కారాలు ఎక్కువ. తేమతో కూడిన వాతావరణంలో మొలకెత్తుతాయి. కాబట్టి వీటిలో సాల్మనెల్లా, ఇ కొలై సూక్ష్మజీవులు వృద్ధి చెందే అవకాశాలుంటాయి. అలాగే పచ్చి మొలకలను జీర్ణం చేసుకోగలిగే సామర్థ్యం అందరికీ ఉండదు. వీటిని మన శరీరం సంపూర్ణంగా శోషించుకోలేదు. మరీ ముఖ్యంగా బలహీనమైన జీర్ణశక్తి, పేగులు కలిగిన వాళ్లలో కడుపు ఉబ్బరం, కడుపు నొప్పి, డయేరియా లాంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. ఈ ఇబ్బందులేవీ లేకుండా ఉండాలంటే మొలకలను ఆవిరి మీద ఉడికించి, లేదా ఉడకబెట్టి తినాలి. ఉడికించడం వల్ల వీటిలోని విటమిన్ సిని నష్టపోతాం. అయినప్పటికీ మిగతా పోషకాలన్నీ అంది, మొలకలు పూర్తిగా జీర్ణం కావడం కోసం వాటిని ఉడికించిన తర్వాత తినడమే మేలు. గర్భిణులు, పిల్లలు, పెద్దలు పచ్చి మొకలను తినకపోవడమే శ్రేయస్కరం. వీళ్ల శరీరాలు పచ్చి మొలకల కారక ఫుడ్ పాయిజనింగ్ తాలూకు ప్రభావాలను తట్టుకోలేవు.

హార్ట్ కేర్

పిల్లల గుండె పదిలంగా...

పుట్టుకతో గుండె జబ్బులను వెంటబెట్టుకు వచ్చి, వాటికి చికిత్స తీసుకున్న పిల్లలను గాజు బొమ్మల్లా కాపాడుకోవాలి. వైద్యులు సూచించిన సలహాలు, సూచనలు, జాగ్రత్తలు పాటిస్తే, ఈ కోవకు చెందిన పిల్లలు సాధారణ పిల్లల్లా ఆరోగ్యంగా ఎదగగలుగుతారని అంటున్నారు హృద్రోగ వైద్యులు డాక్టర్ ఆశిష్.



"గతంలో చిన్న పిల్లల గుండె వైద్యానికి సంబంధించిన చికిత్సలు ఎక్కువగా అందుబాటులో ఉండేవి కావు. దీనితో మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. చాలా సందర్భాలలో అప్పుడే పుట్టిన పసిపాపలు మరణించటానికి వెనకున్న కారణాలు తెలిసేవి కూడా కాదు. కొన్ని సందర్భాలలో పిల్లలు పెద్ద అయిన తర్వాత హృదయ సంబంధ సమస్యలు బయటపడేవి. ఈ మధ్యకాలంలో హృదయ సంబంధ వైద్య పరీక్షలలోను, విధానాలలోను అనేక మార్పులు వచ్చాయి. అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అందువల్ల పెద్ద సమస్యలతో పాటుగా చిన్న వాటికి కూడా పరిష్కారాలు లభిస్తున్నాయి. దీని వల్ల పిల్లలు పెద్ద అయిన తర్వాత వారికి ఆరోగ్య సమస్యలు లేకుండా ఉంటున్నాయి. సాధారణంగా పిల్లల్లోని హృదయ సంబంధమైన రోగాలను సులభమైనవిగాను.. క్లిష్టమైనవిగాను వర్గీకరిస్తారు. ఆ వయస్సులోనే శస్త్ర చికిత్సతో సరిచేయగలవాటిని సులభమైన సమస్యలుగా వర్గీకరిస్తారు. ఉదాహరణకు కొందరు పిల్లలో ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమవుతుంది. ఆ సమయంలోనే ఈ శస్త్ర చికిత్స చేయటం వల్ల సమస్య పూర్తిగా పరిష్కారమవుతుంది. నాలుగైదేళ్ల పాటు జాగ్రత్తగా ఉంటే పెద్ద అయిన తర్వాత హృద్రోగ సమస్యలు వచ్చే అవకాశాలు తక్కువ ఉంటాయి. ఇక క్లిష్టమైన సమస్యలు ఒకే శస్త్ర చికిత్సతో నయమవ్వవు. ఆ రోగి పరిస్థితి ఆధారంగా నాలుగైదు సార్లు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుంది.

ఎదురయ్యే సమస్యలివే!

పిల్లల శస్త్రచికిత్సలలో వారి తల్లితండ్రుల పాత్ర చాలా కీలకమైనది. సాధారణంగా వారికి శస్త్రచికిత్సకు సంబంధించిన ఎక్కువ అవగాహన ఉండదు. దీనితో వారు చిన్న విషయాలకు ఎక్కువగా ఆందోళన చెందుతారు. లేదా పెద్ద విషయాలకు సంబంధించిన సంకేతాలను కూడా పట్టించుకోరు. అందువల్ల తల్లితండ్రులకు అవగాహన కల్పించటం చాలా ముఖ్యమైన విషయం. కొన్ని సార్లు చికిత్స అయిన తర్వాత రకరకాల అనుమానాలు వస్తూ ఉంటాయి. ఉదాహరణకు పిల్లలకు వ్యాక్సినేషన్ వేయించాల్సి ఉంటుంది. శస్త్రచికిత్స జరిగిన వెంటనే వ్యాక్సినేషన్ వేయిస్తే కొన్ని ప్రతికూల ఫలితాలు ఏర్పడే అవకాశముంటుంది. అదే విధంగా పిల్లలు తినే ఆహారంలో ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాలి. మందులను వాడే విషయంలో కూడా ఎటువంటి అశ్రద్ధ చేయకూడదు. పిల్లలు తమ శరీరంలో వచ్చిన మార్పులను గమనించి చెప్పలేకపోవచ్చు. అందువల్ల తల్లితండ్రులే వారిలో మార్పులను గమనించాల్సి ఉంటుంది. ఏవైనా మార్పులు వస్తే వాటిని వైద్యుడి దృష్టికి తీసుకువచ్చి చికిత్స చేయించాల్సి ఉంటుంది. లేకపోతే కొన్ని సార్లు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది.

ఇవి కూడా గమనించాలి..

మన శరీరం చాలా సంక్లిష్టమైన వ్యవస్థలతో కూడి ఉంటుంది. ఏదైనా ఒక అవయవానికి చికిత్స చేస్తే- దాని ప్రభావం ఇతర అవయవాలపై కూడా పడుతుంది. ఉదాహరణకు హృద్రోగ సంబంధిత వ్యాధుల్లో శస్త్రచికిత్స తర్వాత ఊపిరితిత్తులకు తక్కువ రక్తప్రసరణ జరుగుతుంది. దీని వల్ల ఊపిరితిత్తుల్లో కొన్ని మార్పులు వస్తాయి. అందువల్ల శస్త్రచికిత్స తర్వాత ఊపిరికి సంబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయేమో గమనించాలి. కొన్ని సార్లు కాలేయానికి సంబంధించిన సమస్యలు కూడా ఏర్పడే అవకాశముంటుంది. అయితే చాలా సార్లు కాలేయంలో- మందులు వాడటం వల్ల జరిగే కొన్ని మార్పుల వల్ల తాత్కాలికంగా ఈ సమస్యలు ఏర్పడతాయి. ఇవి మళ్లీ సమసిపోతాయి కాబట్టి వీటి కోసం ఎక్కువ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మందులు ఇలా...

గుండె సర్జరీలు, క్యాథెటర్ ఇంటర్వెన్షన్, గుండె సంబంధిత పరికరాలను అమర్చుకున్న పిల్లలకు వైద్యులు సూచించినంత కాలం రక్తాన్ని పలుచన చేసే బ్లడ్ థిన్నర్లను వాడుకోవలసి ఉంటుంది. సర్జరీకి ముందూ, తర్వాతా బీటా బ్లాకర్స్, ఎసిఇ ఇన్హిబిటర్లను వాడుకోవాలి. వీటితో దుష్ప్రభావాలు ఎక్కువ కాబట్టి వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. పిల్లల వయసు, బరువుల ఆధారంగా మోతాదులను సరిచేసుకుంటూ ఉండాలి.



డాక్టర్ ఆశిష్ సాఠ్రే,
సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్,
మెడికవర్ హాస్పిటల్స్, హైదరాబాద్.

అవేర్‌నెస్

ఆ మందులు పరిమితంగానే...

మలబద్ధకం వేధిస్తే, చటుక్కున లాక్సేటివ్స్ వాడేస్తున్నారా? అయితే వాటిని వాడుకనే ముందు, వాటితో ఒరిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకోండి.

ఎక్కువ సమయాల పాటు కదలకుండా ఉండే జీవనశైలి, అస్తవ్యస్త ఆహారపుటలవాట్లు, తరచూ ఆహార శైలులు మారిపోతూ ఉండడం వల్ల ఎంతో మందిని మలబద్ధకం వేధిస్తూ ఉంటుంది. వారానికి మూడు కంటే తక్కువసార్లు మలవిసర్జన జరిగే వాళ్లలో డీహైడ్రేషన్, మొలలు, మలద్వార రక్తస్రావం, గుండె అస్తవ్యస్తంగా కొట్టుకోవడం లాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ సమస్యలను సరిదిద్దుకోవడం కోసం జీవనశైలి మార్పులు చేసుకోవాలి. బదులుగా లాక్సేటివ్‌ను వాడుకుంటూపోతే, ఎన్నో దుష్ప్రభావాలకు గురి కావలసి వస్తుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. అవేంటంటే...



డిపెండెన్సీ: పేగుల కదలికల కోసం శరీరం లాక్సేటివ్స్ మీద ఆధారపడే పరిస్థితి నెలకొనవచ్చు. అతిగా వాడితే, మలాన్ని కదిలించడానికి అవసరమైన సహజసిద్ధ సామర్థ్యాన్ని పేగులు కోల్పోతాయి.

డయేరియా: శరీరంలోని నీటిని పేగుల్లోకి శోషణ చెందేలా చేసి, నీళ్ల సహాయంతో మలాన్ని విసర్జించేలా చేసే లాక్సేటివ్స్‌ను అతిగా వాడితే, డయేరియా తప్పదు. దాంతో ఎలక్ట్రొలైట్లలో హెచ్చుతగ్గులు చోటుచేసుకుని, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

మెలనోసిస్ కొలై: పెద్ద పేగుల్లోని లోపలి పొర నల్లగా మారే పరిస్థితే మెలనోసిస్ కొలై. కాబట్టి మలబద్ధకాన్ని వదిలించుకోవడం కోసం లాక్సేటివ్స్ వాడుకోకుండా వైద్యుల సలహా తీసుకోవాలి.

పోషక లోపం: పొట్ట విసర్జకాలను పేగుల్లోకి పంపించే తొందర్లో పోషకాలను శోషించుకునే సమయం లేకుండా పోతుంది. దాంతో పోషక లోపం ఏర్పడవచ్చు. లాక్సేటివ్స్‌తో ఐరన్ లోపం ప్రధానంగా తలెత్తుతూ ఉంటుంది.

సహజసిద్ధ పద్ధతుల ద్వారా...

సహజసిద్ధంగా మలవిసర్జన జరగాలంటే ఈ పదార్థాలు పాటించాలి.

- పొట్టు తీయని ధాన్యాలు
- ఓట్స్ బ్రౌన్ రైస్
- పీచు ఎక్కువగా ఉండే అరటి, జామ
- ఆకుకూరలు
- చిక్కుళ్లు, బీరకాయలు
- బాదం, షియా, ఫ్లాక్స్ విత్తనాలు
- రోజుకు 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు



సమావేశంలో కోదండ రెడ్డి, రేమండ్ పీటర్, సునీల్ తదితరులు

ఆర్వోఆర్ చట్టాన్ని సవరించాలి

» అనివార్యమని అభిప్రాయపడ్డ ధరణి కమిటీ

» రేపు కలెక్టర్లతో భేటీ కావాలని నిర్ణయం

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌ను సవరించాలంటే.. ముందుగా ప్రస్తుతం అమల్లో ఉన్న 'రికార్డ్ ఆఫ్ రైట్ (ఆర్వోఆర్) 2020' చట్టాన్ని సవరించాల్సిన అవసరముందని ధరణి కమిటీ బలంగా అభిప్రాయపడింది. గత సర్కారు తెచ్చిన ధరణి ప్రక్షాళనకు ఏర్పాటైన కమిటీ సోమవారం మూడోసారి సమావేశమైంది. ధరణి కమిటీ కన్వీనర్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ అధ్యక్షతన.. సభ్యులు ఎం.సునీల్‌కుమార్, మాజీ సీసీఎల్‌ఏ రేమండ్ పీటర్, కోదండరెడ్డి, మధుసూదన్‌తోపాటు సీఎంఆర్వో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.లచ్చిరెడ్డి సీసీఎల్‌ఏలో భేటీ అయి బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా.. దరఖాస్తుల ఫ్లో ఎలా ఉంటుందో ధరణి సాంకేతిక బృందం ప్రజెంటేషన్ ఇచ్చింది. ధరణిలో చేయాల్సిన మార్పులు, భూసమస్యల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుపుతూ 13 సిఫారసులతో కూడిన లేఖను చాడ వెంకట్‌రెడ్డి కమిటీకి అందించారు. ఆయనతోపాటు.. భూదాన్ బోర్డు మాజీ సెక్రటరీ రాజేందర్‌రెడ్డి ఇచ్చిన సలహాలు, సూచనలను కూడా కమిటీ సభ్యులు స్వీకరించారు. కాగా.. ధరణిలో ఉన్న మాడ్యూళ్లను ఇప్పటికే అధ్యయనం చేసి, అందులో ఎక్కువగా ఉన్న సమస్యలను ప్రాథమికంగా గుర్తించి, ఆర్వోఆర్ 2020 చట్టం సవరణ అనివార్యమనే నిర్ణయానికి వచ్చిన కమిటీ సభ్యులు.. బుధవారం కలెక్టర్లతో సమావేశం కావాలని నిర్ణయించారు. అనంతరం క్షేత్రస్థాయి అధ్యయనానికి రోజుకు రెండు జిల్లాల చొప్పున పర్యటించి.. ప్రతి జిల్లాలో ఆర్డీవో, తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, ఆర్ఐ తదితర అధికారులతో మాట్లాడి రెవెన్యూ సమస్యలను తెలుసుకోనున్నారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి మధ్యంతర నివేదికలను ప్రభుత్వానికి అందజేయనున్నారు.

లొసుగులను సరిచేయడంపైనే..

ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులను ఎలా సరిచేయాలనే అంశంపైనే తాము పనిచేస్తున్నట్టు ధరణి కమిటీ సభ్యుడు, మాజీ సీసీఎల్‌ఏ రేమండ్ పీటర్ తెలిపారు. దీనిపై కొందరు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో మాట్లాడుతామని ఆయన వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా సూచనలు ఇచ్చేవారిని కూడా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. "ధరణి సమస్యల వ్యవహారం మొత్తం అగ్రికల్చర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలతో ముడిపడింది. అందుకే వారితోనూ మాట్లాడుతాం. అసైన్డ్, పీవోటీ లిస్ట్, ఈనామ్, వక్ఫ్, ఎండోమెంట్, భూదాన్.. ఇలా చాలా వాటిలో సమస్యలు ఉన్నాయి. ధరణి లేదా మరే ఇతర సాఫ్ట్‌వేర్ అయినా సరే.. ఏదైనా అప్లికేషన్‌ను ఆమోదించినా, తిరస్కరించినా దరఖాస్తుదారుడికి సమాచారం తెలియాలి. ప్రతిదీ సర్వర్లో నిక్షిప్తం కావాలి. ధరణిలో అలాంటి వ్యవస్థ ఉందా? లేదా? అన్నది పరిశీలిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. మరో సభ్యుడు, భూచట్టాల నిపుణులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. భూమి సమస్యలు భావోద్వేగాలతో కూడుకున్నవి, సంక్లిష్టమైనవని అభిప్రాయపడ్డారు. వాటిని త్వరగా పరిష్కరించేందుకే తాము అధ్యయనాన్ని వేగవంతం చేశామని.. వాటి మూలాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. భూపరిపాలనలోనూ అనేక మార్పులు చేపట్టేందుకు తాము సిఫారసులు చేస్తామని.. అవగాహన కలిగిన వారిని సంప్రదించి, తుది నివేదిక ఇవ్వడానికి ముందే మధ్యంతర సిఫారసులు కూడా ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ధరణి నిర్వహణను విదేశీ కంపెనీకి ఇవ్వడం పొరపాటే అని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించారని.. ఆయన మొదటి సమీక్షలోనే ఈ అంశాన్ని లేవనెత్తారని కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి గుర్తుచేశారు. అక్రమ భూ లావాదేవీల విషయాలను కూడా తాము పరిశీలిస్తున్నామని.. ధరణిలో లోపాల కారణంగా లక్షల మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

రాహుల్ గాంధీ యాత్రపై దాడులు దారుణం!

అసోంలో బీజేపీ గూండాల దాడిని ఖండిస్తున్నా.. ఆ పార్టీ నేతలు ఇలాంటివి మానుకోవాలి

» టీపీపీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా అసోంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న యాత్రపైన బీజేపీ గూండాలు దాడి చేసేందుకు ప్రయత్నించడం దారుణమని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. దేశంలో విద్వేషాలు కాదు.. ప్రేమ పెంపొందాలని, బాధితులకు న్యాయం జరగాలని రాహుల్ న్యాయయాత్ర చేస్తుంటే.. బీజేపీ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేయడం సిగ్గు చేటని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుత రాహుల్ న్యాయయాత్రతో ప్రజల్లో మార్పు వస్తోందని, దాన్ని చూసి భయపడే.. బీజేపీ నేతలు దాడులు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. దేశంలో ఇలాంటివి జరగడం మంచిది కాదని హితవు పలికారు. దేశంలో ప్రజలకు అందుబాటులో లేకుండా బీజేపీ పాలన కొనసాగుతోందని విమర్శించారు. దేశంలోని అన్ని కులాలు, మతాలకు చెందిన ప్రజలంతా అన్నదమ్ముల్లాగా ప్రేమతో.. ఒక్కటిగా ఉండాలని రాహుల్ గతంలోనూ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేశారని జగ్గారెడ్డి గుర్తు చేశారు. మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన హింసాత్మక ఘటనలు, వాటిని అరికట్టడంలో మోదీ ప్రభుత్వ వైఫల్యంపై రాహుల్ ప్రశ్నించడం ఓర్చుకోలేకపోతున్నారన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న దౌర్జన్యాలను ఎండగట్టి.. ప్రజలను మేల్కొలిపేందుకు న్యాయ యాత్ర చేస్తున్నట్లు వెల్లడించారు. దేశ ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలని, వారిలో ఒక మనోధైర్యం నింపాలని తన యాత్ర ద్వారా రాహుల్ ప్రయత్నిస్తుంటే.. బీజేపీ నాయకులు కుట్రలతో అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ నేతలు ఇలాంటి పద్ధతులు మానుకోవాలని హితవు పలికారు.

మెట్రో రెండో దశకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)



మైలార్‌దేవపల్లి- ఆరాంగఢ్, రాజేంద్రనగర్ వద్ద ప్రతిపాదించిన నూతన హైకోర్టు స్థలం వరకు మెట్రో సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇదే కారిడార్ కింద.. నాగోలు నుంచి ఎల్బీనగర్‌కు, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు, మైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు 29 కిలోమీటర్ల మేర నూతన మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక కారిడార్-5లో రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర నూతన మార్గాన్ని ప్రతిపాదించారు. కారిడార్-6లో మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు 14 కిలోమీటర్ల మేర నూతన మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు.

47 రోజుల్లోనే అమల్లోకి ప్రణాళిక..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 47 రోజుల్లోనే మెట్రో రెండో దశ ప్రణాళికను అమల్లోకి తెచ్చింది. మెట్రో మొదటి దశలో రూ.14,132 కోట్లతో 72 కిలోమీటర్ల పనులను ప్రతిపాదించగా.. 69.2 కిలోమీటర్లను పూర్తిచేశారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన పనులను 2017లో పూర్తి చేశారు. ఎల్బీనగర్- మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం కారిడార్లలోని 57 స్టేషన్ల గుండా ప్రతిరోజూ 1028 సర్వీసులను నడిపిస్తున్నారు. ఈ మేరకు రోజుకు సగటున 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది వరకు ప్రయాణిస్తున్నారు. అయితే నగరంలో జనాభా రోజురోజుకూ పెరిగిపోతున్న తరుణంలో మెట్రో విస్తరణపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రెండో దశ కింద రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు (31 కిలోమీటర్లు), బీహెచ్ ఈఎల్-లక్డీకపూల్ మధ్య (26 కిలోమీటర్లు), నాగోలు- ఎల్బీనగర్ మధ్య (5 కిలోమీటర్లు) పను లు ప్రతిపాదించారు. ఇందులో రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు పనులను ప్రభుత్వమే సొంతంగా చేపడతామని ప్రకటించి రూ.6,250 కోట్లను మంజూరు చేసింది. పనులకు సంబంధించి 2022 డిసెంబర్ 9న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టర్ ఎంపికలో జాప్యం జరగడం, ఈలోగా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి ప్రభుత్వం మారడంతో పనులకు బ్రేక్ పడింది.

ప్రజా రవాణాకు పెద్దపీట..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో రెండో దశ పనుల్లో కొంతభాగం రియల్టర్లు, రాజకీయ నాయకులకే ప్రయోజనం చేకూరేలా ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఇలా కాకుండా.. ప్రజా రవాణాకు ఆమోదయోగ్యమైన మార్గంలో మెట్రోను విస్తరిస్తామని నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు గత డిసెంబరు 7న పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత 13న మెట్రో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎయిర్‌పోర్టు మార్గాన్ని రాయదుర్గం నుంచి కాకుండా పాతబస్తీ నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా మళ్లించే విధంగా ఆలోచించాలని సూచించారు. ఈ నెల 2న మరోసారి మెట్రో విస్తరణపై చర్చించారు. పాతబస్తీ నుంచి ఎల్బీనగర్ మీదుగా సవరించిన ఎయిర్‌పోర్టు అలైన్‌మెంట్ కోసం ట్రాఫిక్ అధ్యయనాలు, డీపీఆర్‌లను త్వరగా పూర్తి చేయాలని, లక్ష్మీగూడ-జల్‌పల్లి-మామిడిపల్లి స్ట్రెచ్‌లో మెట్రోలో కొంత భాగాన్ని వేసే విషయంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. సీఎం సూచించిన మార్గాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన అధికారులు రూట్‌మ్యాప్‌ను ఇటీవల అందించగా.. ప్రభుత్వం దానికే ఆమోదముద్ర వేసింది. ఏడు మార్గాల్లో 70 కిలోమీటర్ల పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

కొత్త రూట్‌మ్యాప్ ఇదే..

కారిడార్-2: ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు (5.5 కిలోమీటర్లు)

కారిడార్-2: ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్డు వరకు(1.5 కిలోమీటర్లు)

కారిడార్-4: నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వరకు, అక్కడి నుంచి చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్డు, మైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు.(29 కిలోమీటర్లు)

కారిడార్-4: మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంగఢ్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు (4 కిలోమీటర్లు)

కారిడార్-5: రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి బయోడైవర్సిటీ జంక్షన్, నానక్‌రాంగూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) వరకు.(8 కిలోమీటర్లు)

కారిడార్-6: మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు(14 కిలోమీటర్లు)

కారిడార్-7: ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్ వరకు (8 కిలోమీటర్లు)

నగరం నలుమూలలకూ మెట్రో..

నగరంలో మొదటి దశలో ఇప్పటికే 69.2 కిలోమీటర్ల మార్గంలో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. అయితే వీటికి అనుసంధానంగా రెండో దశలో ప్రతిపాదించిన పనులను పూర్తి చేయడం ద్వారా నగరం నలుమూలలా మెట్రో రవాణా ఏర్పడే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు నాగోలు-ఎల్బీనగర్ రూట్‌ను కలపడం ద్వారా అటు రాయదుర్గం నుంచి, మియాపూర్ నుంచి రాకపోకలు సులువుగా ఉంటాయి. అలాగే ఎల్బీనగర్-వనస్థలిపురం-హయత్‌నగర్ వరకు, పాతబస్తీ నుంచి వయా చాంద్రాయణగుట్ట మీదుగా రైలును తీసుకెళ్లడంతో పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కొత్తగా మైలార్‌దేవ్‌పల్లి నుంచి ప్రతిపాదిత హైకోర్టు వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించడంతో మెట్రో శివారు వరకు చేరుతోంది. ఇదిలా ఉండగా, కొత్త మెట్రో డీపీఆర్‌ల తయారీ శరవేగంగా జరుగుతోందని, మరో మూడు నెలల్లో డీపీఆర్‌లు సిద్ధం చేస్తామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

సినీజగమంతా రామమయం



ప్రస్తుతం ఎలివేషన్స్ ట్రెండ్ నడుస్తోంది. డైలాగులతో, కెమెరా ట్రిక్కులతో హీరోను ఓ సూపర్ నాచురల్ పవర్‌లా చూపించడం నేటి దర్శకులకు పరిపాటైపోయింది. అసలు ఈ ఎలివేషన్ అనే దానికి విత్తనం ఎక్కడ పడిందో ముందు తెలుసుకుందాం. హీరో కేరక్టర్‌ని ఆకాశమంత ఎత్తులో చూపించే ప్రక్రియ రామాయణకావ్యం నుంచి మొదలైంది. దానికి నాంది పలికింది వాల్మీకి. 'రామాయణం'లో 'మారీచ ఉవాచ' చదివిన వాళ్లకు ఎలివేషన్ అంటే ఏంటో అర్థమవుతుంది. ఓ విధంగా రాముడికి వాల్మీకి ఇచ్చినంత ఎలివేషన్ ఆ తర్వాత ఏ కథల్లోనూ కావ్యాల్లోనూ, ఏ సినిమాల్లోనూ ఇప్పటికీ ఎవరూ ఇవ్వలేకపోయారన్నది వాస్తవం. అందుకే ఇప్పటికీ హీరో అనే పదానికి నిర్వచనం అంటే శ్రీరాముడే.

పూర్తి కథనం ఈ-పేపర్‌లో...

మాట విలువ చెప్పే బాలరాజు



'బిగ్‌బాస్' సోహైల్ హీరోగా శ్రీ కోనేటి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'బూట్ కట్ బలారాజు' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఎం.డి. పాషా ఈ సినిమాకు నిర్మాత. ఈ చిత్రం ట్రైలర్‌ను ఆదివారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు.ఈ వేడుకలో సోహైల్ మాట్లాడుతూ 'నేను 'బిగ్‌బాస్' నుంచి బయటకు రాగానే నాతో సినిమా చేస్తానని పాషా భాయ్ చెప్పారు. ఈ సినిమా కోసం బాగా కష్టపడ్డాం. భీమ్స్ అన్న ఈ సినిమాకు మంచి పాటలు ఇచ్చారు. టీమ్ అందరికీ ధన్యవాదాలు' అని చెప్పారు. హీరో శివాజీ మాట్లాడుతూ 'సోహైల్‌లో మంచి తపన ఉంది. పరిశ్రమలో తప్పకుండా నిలబడతాడు. ఎదుగుతున్న నటుడిని అందరూ ప్రోత్సహించాలి' అన్నారు. దర్శకుడు శ్రీ కోనేటి మాట్లాడుతూ 'మంచి వినోదాత్మక చిత్రం ఇది. మాటకి ఉన్న విలువ, గౌరవం గురించి ఈ చిత్రంలో చెబుతున్నాం' అన్నారు. 'కంటెంట్ ఉన్న ప్రతి సినిమా హిట్ అవుతుంది. రెండున్నర ఏళ్లుగా ఈ సినిమా కోసం హార్డ్ వర్క్ చేశాం. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది. అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. 'బిగ్‌బాస్' ఏడు సీజన్ల స్టార్స్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్న ఈ వేడుక గ్రాండ్‌గా జరిగింది.

నవ్య | చిత్రజ్యోతి



జై హనుమాన్ ప్రారంభం

'హను-మాన్' వేడి ఇంకా చల్లారకముందే ఆ సినిమాకు సీక్వెల్‌ని ప్రకటించేశారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ఈ సినిమాకు 'జై హనుమాన్' అని నామకరణం చేశారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్‌ను అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠామహోత్సవం సందర్భంగా సోమవారం మొదలుపెట్టారు. హైదరాబాద్‌లోని హనుమాన్ ఆలయంలో యాగంలో పాల్గొని, స్క్రిప్ట్‌ని హనుమంతుని పాదాల దగ్గర ఉంచి ప్రీప్రొడక్షన్ వర్క్‌ని లాంఛనంగా ప్రారంభించారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేయనున్న ఈ సినిమాకి సంబంధించిన నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది.

రామం రాఘవం



నటుడు ధన్‌రాజ్ దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రానికి 'రామం రాఘవం'. అనే పేరును ఖరారు చేశారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం మేకర్స్ టైటిల్‌తోపాటు ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి పృథ్వీ పోలవరపు నిర్మాత. ఇందులో తండ్రీకొడుకులుగా సుముద్రఖని, ధన్‌రాజ్ కనిపిస్తారని, ఇప్పటివరకూ చూడని కొత్త కథాంశంతో ఈ సినిమా రూపొందుతోందని నిర్మాత తెలిపారు. 'విమానం'ఫేం శివప్రసాద్ యానాల కథ అందిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గాప్రసాద్. తెలుగు, తమిళభాషల్లో ఒకేసారి ఈ చిత్రం విడుదల కానుంది.

మళ్లీ టీఆర్ఎస్?

నెలాఖరులోపు గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం

» లోక్‌సభ ఎన్నికలకు పార్టీ అభ్యర్థులు ఎవరన్నదానిపై కూడా

» బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చడంపై తీవ్రంగా సమాలోచన

» లోక్‌సభ సన్నాహక సమావేశాల్లో కార్యకర్తల డిమాండ్ ఇదే

» కేడర్ లేవనెత్తిన విషయాలు ఎప్పటికపుడు కేసీఆర్ దృష్టికి

» కొందరు ఎమ్మెల్యేలు చిన్నచూపు చూశారని శ్రేణుల ఆవేదన

హైదరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పార్టీ పేరును టీఆర్ఎస్‌గా మార్చడం సహా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు లోపు ముఖ్య నేతలతో సమావేశమై.. లోక్‌సభ నియోజకవర్గాల సమీక్ష సందర్భంగా కార్యకర్తలు చేసిన సూచనలు, వారు లేవనెత్తిన సమస్యల పరిష్కారం, పార్టీ కమిటీల ఏర్పాటు, భవిష్యత్ కార్యాచరణపై కేసీఆర్ స్పందిస్తారని సమాచారం. లోక్‌సభ ఎన్నికల అభ్యర్థులు ఎవరన్నది కూడా తేల్చనున్నారని బీఆర్ఎస్ ముఖ్యులు పేర్కొంటున్నారు. ఈ నెల 3న మొదలై సోమవారం వరకు జరిగిన లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షల్లో కార్యకర్తల సూచనలను ముఖ్య నాయకులు ఏ రోజుకా రోజు కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిలో.. అధికారంలో ఉండగా కార్యకర్తలకు ఎమ్మెల్యేల వేధింపులు, విస్మరించడం వంటి వాటిని గులాబీ బాస్ సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. అభ్యర్థులను ఓడించిన నాయకులు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డవారిపై వేటు వేయాలని కార్యకర్తలు చేసిన డిమాండ్లపై కేసీఆర్ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కమిటీల ఏర్పాటు పైనా కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. కాగా, ఉద్యమ పార్టీగా ప్రారంభమైన టీఆర్ఎస్‌ను.. బీఆర్ఎస్‌గా ఎందుకు మార్చారని దాదాపు అన్ని లోక్ సభ నియోజకవర్గాల కార్యకర్తలు సమీక్షల సందర్భంగా ప్రశ్నించారు. ప్రజలకు దూరం కావడానికి ఇది కూడా ఓ కారణమని కొందరు అభిప్రాయపడ్డారు. మళ్లీ టీఆర్ఎస్‌గా మారిస్తేనే బతికి బట్టకడతామని స్పష్టం చేశారు. దీనిని కేసీఆర్ దృష్టికి తీసుకువెళతామని కేటీఆర్, హరీష్ సహా ముఖ్య నేతలు పేర్కొన్నారు. కాగా, పార్లమెంటు ఎన్నికల్లో ఆశించినట్లు ఫలితాలు దక్కితే బీఆర్ఎస్‌గానే కొనసాగించాలని లేదంటే టీఆర్ఎస్‌గా మార్చాలని పేరు మార్పుపై మరో వాదన కూడా వినిపిస్తోంది. మరోవైపు చేవెళ్ల, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించారు. మిగిలిన స్థానాలపై త్వరలో స్పష్టత రానుంది.

గోడు వెళ్లబోసుకున్న కేడర్

పనిచేసేవారికి ఇకనైనా ప్రాధాన్యమివ్వాలని, క్షేత్రస్థాయి పరిస్థితులు గుర్తించి.. పార్టీని పటిష్టం చేయాలని పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు సమీక్ష సమావేశాల్లో కోరారు. "కొందరు ఎమ్మెల్యేలు ఎన్నికలపుడు తప్ప.. అధికారంలో ఉన్న పదేళ్లు చిన్నచూపు చూశారు. పార్టీ పెద్దలకు చెప్పుకునే చాన్స్ దక్కలేదు. గెలుపునకు కష్టపడినవారిని విస్మరించి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం ఏం పద్ధతి..? గ్రూపులతో కేడర్‌కు లీడర్‌కు మధ్య దూరం పెరిగింది" అంటూ కేటీఆర్, హరీశ్ ముందే ముఖ్య కార్యకర్తలు తేల్చిచెప్పారు. ఉద్యమకారులకు గుర్తింపే లేదని, ఉద్యమ ద్రోహులకు పదవులు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఇలాంటి సమీక్షలు ఎప్పుడో చేయాల్సిందని అభిప్రాయపడ్డారు. సంస్థాగత పటిష్టంపై అధిష్ఠానం ఏమాత్రం దృష్టిపెట్టలేదని.. గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకంలో విఫలమైందని నిందించినట్లు తెలిసింది. కాగా, ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీ స్థానాలవారీ సమావేశాలు నిర్వహిస్తామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తమ ఓట్లు పద్ధతిగా కాంగ్రెస్‌కు మళ్లించి ఆ పార్టీ గెలుపునకు సహకరించిందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో కూడా అవి రెండూ కలిసే బీఆర్ఎస్‌ను ఎదుర్కోనున్నాయని, ఈ కుట్రను కార్యకర్తలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పేరిట కేసీఆర్ దేశవ్యాప్తంగా తిరిగితే బలోపేతం అవుతారన్న భయంతోనే మోదీ కాంగ్రెస్‌కు సహకరించారన్నారు. రాహుల్ కంటే కేసీఆర్‌ను ఎదుర్కోవడం కష్టమని మోదీ తెలంగాణలో కాంగ్రెస్‌కు అండగా ఉన్నారని ఆరోపించారు.

చెల్లి ఎంగేజ్‌మెంట్.. అక్క డాన్స్



హీరోయిన్ సాయి పల్లవి చెల్లెలు పూజా కన్నన్ వివాహం ఆమె చిరకాల మిత్రుడు, ప్రియుడు వినీత్‌తో జరగనుంది. వీరి నిశ్చితార్థ వేడుక మిత్రులు, కుటుంబ సభ్యుల మధ్య జరిగింది. వినీత్‌తో రిలేషన్‌లో ఉన్న సంగతిని పూజ సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన వారం రోజులకే ఈ వేడుక జరగడం గమనార్హం.. పూజ కూడా నటే. ఓ తమిళ చిత్రంతో ఆమె నటిగా అరంగేట్రం చేశారు. నిశ్చితార్థ వేడుకలో కాబోయే వధూవరులతో కలసి సాయి పల్లవి డాన్స్ చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ప్రేమలో.. ఎమోషన్స్



చందు కోడూరి నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమలో', చరిష్మా శ్రీకర్ హీరోయిన్. ఈ నెల 26న విడుదల కానుంది. రాజేశ్ కోడూరి నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను నటుడు శివాజీ రాజా సోమవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు పడిన కష్టానికి మంచి పేరు వస్తుంది. ఇలాంటి చిత్రాలను తప్పకుండా ఆదరించాలి' అని కోరారు. హీరో, దర్శకుడు చందు మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటి వరకూ ఎవరూ ట్రై చేయని కథ తీసుకున్నాను. సహజంగా ఉండేలా తీర్చిదిద్దాను. ఇది ప్రేమకథే. అయినా మంచి ఎమోషన్స్ ఉన్నాయి. కథలో బలం ఉంది కనుక ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. మా అన్నయ్య నిర్మాతగా మారి ఈ సినిమా కోసం బాగా ఖర్చు పెట్టారు. ఓ మేనేజర్‌గా ఎంతో కష్టపడ్డారు. టీమ్‌లో అందరి సహకారంతో సినిమా పూర్తి చేశాం. ఈ చిత్రం హిట్ అయితే మరిన్ని సినిమాలు తీస్తాను. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం రోజునే మా సినిమా ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. జై శ్రీరామ్' అన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XbcbM4V లో చదవండి.

అయోధ్యలో రామాలయ నిర్మాణం

మెజారిటీ వాదానికి నిదర్శనం: పాక్

ఇస్లామాబాద్, న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలో రామాలయ నిర్మాణం భారత్‌లో పెరుగుతోన్న మెజారిటీవాదానికి నిదర్శనం అని పాక్ చెప్పుకొచ్చింది. అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం అయ్యాక పాకిస్తాన్ విదేశాంగ శాఖ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా భారత ముస్లింల అణచివేతలో ఇది భాగమని పేర్కొంది. భారత్‌లో పెరుగుతోన్న హిందూత్వవాదం... మత సామరస్యానికి, ఈ ప్రాంతంలో శాంతికి పెద్ద ప్రమాదమని అందులో పేర్కొన్నారు. భారత ప్రభుత్వం మైనారిటీల భద్రత, వారి పవిత్ర స్థలాలను కాపాడాలని పాక్ కోరింది. కాగా అయోధ్య వ్యవహారంతో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం లేదని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత ప్రజలంతా ఉత్సవాల్లో మునిగితేలుతుండగా భారత ముస్లింలను రెచ్చగొట్టేందుకు పాక్ ప్రయత్నిస్తోందని తెలిపాయి. వారిలాగా మనది పేరుకే రిపబ్లిక్ కాదని, ఐఎస్ఐ(పాక్ గూఢచర్య సంస్థ) చెప్పినట్లు వినే న్యాయ వ్యవస్థ ఇక్కడ లేదని విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు. దిగువ కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా పలు న్యాయ స్థానాల్లో అయోధ్యపై దశాబ్దాలపాటు సాగిన సుదీర్ఘ విచారణలను గుర్తుచేశారు.

సర్కారీ వైద్య కాలేజీలకు కష్టకాలం!

» వరుసగా షోకాజ్ నోటీసులిస్తున్న ఎన్ఎంసీ

» తాజాగా కరీంనగర్, సిరిసిల్ల మెడికల్ కాలేజీలకు..

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలకు గడ్డు పరిస్థితి ఎదురుకాబోతోంది. నెల రోజులుగా మెజార్టీ సర్కారీ మెడికల్ కాలేజీలకు జాతీయ వైద్య కమిషన్ వరుసగా షోకాజ్ నోటీసులు పంపుతోంది. సోమవారం కరీంనగర్, సిరిసిల్ల మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ నుంచి షోకాజ్ నోటీసులు పంపింది. ప్రభుత్వ కాలేజీల్లో అధ్యాపకుల శాతం చాలా దారుణంగా ఉందని, కేవలం 40 శాతమే అటెండెన్స్ ఉంటోందని, 60 శాతం షార్ట్ ఫాల్ ఉంటోందని ఆ షోకాజ్ నోటీసుల్లో పేర్కొనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ అటెండెన్స్(అబాస్) సరిగా లేకపోవడాన్ని ఎన్ఎంసీ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. అధ్యాపకుల హాజరు, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్ఎంఐఎస్), కరిక్యులమ్ సరిగా లేకుంటే సీట్ల కోత పెడతామని ఎన్ఎంసీ హెచ్చరించింది. ప్రస్తుతం మెడికల్ కాలేజీల్లో ఎన్ఎంసీ సూచించినవేవీ సరిగా లేవు. దీంతో ఈ ఏడాది చాలా కాలేజీల్లో సీట్లు కోల్పోయే ప్రమాదం ఉంది. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో అబాస్ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. ఆసిఫాబాద్ వంటి చోట్ల సరైన ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో అబాస్‌ను తీసుకురాలేకపోయారు. మరికొన్ని చోట్ల అబాస్ పనిజేయడం లేదు. అధ్యాపకుల కొరతతో అల్లాడుతున్న మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ నిబంధనలు మరింత ఇబ్బందికరంగా మారాయి.




రామయ్యా.. వచ్చాడయ్యా!

(మొదటిపేజీ తరువాయి)

స్వామి వారికి పట్టు వస్త్రాలు, వెండి ఛత్రం సమర్పించారు. సరిగ్గా 12 గంటల 29 నిమిషాల 8 సెకన్ల నుంచి 12 గంటల 30 నిమిషాల 32 సెకన్ల వరకూ అంటే 84 సెకన్లపాటు రామయ్య ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. పండితులు మూల మంత్రాలను పఠిస్తుండగా.. తొలుత, విగ్రహం కళ్లకు అచ్ఛాదనగా కట్టిన వస్త్రాన్ని మోదీ తొలగించారు. అనంతరం, బంగారంతో చేసిన చిన్న కడ్డీతో బాల రాముడి కళ్లకు కాటుక దిద్దారు. తర్వాత ఆయనకు అద్దాన్ని చూపించారు. చివరిగా, తొలి మహా హారతిని మోదీ ఇచ్చారు. తామర పువ్వును రాముడి పాదాల వద్ద ఉంచి, సాష్టాంగ నమస్కారం చేశారు. దీనితో ప్రాణ ప్రతిష్ఠ క్రతువు పూర్తయింది. ఆ వెంటనే, ఎడమ చేతిలో విల్లు, కుడి చేతిలో బాణం ధరించిన ఐదు సంవత్సరాల అయోధ్య రాముడు చిరు మందహాసం, ప్రసన్న వదనంతో భక్తులకు దర్శనమిచ్చాడు. పసుపు రంగు పంచె, రాళ్లు పొదిగిన స్వర్ణాభరణాలు, ఎరుపు, పసుపు, వంకాయ రంగు పువ్వులతో కూడిన దండలు ధరించిన రామయ్య నయనానందకరంగా కనిపించాడు. దాంతో, జైశ్రీరాం నినాదాలు అయోధ్యలో మార్మోగాయి. కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీతోపాటు ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ మాత్రమే గర్భ గుడిలో ఆశీనులయ్యారు. తొలుత వారు రాముడిని దర్శించుకున్న తర్వాత అతిథులనూ అనుమతించారు. మంగళవారం నుంచి భక్తులు రాముడిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. దాదాపు ఐదారు అంగుళాల ఎత్తు మాత్రమే ఉన్న రామ్‌లల్లా విగ్రహాలనూ అక్కడే ఉంచారు. కార్యక్రమానికి 11 వేల మందికిపైగా అతిథులకు ఆహ్వానాలు పంపగా.. ఎనిమిది వేల మందికిపైగా ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, సినీ నటులు, క్రీడాకారులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. అయోధ్య మహోత్సవాన్ని బీజేపీ రాజకీయం చేసిందని ఆరోపిస్తూ ప్రతిపక్షంతోపాటు వివిధ పార్టీల నేతలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అనంతరం, అక్కడికి కొద్ది దూరంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు మోదీ సహా ఇతర నేతలు చేరుకున్నారు. అక్కడ అతిథులను ఉద్దేశించి ప్రసంగించారు. 'మన రాముడు తిరిగొచ్చాడు' అని మోదీ అనడంతోనే జైశ్రీరాం నినాదాలు మార్మోగాయి. ఆ తర్వాత కుబేర్ తిల ప్రాంతంలోని శివ లింగానికి మోదీ అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో జటాయు విగ్రహాన్ని ఆవిష్కరించారు. రామ మందిర నిర్మాణంలో పాల్పంచుకున్న కార్మికులను సత్కరిస్తూ గులాబీ రేకులను వారిపై చల్లారు. చివరిగా, 11 రోజులపాటు తాను కొనసాగించిన అనుష్ఠానాన్ని ముగించి.. ఆలయ ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి అందించిన 'చర్నామృత్' ప్రసాదాన్ని స్వీకరించారు.

మంగళ ధ్వనులతో మంత్రముగ్ధం

ప్రాణ ప్రతిష్ఠకు ముందు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన 50 రకాల సంప్రదాయ వాయిద్యాలతో రామచంద్ర ప్రభువుకు 'మంగళ ధ్వనులు' వినిపించారు. అనంతరం స్వరార్చన చేశారు. ఢిల్లీకి చెందిన సంగీత నాటక అకాడమీ సహకారంతో అయోధ్యకు చెందిన ప్రముఖ కవి యతీంద్ర మిశ్రా దీనిని నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఢోలక్, ఫ్లూట్, పంఖవాజ్; ఆంధ్రప్రదేశ్ నుంచి ఘటం; కర్ణాటక నుంచి వీణ; తమిళనాడు నుంచి నాగస్వరం, మృదంగం, తవిల్; పంజాబ్ నుంచి అగ్గోజా; మహారాష్ట్ర నుంచి సుందరి; ఒడిసా నుంచి మర్దల; మధ్యప్రదేశ్ నుంచి సంతూర్; ఛత్తీస్‌గఢ్ నుంచి తంబుర; ఢిల్లీ నుంచి షెహనాయ్; జార్ఖండ్ నుంచి సితార్ తదితర వాయిద్యాలతో మంగళ ధ్వనులు మోగించారు. సోను నిగమ్, అనురాధా పౌడ్వాల్, శంకర్ మహదేవన్ తదితరులు స్వరార్చన చేశారు. అలాగే, అయోధ్య వీధులన్నీ 'రాముడొచ్చాడు', 'అవధ్‌కు రాముడొచ్చాడు' తదితర పాటలతో మార్మోగాయి.





మోదీకి ఆలయ నమూనాను బహూకరిస్తున్న యోగి

వజ్రాలు పొదిగిన ఆభరణాలు

బాలరాముడికి అలంకరించిన ఆభరణాలు మిరుమిట్లు గొలిపాయి. వజ్రాలు, కెంపులు, మరకతాలు పొదిగిన 14 రకాల ఆభరణాలను లఖ్‌నవూకు చెందిన హర్షహైమల్ శ్యామ్‌లాల్ జువెలర్స్ తయారు చేసింది. ఇవి యంత్రాలతో కాకుండా చేతితో చేసినవే కావడం విశేషం. వీటిలో తిలకం, ధనుస్సు, బాణం, కిరీటం, ఐదు పేటల విజయహారాలు, వడ్డాణం, చేతి పట్టీలు, కడియాలు, కాలిమువ్వలు, ముద్రిక ఉన్నాయి.

అమోఘ 'తాళం'.. భక్తి 'సంద్రం'



యూపీలోని అలీగఢ్ నుంచి 400 కిలోల భారీ తాళం అయోధ్యకు చేరింది. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ తాళాన్ని అలీగఢ్‌కు చెందిన సత్యప్రకాశ్ శర్మ, రామ్‌లల్లాకు కానుకగా ఇచ్చారు. సత్యప్రకాశ్, ఆయన భార్య రుక్మిణీ దేవి, కుమారుడు మహేశ్ చంద్ ఈ భారీ తాళాన్ని తయారు చేశారు. అలాగే హైదరాబాద్ నుంచి 1265 కిలోల భారీ లడ్డూ కూడా అయోధ్యకు చేరింది. దీన్ని నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలోని శ్రీరామ్ కేటరర్స్ తయారు చేసింది. అయోధ్య రామయ్యకు తిరుపతి వెంకన్న నోరుతీపి చేశాడు. తిరుమల నుంచి లక్ష లడ్డూలు అయోధ్యకు చేరాయి. వీటిని అక్కడి భక్తులకు అందజేస్తారు. అయోధ్యలో కొండంత దేవుడు కొలువుతీరిన సందర్భంగా సముద్రుడి హృదయమూ భక్తితో ఉప్పొంగింది.

రామ సుందరం



రామభక్తులంతా ఎప్పుడెప్పుడా అని ఆత్రంగా ఎదురుచూసిన బాల రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్విఘ్నంగా, విజయవంతంగా జరిగిపోయింది! ఎడమ చేత బంగారు విల్లు, కుడిచేత బాణం పట్టుకుని.. జీవం ఉట్టిపడే కమలదళాల వంటి కన్నులతో.. ముద్దులు మూటగట్టేలా ఉన్న ఆ చిన్నారి రాముణ్ని చూడ్డానికి భక్తులకు రెండు కళ్లూ సరిపోలేదంటే అతిశయోక్తి కాదు! ఈ ఘట్టం చరిత్రాత్మకమైతే.. బాల రాముడి విగ్రహం ఎంతో అపురూపం. 4.25 అడుగుల ఆ విగ్రహం బరువు 150 నుంచి 200 కిలోల దాకా ఉంటుందని అంచనా. విగ్రహ నిర్మాణానికి వాడిన శిల.. శిల్పనిర్మాణానికి అత్యంత అనువైన కృష్ణశిల. కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా జయపుర హోబ్లీలోని గుజ్జెగౌడనపురలో వ్యవసాయ భూమి నుంచి ఈ శిలను వెలికితీశారు. రామదాసు అనే వ్యక్తి పొలంలో కొంత భాగం పైకి పొడుచుకు వచ్చినట్టుగా ఉండడంతో ఈ రాతిని తొలగించి, భూమిని చదును చేసేందుకు ఆయన ప్రయత్నించారు. తీరా మట్టి తొలగించడం మొదలుపెడితే.. బ్రహ్మాండమైన కృష్ణ శిల బయటపడింది. ఆ నోటా ఈ నోటా పడి ఈ విషయం అయోధ్య ట్రస్టుకు చేరింది. అలా ఈ శిలను విగ్రహ నిర్మాణానికి ఉపయోగించారు.

సర్వాభరణ భూషితుడై..

స్వామి ప్రతిమకు అలంకరించిన కిరీటాన్ని లఖ్‌నవూకు చెందిన హర్‌సహాయ్ మల్ శ్యామ్‌లాల్ జ్యువెలర్స్ వారు తయారు చేశారు. 1.7 కిలోల బంగారంతో చేసిన ఆ కిరీటంలో 75 క్యారెట్ల వజ్రాలను, 135 క్యారెట్ల పచ్చలను, 262 క్యారెట్ల కెంపులను వాడారు. ఆ వజ్రాలు, పచ్చలు, కెంపులన్నీ ఇంటర్నేషనల్ జెమలాజికల్ ఇన్‌స్టిట్యూట్ ధ్రువీకరించినవి. స్వచ్ఛమైనవి. జాగ్రత్తగా గమనిస్తే.. కిరీటం మధ్యలో సూర్యుడి బొమ్మ కనిపిస్తుంది. రాముడు రవికుల తిలకుడని చెప్పడానికి అలా సూర్యుడిని పొందుపరచారు. ఇక.. రాముడికి పెట్టిన తిలకం కూడా బంగారందే. 16 గ్రాముల బంగారాన్ని, 3 క్యారెట్ల వజ్రాన్ని ఈ తిలకం తయారీలో వినియోగించారు. 3 క్యారెట్ల వజ్రం చుట్టూ.. 10 క్యారెట్ల చిన్నచిన్న వజ్రాలను, బర్మా కెంపులను పొందుపరచారు. ఇక బాలరాముడి కుడిచేతి బొటనవేలికి పెట్టిన ఉంగరం బరువు 65 గ్రాములు. మధ్యలో పొదిగిన పెద్ద పచ్చ.. జాంబియన్ ఎమరాల్డ్. ఎడమచేతికి పెట్టిన కెంపుల ఉంగరం బరువు 26 గ్రాములు. అందమైన కంఠసీమకు అలంకరించిన నెక్లెస్ బరువు దాదాపు అరకిలో. స్వామి


5 అయోధ్యకు ఏటా కోట్ల మంది!

రామయ్య దర్శనానికి భారీగా భక్తులు..

స్వర్ణ దేవాలయం, తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయాలను మించి యాత్రికులు..!

భారత పర్యాటక రంగానికి భారీ ఊతం.. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ జెఫరీస్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలో రామ మందిర నిర్మాణం భారతీయుల చిరకాల స్వప్నం. అది ఎట్టకేలకు సాకారమైంది. భవ్యమైన రామాలయం నిర్మితమైంది. అందులో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కూడా వైభవోపేతంగా జరిగింది. విశిష్టమైన ఈ రామాలయం ఆధ్యాత్మికంగానే కాదు.. ఆర్థికంగానూ తీవ్ర ప్రభావం చూపనుంది! అయోధ్య రామాలయం భారత్‌లో సరికొత్త ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుందని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ జెఫరీస్ పేర్కొంది. బాలరాముడిని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తులు అయోధ్యకు తరలి రానున్నారు. నిత్యం 1-1.5 లక్షల మంది భక్తులు ఈ చారిత్రక నగరాన్ని సందర్శించే అవకాశం ఉందని జెఫరీస్ గ్రూప్ అంచనా వేసింది. అయోధ్య ఆలయంతో దేశ పర్యాటక ముఖ చిత్రమే మారిపోనుందని అభిప్రాయపడింది. ఏటా 5 కోట్ల మంది యాత్రికులు అయోధ్యను సందర్శించే అవకాశం ఉందని జెఫరీస్ నివేదిక అంచనా వేసింది. ఇది అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం, తిరుపతిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లే భక్తుల సంఖ్య కంటే ఎక్కువ కావడం గమనార్హం. ప్రస్తుతం అమృత్‌సర్ స్వర్ణ దేవాలయాన్ని ఏటా 3-3.5 కోట్ల మంది, తిరుపతి ఆలయాన్ని 2.5-3 కోట్ల మంది భక్తులు సందర్శిస్తున్నారు. భారత పర్యాటక రంగంలో ఇప్పటికీ మతపరమైన పర్యాటకమే అతిపెద్దదని జెఫరీస్ పేర్కొంది. రూ.85 వేల కోట్లతో అయోధ్య నగరం రూపురేఖలు మార్చేస్తున్నారని తెలిపింది. నగరంలో కొత్త ఎయిర్‌పోర్టు, నవీకరించిన రైల్వేస్టేషన్, మెరుగుపర్చిన రోడ్డు రవాణా వ్యవస్థతోపాటు హోటళ్లు, ఇతర ఆర్థిక కార్యకలాపాలు భారీగా పెరగనున్నట్లు తెలిపింది. మౌలిక సదుపాయాల వృద్ధితో పర్యాటకం మరింత పుంజుకోనుందని వివరించింది. "అయోధ్యలో ఆలయ ప్రారంభోత్సవం తర్వాత యాత్రికుల పెరుగుదలతోపాటు ఆర్థికంగానూ అనేక రంగాలు లాభపడతాయి. ముఖ్యంగా హోటళ్లు, విమానయానం, ఆతిథ్యం, ప్రయాణ అనుబంధ, సిమెంటు రంగాలు ప్రయోజనం పొందనున్నాయి. దేశ పర్యాటక రంగానికి సరికొత్త నమూనాగా మారనుంది. ఈ చారిత్రక నగరం ఇకపై అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా అవతరించనుంది" అని జెఫరీస్ వెల్లడించింది.



నేటి నుంచి అందరికీ రామ్‌లల్లా దర్శనం

దర్శన, హారతి వేళలు వెల్లడించిన ట్రస్ట్

అయోధ్య, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా సోమవారం మధ్యాహ్నం దివ్యమైన ముహూర్తంలో అభిజిత్ లగ్నంలో ప్రాణప్రతిష్ఠ ఉత్సవం కన్నుల పండుగలా జరిగింది. అయితే భద్రతా కారణాల రీత్యా సామాన్య పౌరులను సోమవారం శ్రీరాముడిని దర్శనానికి అనుమతించలేదు. మంగళవారం నుంచి రామ్‌లల్లా దర్శనభాగ్యం అందరికీ కల్పిస్తామని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. అయోధ్యలో బాలరాముడి దర్శనం, హారతి వేళల వివరాలను తమ వెబ్‌సైట్‌లో వెల్లడించింది. ఆ వివరాలు ఇలా..

దర్శన వేళలు : ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు.
మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు.
జాగరణ హారతి: ఉదయం 6.30 గంటలకు
సంధ్యా హారతి : రాత్రి 7.30 గంటలకు.

పాస్‌లు పొందడం ఎలా..?

హారతి లేదా దర్శనంలో పాల్గొనడానికి ప్రజలు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో పాస్‌లు పొందవచ్చు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలనుకుంటే అయోధ్య రామమందిర అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, నచ్చిన స్లాట్‌ను ఎంచుకోవచ్చు. కాగా, ప్రస్తుతానికైతే ఆన్‌లైన్ బుకింగ్స్ నిలిపివేశారు. శ్రీరాముడి దర్శనం చేసుకుని, హారతి తీసుకోవాలనుకునే భక్తులు తప్పనిసరిగా ఆధార్ కార్డు వంటి గుర్తింపు కార్డులు చూపించాల్సి ఉంటుంది.

ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే

బాలరాముడి విగ్రహ రూపశిల్పి అరుణ్ యోగిరాజ్



అయోధ్య, జనవరి 22: ఈ భూమ్మీద తనకంటే అదృష్టవంతుడు మరొకరు ఉండరని బాల రాముడి విగ్రహ రూపశిల్పి అరుణ్ యోగిరాజ్ ఆనందం వ్యక్తం చేశారు. కర్ణాటకలోని మైసూరుకు చెందిన శిల్పి యోగిరాజ్ తయారు చేసిన విగ్రహం అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠాపనకు ఎంపికైంది. విగ్రహంలో రామ్‌లల్లా కమలంపై నిలబడిన ఐదేళ్ల చిన్నారిగా దర్శనమిచ్చాడు. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా యోగిరాజ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఇప్పుడు ఈ భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే. ఆ శ్రీరాముడి ఆశీస్సులు ఎల్లప్పుడూ నాతోనే ఉంటాయి. ఇదంతా తలచుకుంటుంటే కొన్నిసార్లు కలల ప్రపంచంలో ఉన్నానేమో అనిపిస్తుంది" అంటూ అమితానందం వ్యక్తం చేశారు.



ప్రత్యక్ష ప్రసారం వీక్షించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, నడ్డా

న్యూఢిల్లీ, జనవరి 22 : కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర బీజేపీ అగ్రనేతలు అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని దేశ రాజధాని నగరంలో సోమవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. నగరంలోని ఆలయాల్లో ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జేపీ నడ్డా, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా, ఆ పార్టీ నాయకులు నగరంలోని ఝుండేవాలన్ ఆలయంలో, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి తదితర నేతలు లక్ష్మీ నారాయణ్ ఆలయం, బిర్లా మందిరాల్లో పూజలు చేశారు. కాగా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్‌లో 140 దేవాలయాల్లో అయోధ్య వేడుకను ప్రత్యక్ష ప్రసారం చేయగా వేలాది మంది వీక్షించారని ప్రకాశ్ జావడేకర్ పేర్కొన్నారు. అయోధ్య ఆహ్వానాన్ని రాహుల్ తిరస్కరించారని, కానీ.. ఆయన నియోజకవర్గ ప్రజలు మాత్రం ఈ వేడుక ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ఆలయాలకు పోటెత్తారని ఆయన చెప్పారు.



అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ సమయంలోనే కర్నూలు జిల్లా మంత్రాలయంలో 59 అడుగుల ఏకశిల శ్రీరాముడి విగ్రహాన్ని మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సోమవారం ఆవిష్కరించారు. భారీగా తరలివచ్చిన భక్తుల నడుమ పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- మంత్రాలయం



నవ శకానికి శ్రీకారం!



రాముడొచ్చేశాడు.. ఇక టెంట్లో ఉండక్కర్లేదు

కర్తవ్య నిర్వహణే ఘనభారతానికి పునాది

అయోధ్యలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

అయోధ్య, జనవరి 22: అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపన.. నవశకానికి శ్రీకారం చుట్టిందని ప్రధాని మోదీ అన్నారు. పురోగావి ు, ప్రగతిశీల భారతానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. సోమవారమిక్కడ అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ అనంతరం ఆయన సాధు సంతులు, రాజకీయ నేతలు, పారిశ్రావి ుకవేత్తలు, కవులు, కళాకారులు, సినీనటులు, సాహితీవేత్తల సమావేశంలో మాట్లాడారు. 2024 జనవరి 22.. కేలెండర్‌లో ఒకానొక తేదీ మాత్రమే కాదని కొత్త శకానికి ఆరంభంగా పేర్కొన్నారు. రామాలయ ప్రాణప్రతిష్ఠ కేవలం విజయ సందర్భమే కాదు.. వినమ్రతకూ సంకేతమన్నారు. ఇక ఆలయ నిర్మాణ అంశాన్ని మనం అధిగమించాలని సూచించారు. ఈ పవిత్ర క్షణం నుంచి వచ్చే వెయ్యేళ్లకు పటిష్ఠ, భవ్య, ఆధ్యాత్మిక భారతానికి పునాది వేయాలని పిలుపిచ్చారు. 'తరాల ఎదురుతెన్నుల అనంతరం ఇవాళ మన రాముడు వచ్చేశాడు.. ఇక టెంట్లలో ఉండడు.. అద్భుత ఆలయంలో నివసిస్తాడు. ఆలయ నిర్మాణం ప్రజల్లో కొత్త జవసత్వాలు నింపింది. గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ సమయంలో నాలో కలిగిన దివ్య ప్రకంపనలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. వెయ్యేళ్ల తర్వాత కూడా ప్రజలు ఈ తేదీని, ఈ క్షణాలను గుర్తుంచుకుంటారు. శ్రీరాముడి ఆశీర్వాదం వల్లే మనమీ అద్భుత ఘట్టాన్ని చూడగలుగుతున్నాం. దీర్ఘకాలంగా మనమీ నిర్మాణం పూర్తిచేయలేకపోయాం. మన తపస్సులో లోపాలకు శ్రీరాముడికి క్షమాపణలు చెబుతున్నాను. ఆయన కచ్చితంగా మన్నిస్తాడని ఆశిస్తున్నాను. ప్రాణప్రతిష్ఠ వేడుకతో యావత్ ప్రపంచాన్ని సంధానించాం. అయోధ్యలో జరిగినటువంటి ఉత్సవాలు ఇతర దేశాల్లో కూడా జరిగాయి. శ్రీరాముడు భారతీయుల విశ్వాసం. ఈ దేశానికి ఆధారం.. భారత్‌లో నియమ నిబంధనలను ఏర్పాటు చేసిందే ఆయన.. భారతీయ వివేచన, గర్వం.. ఘనత ఆయనే. ఆయన విశ్వవ్యాపకుడు.. ఆయన ప్రాణప్రతిష్ఠ చేస్తున్నామంటే.. దాని ప్రభావం కొన్నేళ్లు కాదు... వందలు, వేల సంవత్సరాలు ఉంటుంది. యుగసంధి రూపకర్తలుగా మన తరం ఎంపిక కావడం సంతోషదాయకమైన యాదృచ్ఛిక సంఘటన. వెయ్యేళ్ల తర్వాత కూడా జాతి నిర్మాణంలో మన కృషిని అప్పటి తరం గుర్తుంచుకుంటుంది' అని తెలిపారు. అంతకుముందు ఆయన అయోధ్యలోని కుబేర్ టీలాలో శివుడికి పూజలు చేశారు. జటాయువు విగ్రహాన్ని ఆవిష్కరించారు.

గుడి కడితే దేశం తగులబడుతుందన్నారు

రామాలయాన్ని గనుక నిర్మిస్తే దేశం తగులబడి పోతుందని కొందరు అప్పట్లో అనేవారు.. అయితే అలాంటి మంటలేవీ పుట్టకపోగా.. మరింత ఉత్తేజాన్ని ఇవ్వడం మనం చూస్తున్నాం. అలాంటివారు భారతీయ ఆధ్యాత్మికత పవిత్రతను అర్థం చేసుకోలేరు. మీ ఆలోచనను మార్చుకోవాలని వారిని కోరుతున్నాను. రామ్‌లల్లా ఆలయ నిర్మాణం.. శాంతి, సహనం, పరస్పర సామరస్యం, సుహృద్భావాలకు చిహ్నం. రాముడు అగ్ని కాదు.. ఇంధనం.. ఆయన వివాదం కాదు.. పరిష్కారం.. రాముడు మనవాడు మాత్రమే కాదు. అందరికీ చెందినవాడు. ఆయన శాశ్వతుడు... అందుకే వెయ్యేళ్ల భారత ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేయడానికి ఇదే సరైన సమయమని చెబుతున్నాను.

గుహుడు, జటాయువే స్ఫూర్తి

న్యూఢిల్లీ, జనవరి 22: "రామాయణంలోని అనేక పాత్రలు మనకు ఎన్నో నేర్పిస్తాయి. వాటి నుంచి స్ఫూర్తి పొంది.. దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జటాయు పక్షి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం వాల్మీకి రామాయణంలోని పలు పాత్రలను ఉదహరిస్తూ ప్రధాని ప్రసంగించారు. మాతృభూమి కోసం దేశ ప్రజలు ఏవిధంగా కృషి చేయాలో ఆయన వివరించారు. ప్రధానంగా రామాయణంలోని శబరి, గుహుడు, ఉడుత, జటాయు పాత్రలను ఆయన ప్రస్తావించారు. మోదీ ఏమన్నారంటే..



ప్రతి క్షణాన్నీ జాతి నిర్మాణానికి అంకితం చేయాలి — మోదీ

శబరి

రామాయణం ప్రకారం.. శబరి గిరిజన యువరాణి. ఆధ్యాత్మిక మార్గం పట్టింది. గురువు కోసం అన్వేషిస్తూ మతంగ మహర్షి ఆశ్రమానికి చేరుకుంది. ఏళ్లు గడిచాయి. మతంగ మహర్షి వృద్ధులైపోయారు. రాముడు ఆశ్రమానికి వస్తాడని చెప్పి ఆయన పరమపదించారు. ఆ తర్వాత అనేక సంవత్సరాలకు రాముడు శబరి ఆశ్రమానికి సీతా లక్ష్మణ సమేతంగా చేరుకున్నాడు. శ్రీరాముని దర్శించుకున్న శబరి పులకించిపోయింది. శబరి భక్తికి ముగ్ధుడైన శ్రీరాముడు ఆమెను ఆశీర్వదించాడు.



స్ఫూర్తి ఇదీ..

శబరి జీవితాన్ని గమనిస్తే ఎనలేని విశ్వాసం జనిస్తుంది. ఎప్పటికైనా రాముడు వస్తాడనే నమ్మకమే ఆమెను సుదీర్ఘకాలం వేచి చూసేలా చేసింది. ఇలాంటి ఎనలేని విశ్వాసమే ప్రతి భారతీయుడిలోనూ పెంపొందాలి. అది సమర్థవంతమైన, ద్రుఢమైన భారత దేశాన్ని నిర్మించేందుకు పునాది వేసేలా చేస్తుంది.

ఉడుత



లంకకు వారధి నిర్మించే క్రమంలో వానర సైన్యం బండరాళ్లతో సముద్రంపై సేతువు నిర్మిస్తోంది. హనుమాన్ సహా ఇతర వానర సైన్యం బండరాళ్లను నీటిపై విసురుతున్నారు. ఇదే సమయంలో ఓ ఉడుత చిన్న చిన్న గులకరాళ్లను తన నోట కరుచుకుని తీసుకువెళ్లి ఆ నీటిలో విసురుతోంది. అయితే, ఉడుత చేస్తున్న పని తనకు అడ్డుగా ఉందంటూ హనుమంతుడు ఆక్షేపిస్తాడు. దీనికి ఉడుత సమాధానమిస్తూ.. వారధి నిర్మాణంలో తన వంతు సాయం చేస్తున్నానని బదులిస్తుంది. ఈ సమాధానం విని వానర సైన్యం పగలబడి నవ్వుతుంది. ఈ సందర్భంలో శ్రీరాముడు జోక్యం చేసుకుని.. "మీరంతా పెద్ద పెద్దరాళ్లు వేస్తున్నారు. దీంతో వాటి మధ్య ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఉడుత చేస్తున్న సాయంతో ఆ ఖాళీలు భర్తీ అవుతున్నాయి. చిన్నవారిని, బలహీనులని ఆక్షేపిస్తూ వారి విజ్ఞానాన్ని, కృషిని అవహేళన చేయకండి" అని చెబుతాడు. అనంతరం, ఉడుతను చేతిలోకి తీసుకుని కృతజ్ఞతగా వీపు నిమురుతాడు. ఉడుత వీపు భాగంలో ఏర్పడిన చారలు రాముడు నిమిరినందునే ఏర్పడినట్టు రామాయణం చెబుతోంది.

స్ఫూర్తి ఏంటంటే

నేను సాధారణ వ్యక్తిని, ఏమీ చేయలేనేమో అనే నిరాశాభావాన్ని విడనాడండి. ఈ దేశం కోసం ఎలాంటి సంకోచాలు లేకుండా మీ వంతు కర్తవ్యంగా చిన్నదైనా, పెద్దదైనా ఏదో ఒకటి ప్రతి ఒక్కరూ చేయండి. అది ఈ దేశాన్ని సమున్నతంగా నిలబెట్టడం ఖాయం. ఈ దేశంలో నిరాశకు తావులేదు.




గుహుడు

గంగా నది ఒడ్డున ఉన్న గిరిజన సామ్రాజ్యం 'నిషద్'కు గుహుడు రాజు. అయోధ్యను వీడిన సీతారామ లక్ష్మణులు నిషద్‌కు చేరుకుని, గంగా నదిని దాటేందుకు ప్రయత్నిస్తారు. ఈ సమయంలో గుహుడు రామునితో స్నేహం చేసి వారిని గంగానదిని దాటిస్తాడు. అప్పుడు ప్రారంభమైన ఈ స్నేహం కడదాకా కొనసాగింది. రాముని తమ్ముడు భరతుడు.. అన్నను వెతుక్కుంటూ నిషద్‌కు వచ్చినప్పుడు.. గుహుడు ఆయనను అనుమానిస్తాడు. రామునికి ప్రమాదం తలపెట్టేందుకే భరతుడు వచ్చాడని భావిస్తాడు. దీంతో భరతుడిని ఎలాగైనా అడ్డుకుంటానని గుహుడు శపథం చేస్తాడు. కానీ, తన అన్నను తిరిగి అయోధ్యకు తీసుకువెళ్లేందుకే భరతుడు వచ్చాడని తెలుసుకున్నాక అదే భరతుడికి సాదర స్వాగతం పలుకుతాడు. 14 ఏళ్ల వనవాసం పూర్తయి.. తిరిగి అయోధ్యకు చేరుకున్నాక కూడా రాముడు గుహుడిని మరిచిపోలేదు.

ఇదీ స్ఫూర్తి

భారతీయుల స్నేహం ఎలా ఉండాలో చెప్పేందుకు రాముడు-గుహుడి ఉదంతమే నిదర్శనం. సమున్నత భారత దేశం సాకారానికి ప్రతీ భారతీయుడూ ఈ స్నేహాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి.

జటాయు



సీతాదేవిని రావణుడు అపహరించుకుని వెళ్తున్న సమయంలో జటాయు పక్షి ఎంతో సాహసోపేతంగా రావణుడిపై పోరాటం చేస్తుంది. తీవ్రస్థాయిలో జరిగిన యుద్ధంలో జటాయు నేలకూలిపోతుంది. అనంతరం, రాముడు సీతమ్మను వెతుకుతూ ఆ దారిలో వచ్చాక రావణుడు అపహరించిన విషయాన్ని ఆయనకు చెప్పి, రాముని చేతుల్లోనే తుదిశ్వాస విడుస్తుంది. నిజానికి రావణుడు చాలా శక్తిమంతుడు. అలాంటి రావణుడిని తాను జయించలేనని తెలుసు. అయినప్పటికీ.. జటాయు రావణుడిని ఎదిరించి, అంకిత భావంతో తుది వరకు పోరాడుతుంది.

స్ఫూర్తి

జటాయు చూపిన కర్తవ్య బావాన్ని ప్రతి ఒక్కరూ పుణికి పుచ్చుకోవడం ద్వారా సమున్నతమైన భారత దేశ పునాదికి నాంది పలుకుతాం. మన జీవితంలోని ప్రతి క్షణాన్ని జాతి నిర్మాణానికి అంకితం చేస్తామని మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం.



మోదీ ఉపవాస దీక్ష విరమణ

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ క్రతువు పూర్తయిన తర్వాత ప్రధాని మోదీ తన 11 రోజుల ఉపవాస దీక్షను ముగించారు. పూజలో ఉపయోగించిన పాలతో చేసిన పానీయం 'చరణామృతం'ను రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు గోవింద్ దేవ్ గిరి మహరాజ్.. మోదీకి ఇచ్చారు. ఈ క్రతువులో దేశ ప్రజల తరపున పాల్గొనడం భగవంతుడు ఇచ్చిన అవకాశమని పేర్కొన్న మోదీ.. ఈ నెల 12న మహారాష్ట్రలోని పంచవటిలో ఉపవాస దీక్ష ప్రారంభించారు. ఈ 11 రోజులు రాముడి జీవితంతో సంబంధం ఉన్న ఆలయాలను సందర్శించారు.

కార్మికులపై మోదీ పూల జల్లు

అయోధ్య రామ మందిర నిర్మాణంలో పాల్గొన్న కార్మికులపై ప్రధాని మోదీ పూల జల్లు కురిపించారు. ఆలయంలో క్రతువు పూర్తయిన తర్వాత మోదీ.. కార్మికుల వద్దకు వెళ్లి అభివాదం చేశారు. అక్కడి గంపలో నుంచి పూలు తీసి కార్మికులపై చల్లారు.

అతిథులకు కానుకలివీ..

అయోధ్యపై పుస్తకం, లోహపు ప్రమిద, తులసిమాల, శ్రీరాముడి పేరు ఉన్న ఉత్తరీయం... ఇవీ అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి హాజరైన అతిథులకు అందించిన కానుకలు! 'అయోధ్య ధామ్- శ్రీరాముడి నిలయం' పేరిట ప్రచురించిన ఈ పుస్తకం కవర్‌పై రామ్ లల్లా పాత విగ్రహాన్ని కూడా ముద్రించారు. ఇంకా నాలుగు లడ్డూలు ఉన్న పెట్టె, జీడిపప్పు, ఎండుద్రాక్ష, రేవడీ స్వీటు, చిప్స్ కూడా అందజేశారు.



సముద్ర గర్భంలో శ్రీరాముడు!

విశాఖపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని విశాఖపట్నంలో లివిన్ ఎడ్వంచర్స్ సంస్థ వినూత్న కార్యక్రమం చేపట్టింది. నేవీలో సబ్ మెరైనర్‌గా పనిచేసి రిటైరై స్కూబా డైవింగ్‌లో శిక్షణ ఇస్తున్న బి.బలరామునాయుడు తన మిత్రులతో కలిసి ప్రత్యేకంగా రూపొందించిన శ్రీరాముడి చిత్రపటాన్ని రుషికొండ సాగర గర్భంలో 22 అడుగుల లోతున సోమవారం ప్రతిష్ఠించారు. భారతీయుల కల నెరవేరిన సంతోషంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

అయోధ్యలో ఇక కర్ఫ్యూలుండవు

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

అయోధ్య, జనవరి 22: అయోధ్య ఇక రామ నామ స్మరణతో మార్మోగుతుందని.. దీపోత్సవ వెలుగులతో విరాజిల్లుతుందని యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ వ్యాఖ్యానించారు. 'ఇక అయోధ్య వీధుల్లో కాల్పుల మోతలు ఉండవు. ఈ ప్రాంతంలో కర్ఫ్యూలు ఉండవు. అయోధ్యలో దీపోత్సవం, రామోత్సవం మాత్రమే ఉంటాయి. వీధులన్నీ నిత్యం జై శ్రీరాం సంకీర్తనతో మారుమోగుతాయి' అని యోగి అన్నారు. అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం యోగి ప్రసంగించారు. రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనతో రామరాజ్యం సాకారమవుతుందని అన్నారు. 1990 నాటి కాల్పుల ఉదంతాన్ని గుర్తుకు తెచ్చేలా యోగీ చేసిన ప్రసంగం చర్చనీయాంశమైంది.

ఐక్యంగా ఉంటే రామరాజ్యం

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

అయోధ్య, జనవరి 22: దేశంలోని ప్రజలంతా వివాదాలకు దూరంగా ఐక్యంగా ఉంటే రామ రాజ్య స్థాపన జరుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. 'ప్రధాని మోదీ ఒంటరిగా తపస్సు చేశారు. ఇప్పుడు మనమంతా ఆ తపస్సును కొనసాగించాలి' అని భాగవత్ వ్యాఖ్యానించారు. 500 ఏళ్ల తర్వాత రాముడు తన ఇంటికి చేరుకున్నారని, ఈ రోజు నిర్వహించిన కార్యక్రమం కొత్త భారత్‌ను ప్రపంచం ముందు ఆవిష్కరించిందని ఆయన అన్నారు. 'అయోధ్యలో నెలకొన్న విబేధాల వల్లనే రామ్ లల్లా ఇక్కడ నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు మనమంతా కొట్టుకోవడం మానేసి ఒకరికొకరంగా కలిసి ఉంటే మళ్లీ రామరాజ్య స్థాపన జరుగుతుంది' అని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ అన్నారు.



చంద్రబాబు, ఎన్వీ రమణ



పవన్ కల్యాణ్



పీటీ ఉష, చిరంజీవి, రామ్‌చరణ్



ముఖేశ్ అంబానీ దంపతులు

తారలు దిగి వచ్చిన వేళ..!

అయోధ్యలో క్రికెటర్లు, పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖుల సందడి



సచిన్, రజనీకాంత్

అయోధ్య, జనవరి 22: అల అయోధ్య పురిలో.. రాములోరి ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో.. బాలీవుడ్, టాలీవుడ్ తారలు సందడి చేశారు. ఈ కార్యక్రమానికి 8 వేల మందికి ఆహ్వానాలు అందగా.. వారిలో సుమారు అయిదొందల మందికి పైగా సినీ ప్రముఖులే..! వీరితోపాటు.. వర్ధమాన, మాజీ క్రీడాకారులు, వ్యాపార దిగ్గజాలు అయోధ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలుగు సినీరంగం నుంచి చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ, కుమారుడు రామ్‌చరణ్‌తేజ్ ప్రత్యేక విమానంలో అయోధ్యకు చేరుకున్నారు. పవన్ కల్యాణ్, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, మోహన్‌బాబు, సుమన్, రజినీకాంత్, బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్, జాకీ ష్రాఫ్, ఆయన కుమారుడు టైగర్‌ష్రాఫ్, కంగనా రనౌత్, మాధురీ దీక్షిత్, విక్కీ కౌశల్-కత్రినా కైఫ్ దంపతులు, ఆయుష్మాన్ ఖురానా, వివేక్ ఒబెరాయ్, రణబీర్ కపూర్, అలియా భట్, అనుపమ్‌ఖేర్, అక్షయ్‌కుమార్, హేమమాలిని-ధర్మేంద్ర దంపతులు, సన్నీదేవోల్, దర్శక నిర్మాతలు సంజయ్‌లీలా భన్సాలీ, రిషబ్‌శెట్టి, అజయ్ దేవ్‌గణ్, రాజ్‌కుమార్ హిరానీ, మహవీర్ జైన్, రోహిత్ శెట్టి, ఆదిపురుష్ చిత్ర నిర్మాత ఓంరౌత్, సుభాష్ గాయ్, గాయకులు శ్రేయా ఘోషల్, అనురాధ పౌడ్వాల్, శంకర్ మహదేవన్, హరిహరన్, సోనూనిగమ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక వ్యాపార దిగ్గజాలు కూడా బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించి పులకించిపోయారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ, ఆయన సతీమని ఈషా, కుమారుడు అనంత్ అంబానీ, రిలయన్స్ టెలికాం అధినేత అనిల్ అంబానీ, గౌతం అదానీ, ఈస్మైట్రిప్ సహ-వ్యవస్థాపకుడు, సీఈవో నిశాంత్ పిట్టి, ఓయోరూమ్స్ వ్యవస్థాపక సీఈవో రితేశ్ అగర్వాల్, మాజీ క్రికెటర్లు సచిన్ తెందూల్కర్ దంపతులు, అనిల్ కూంబ్లే దంపతులు, టీవిండియా మహిళా జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ రాములవారి ప్రాణప్రతిష్ఠ ఘట్టాన్ని తిలకించారు. మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తానికి ప్రాణప్రతిష్ఠ జరగ్గానే.. కంగనా రనౌత్ బిగ్గరగా 'జై శ్రీరామ్' నినాదాలు చేస్తూ ఆకట్టుకున్నారు. 1987లో వీక్షకులను ఆకట్టుకున్న దూరదర్శన్ సీరియల్ రామాయణ్‌లో రాముడి పాత్రను పోషించిన అరుణ్ గోవిల్‌తో అమితాబ్ బచ్చన్ ముచ్చటించడం, రజినీకాంత్‌తో అనుపమ్‌ఖేర్ సెల్ఫీలు, విమానాశ్రయంలో బాలీవుడ్ దిగ్గజాల వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.




మిథాలీ, సైనా నెహ్వాల్

ఏరీ ఆ ప్రముఖులు!



అయోధ్యలో ఉమాభారతి, సాధ్వి రితంభర





అయోధ్య, జనవరి 22: విత్తు నాటినవారికే ఫలాలు లభించకపోవచ్చు! అయోధ్య రామమందిర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అనేక మంది ప్రముఖులు.. సోమవారం అంగరంగ వైభోగంగా జరిగిన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో కనిపించకపోవడమే ఇందుకు ఉదాహరణ. నాడు ఉద్యమాన్ని ముందుండి నడిపించినవారిలో కొందరు ఇప్పుడు జీవించిలేరు. ఉన్న కొద్ది మందిలో కొందరు వయోభారంతో రాలేకపోతే.. కొందరిని 'మీకు వయసైపోయింది, ఆరోగ్యం బాగోలేదు కాబట్టి రావొద్దు' అంటూ ముఖమ్మీదే చెప్పేశారు! అలాంటివారిలో ముఖ్యులు.. రామజన్మభూమి ఉద్యమం అనగానే గుర్తొచ్చే ఎల్‌కే ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషీ. వీరిలో ఆడ్వాణీ వయసు 96 సంవత్సరాలు కాగా.. మురళీ మనోహర్ జోషీ వయసు 90 ఏళ్లు! వీరిద్దరూ ఈ కార్యక్రమానికి రావడం తప్పనిసరి అని పేర్కొంటూనే.. వారి వయసు, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా రావొద్దని విజ్ఞప్తి చేసినట్టు రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సెక్రటరీ చంపత్‌రాయ్ నెలరోజుల క్రితమే ప్రకటించారు. తాను రావొద్దని చెప్పినప్పటికీ.. వస్తానంటూ జోషీ మొండికేశారని, కానీ ఆయనకు మోకాళ్ల సర్జరీ అయినందున, చలికాలం చలిని తట్టుకోలేరు కాబట్టి రావొద్దంటూ పదేపదే విజ్ఞప్తి చేశానని చంపత్‌రాయ్ అప్పట్లో వెల్లడించారు. ఈ విషయం బయటకు రాగానే దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావడంతో వీహెచ్‌పీ, ఆరెస్సెస్ వెళ్లి ఇద్దరినీ ఆహ్వానించిన సంగతి తెలిసిందే. కానీ, సోమవారం వీరిద్దరూ ప్రాణ ప్రతిష్ఠకు రానే లేదు. అలాగే.. ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినవారిలో ప్రమోద్ మహాజన్, అశోక్ సింఘాల్, కల్యాణ్‌సింగ్ చనిపోయారు. సోమవారం జరిగిన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన నాటి ఉద్యమ ప్రముఖుల్లో.. ఉమాభారతి, సాధ్వి రితంభర, వినయ్‌కటియార్ వంటి అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు.

ప్రాణప్రతిష్ఠకు ముస్లింలు

హాజరైన ఏఐఐవో చీఫ్ ఇమామ్ ఉమర్ ఇల్యాసీ.. అన్సారీ కూడా



అయోధ్యలో ఉమర్ ఇల్యాసీ

అయోధ్య, జనవరి 22: ఆలిండియా ఇమామ్ ఆర్గనైజేషన్ (ఏఐఐవో) అధ్యక్షుడు డాక్టర్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇల్యాసీ సోమవారం అయోధ్యకు వచ్చారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్న వేలాది మంది ప్రముఖుల్లో ఆయనా ఒకరు. ఆహ్వానాన్ని అందుకోవడంతోనే సరిపెట్టుకోకుండా.. కార్యక్రమానికి హాజరై హిందూముస్లింల మధ్య సుహృద్భావాన్ని చాటే ప్రయత్నం చేశారాయన. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఇల్యాసీ.. 'ఇది మారుతున్న భారతదేశ నవీన ముఖచిత్రం. మతాలన్నింటిలోకీ అతి పెద్దది మానవత్వం. మాకు దేశమే అన్నింటికన్నా ముందు" అని వ్యాఖ్యానించారు. అలాగే.. బాబ్రీమసీదు కేసులో ముస్లింల తరపున వాదనలు వినిపించిన ఇక్బాల్ అన్సారీ కూడా ఈ వేడుకకు వచ్చారు. వీరిద్దరితోపాటు.. కొంత మంది ముస్లిం కరసేవకులు, ఆరెస్సెస్ మైనారిటీ విభాగమైన ముస్లిం రాష్ట్రీయ మంచ్ కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కత్రీనా కైఫ్, ఆలియా భట్ వంటి ప్రముఖులూ సోమవారం నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక, ఈ వేడుకలకు రాకున్నా.. కశ్మీరీ ముస్లింలు బాల రాముడికి కానుకగా అత్యంత ఖరీదైన, కల్తీ లేని స్వచ్ఛమైన 2 కిలోల కుంకుమపువ్వును కానుకగా పంపించడం విశేషం.



అంతా అయోధ్యే!

రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు

- జై శ్రీరామ్ నినాదాల హోరు.. అన్నదానాలు
- ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ.. పోటెత్తిన భక్తులు
- ఇళ్లలో పిండివంటలు, స్వీట్లు.. సాయంత్రం దీపాలు
- ర్యాలీలు.. బాణాసంచా పేల్చి సంబరాలు
- భద్రాచలంలో రోజంతా ప్రత్యేక కార్యక్రమాలు
- రాజ్‌భవన్‌లో శ్రీరామచంద్రస్వామికి పూజలు
- కీర్తనలు, భజనల్లో పాల్గొన్న గవర్నర్ తమిళిసై
- 500 ఏళ్ల కల సాకారం: వెంకయ్యనాయుడు
- రామనామ స్మరణలో దేశం: కిషన్‌రెడ్డి
- మోదీ కారణజన్ముడు: దత్తాత్రేయ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం హైదరాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు జరిగాయి. ఇళ్లపై శ్రీరాముడి జెండాలు రెపరెపలాడాయి. శోభాయమానంగా తీర్చిదిద్దిన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భజనలు చేశారు. భక్తి గీతాలు ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శోభాయాత్రల్లో జై శ్రీరామ్ నినాదాలు హోరెత్తాయి. ఎక్కడికక్కడ అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. కాషాయ జెండాలు పట్టుకొని ర్యాలీలు నిర్వహించారు. ఇళ్లల్లో పిండి వంటలు, స్వీట్లు చేసుకున్నారు. సాయంత్రం దీపాలు వెలిగించారు. పటాకులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఉత్సవ శోభ మరింత కనిపించింది. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సోమవారం రాజ్‌భవన్‌లో ప్రత్యేకంగా శ్రీరాముడి పూజా కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ తమిళిసై రామనామ కీర్తనలు, భజనలు ఆలపించారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని తమిళిసై టీవీలో తిలకించారు. రామ మందిర నిర్మాణం దేశంలోని హిందువుల చిరాకాల కోరిక అని, బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సంతోషకరమని, ఇందుకు 500 ఏళ్లు ఎదురుచూశామని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు.

స్వర్ణభారతి ట్రస్టు ఆధ్వర్యంలో

ముచ్చింతల్‌లో స్వర్ణభారతి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన రాములోరి కల్యాణోత్సవంలో వెంకయ్య, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మిజోరం గవర్నర్ హరిబాబు పాల్గొన్నారు. దేశమంతా రామ నామస్మరణతో మార్మోగిపోతోందని.. 500 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు, త్యాగలు చేసి మందిరాన్ని నిర్మించుకున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో, జనరల్ బజార్‌లో సికింద్రాబాద్ కట్‌పీస్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, సికింద్రాబాద్ క్లాత్ మార్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠనం, తులసి అర్చనలో.. హైదరాబాద్ నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయంలో, అడిక్‌మెట్‌లోని వీరాంజనేయస్వామి దేవాలయంలో హరియాణ గవర్నర్ దత్తాత్రేయ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం జరగాలనే వందకోట్ల భక్తుల చిరకాల వాంఛను ప్రధాని మోదీ సాకారం చేశారని, ఆయన కారణజన్ముడని ఆయన అన్నారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహిస్తున్న సమయంలో భద్రాద్రి క్షేత్రం రామనామ స్మరణతో మార్మోగింది. అర్చకులు శ్రీ సీతారామ చంద్రస్వామి మూర్తులకు సవర్ణ పుష్పార్చన నిర్వహించారు. శ్రీరామ రథంతో శోభా యాత్ర నిర్వహించారు. రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. సంక్షేప రామాయణ హవనం, సుందరాకాండ పారాయణం నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం జరిగింది. మాజీ ఎంపీ వీహెచ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డిలు రామయ్యను దర్శించుకున్నారు. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో కరసేవకులను సన్మానించారు.



హైదరాబాద్ నిజాం కాలేజి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ తమిళ్‌సై, లక్ష్మణ్ తదితరులు



సదాశివపేటలో సీతారాముల పల్లకీ సేవలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు పులి మామిడిరాజు

చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం

బీజేపీ పోరాట ఫలితమే రామాలయ నిర్మాణం

బీజేపీ రాష్ట్ర నాయకులు పులి మామిడిరాజు

సదాశివపేట, జనవరి 22 : అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం, బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ చరిత్రాత్మక ఘట్టమని బీజేపీ రాష్ట్ర నాయకులు, సంగారెడ్డి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్, పీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పులి మామిడి రాజు అన్నారు. అయోధ్య శ్రీరామ మందిర ప్రారంభోత్సవం, బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో నిర్వహించిన శ్రీరామ ర్యాలీ, శ్రీరామ దీపావళి, సీతారాముల పల్లకీ సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ పోరాట ఫలితమే అయోధ్య రామ మందిర నిర్మాణం అన్నారు. కోట్లాది మంది భారతీయుల కలను ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ సాకారం చేసి చూపారన్నారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠకు కర్తగా ప్రధాని మోదీ వ్యవహరించడంతో చరిత్రాత్మక, అపూర్వఘట్టం ఆవిష్కృతమైందన్నారు. 500 ఏళ్ల హిందువుల కల నేటితో నెరవేరిందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల తరపున ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రాణ ప్రతిష్ఠ సమయానికి కాన్పులు

ఫిరోజాబాద్, బెంగళూరు, ముంబయి, జనవరి 22 : అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ సమయానికి దేశ వ్యాప్తంగా పలువురు గర్భిణులు బిడ్డలకు జన్మనివ్వడం విశేషం. ఫిరోజాబాద్ పట్టణంలో సోమవారం అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ నాడు ఓ ముస్లిం మహిళకు మగ బిడ్డ జన్మించగా రామ్ రహీం అని పేరు పెట్టి హిందూ ముస్లిం ఐక్యత చాటారు. దేశంలో పలు ప్రాంతాల్లో అనేక మంది దంపతులు వైద్యులను సంప్రదించి అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ సమయానికే బిడ్డలకు జన్మనివ్వడం విశేషం. పలువురు తమ మగబిడ్డలకు రామ్ అని, ఆడబిడ్డలకు సీత అని పేర్లు పెట్టారు. కర్ణాటక విజయపురలోని జేఎస్ఎస్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం 20 మందికి కాన్పులు చేశారు.

అయోధ్యలో జీవీపీఆర్ చైర్మన్ వీరారెడ్డి



అయోధ్యలో జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ వీరారెడ్డి, వి జయలక్ష్మి దంపతులు, వారి తనయుడు, సంస్థ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కోడలు ప్రియాంకరెడ్డి పాల్గొన్నారు. శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ఆహ్వానం మేరకు కుటుంబ సమేతంగా వారు ఈ మహత్తర ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ తరఫున అయోధ్య రామాలయ నిర్మాణం కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రకు రూ.1.29 కోట్లు విరాళంగా అందజేశారు. ధార్మిక కార్యక్రమాలకు సంస్థ తరఫున విరాళాలు అందజేస్తుంటామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు.

శ్రీరాముడు మతానికి అతీతుడు..

మన విశ్వాసాలు ఏవైనా.. గౌరవం, విలువలతో జీవించడానికి అంకితమైన మహోన్నత వ్యక్తి శ్రీరాముడు.. ఆయన మతానికి అతీతుడు.. ఆయన బాణాలు చెడు, అన్యాయాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. 'రామరాజ్యం' అనే ఆదర్శ పాలన భావనే నేడు సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్ష. ఇప్పుడు 'రామ్' అనే పదం ప్రపంచానికి చెందింది..

\- ఆనంద్ మహీంద్ర (ప్రముఖ వ్యాపారవేత్త)

అయోధ్య మందిరం మతసామరస్యానికి ప్రతీక

అయోధ్య రామమందిరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. పవిత్రమైన ఈరోజున తెరుచుకుంటున్న మందిర తలుపులు జ్ఞానోదయం, శాంతికి ప్రవేశ ద్వారంగా ఉండాలి. తద్వారా భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సామరస్యం ఈ సమాజాన్ని కాలతీత బంధంతో ఏకం చేయాలని కాంక్షిద్దాం..

\- గౌతమ్ అదానీ (ప్రముఖ వ్యాపారవేత్త)

ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీక..

చరిత్ర ప్రతిధ్వనులు, విశ్వాసం, పవిత్రత మధ్య అయోధ్య రామాలయాన్ని గొప్పగా ప్రారంభించడం ఐక్యత, ఆధ్యాత్మికతకు చిహ్నాన్ని తెలియజేస్తుంది. ఇటువంటి చరిత్రకు సాక్షిగా నిలిచినందుకు ఎంతో గర్వంగా ఉంది. - మహేశ్ బాబు (సినీ నటుడు)

రామలక్ష్మణుల్లా వారు ఆలయాన్ని నిర్మించారు.. ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు అభినందనలు.. వారిద్దరూ రామలక్ష్మణుల మాదిరిగా కష్టపడి రామాలయాన్ని నిర్మించారు. ఆ భగవంతుడే వారికి సహకరించారు.

\- సుమన్ (సినీ నటుడు)

ఈ అనుభూతి వర్ణించలేనిది..

అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ వేడుకను చూసి నా కళ్లలో ఆనంద బాష్పాలు వచ్చాయి. చాలా సంతోషంగా ఉన్నా.. ఈ అనుభూతి మరువలేనిది.. వర్ణించలేనిది.

\- హరిహరన్ (సినీ గాయకుడు)

ఆంజనేయస్వామి ఆహ్వానించినట్లుగా ఉంది..

నా ఇష్ట దైవం ఆంజనేయ స్వామి స్వయంగా ఈ వేడుకకు ఆహ్వానించినంత సంతోషంగా ఉంది. ఇది అరుదైన అవకాశం. ఈ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. శ్రీరాముడి దివ్య ఆశీర్వచనాలు దొరకడం ఆనందంగా ఉంది.

\- చిరంజీవి (సినీ నటుడు)

500 ఏళ్ల కళ సాకారమైంది..

ఇదో అద్భుత ఘట్టం. 500 ఏళ్ల తర్వాత మళ్లీ అదే స్థానంలో రామ మందిరం రూపుదిద్దుకోవడం శుభ పరిణామం. సహజంగానే ఇది దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక వేడుకలకు కారణభూతమవుతుంది. ఆలయానికి అనుకూలంగా తీర్పు వచ్చిన ఐదేళ్ల తర్వాత దేశమంతా అట్టహాసంగా వేడుకలు జరగడం మంచి విషయం.

\- శ్రీ శ్రీ రవిశంకర్ (ఆధ్యాత్మిక వేత్త)

ఆధునిక భారత ముఖ చిత్రం..

ఇది ఆధునిక భారత ముఖ చిత్రం. మానవత్వమే మనకు అతి పెద్ద మతం. దేశాన్ని ప్రేమించడమే మనందరి ప్రథమ కర్తవ్యం. మా(ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్) ఆగమనం దేశవ్యాప్తంగా ఉన్న 3 లక్షల మసీదుల్లోని 5 లక్షల మంది ఇమామ్‌ల రాకకు ప్రతీక.

\- ఉమర్ అహ్మద్ ఇలియాస్ (ఏఐఐఓ చీఫ్ ఇమామ్)

చిరకాల కోరిక నెరవేరింది

అయోధ్యలో రామమందిర నిర్మాణం దేశంలోని హిందువుల చిరకాల కోరిక. నేడు అది నెరవేరింది. ఇందు కోసం 500 ఏళ్లు వేచి చూశాం. బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సంతోషకరం. దేశవ్యాప్తంగా ప్రతీ ఊరు శ్రీరామనామ స్మరణతో మారుమోగిపోతోంది. మళ్లీ రామరాజ్యం రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రీరాముడి నామాన్ని జపిస్తున్నారు.

\- వెంకయ్యనాయుడు (మాజీ ఉప రాష్ట్రపతి)

కలహాలను వీడి.. కలిసి ఉండాలి

కలహాల వల్లే రాముడు అయోధ్యను వీడి వెళ్లాడు. 500 ఏళ్ల తర్వాత నేడు తిరిగి అయోధ్యకు వచ్చాడు. దీంతో దేశంలో రామ రాజ్యం ఆవిష్కృతమైంది. ఇకపై మనమంతా కలహాలను వీడి కలిసి ఉండాలి. అయోధ్యలో రాముడి రాకతో భారత్‌కు పూర్వ వైభవం వచ్చింది.

\- మోహన్ భాగవత్ (ఆర్ఎస్ఎస్ చీఫ్)

మేం గాంధీజీ చెప్పిన శ్రీరాముడిని పూజిస్తాం

జాతిపిత మహాత్మా గాంధీజీ చెప్పిన శ్రీరామచంద్రుడిని కాంగ్రెస్ నేతలంతా భక్తితో పూజిస్తారు. రామ మందిరం అంశాన్ని రాజకీయం చేయరాదు. శ్రీరామచంద్రుడు అందరి దేవుడని, శ్రీరాముడిపై తమకు మాత్రమే పేటెంట్ హక్కులు ఉన్నట్లుగా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారు. దేశంలోని హిందువులంతా శ్రీరామచంద్రుడిని పూజిస్తారు. రాజకీయాలు, ఆధ్యాత్మికత వేర్వేరు.

\- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య



సర్వమత ర్యాలీలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

అయోధ్య వేళ.. ప్రతిపక్ష నేతలు ఎవరెక్కడ?

- భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ గాంధీ
- కోల్‌కతాలో సర్వ మత ర్యాలీలో మమతా బెనర్జీ
- ప్రాణప్రతిష్ఠకు పవార్, అఖిలేశ్‌యాదవ్ దూరం
- ఢిల్లీలో సుందరాకాండ పారాయణంలో ఆప్ శ్రేణులు
- నాసిక్ కాలారామ్ ఆలయంలో ఉద్ధవ్ పూజలు

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రధాని మోదీ సహా పలువురు రాజకీయ, వ్యాపార, సినీ, క్రీడా ప్రముఖులు హాజరైన అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ వేళ కీలక ప్రతిపక్ష నేతలు ఎక్కడున్నారు..? అత్యంత వైభవోపేతంగా సాగిన ఆలయ వేడుకకు గైర్హాజరైన వీరు ఏం చేశారు? ఈ కార్యక్రమాన్ని బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు చెందినదిగా అభివర్ణించిన వీరంతా ఏం చేశారు? అనేది పరిశీలిస్తే.. భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉన్న కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ అసోంలోని బతద్రవ సత్ర ఆలయాన్ని సందర్శించే ప్రయత్నం చేశారు. దీనికి ఆలయ యంత్రాంగం అంగీకరించలేదు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతా కాళీ ఘాట్ ఆలయంలో పూజల అనంతరం సర్వమత ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. రామ మందిర ప్రారంభాన్ని బీజేపీ ఎన్నికల గిమ్మిక్కుగా అభివర్ణించారు. తమ పార్టీ నుంచి అయోధ్యకు ఎవరినీ పంపలేదని తెలిపారు. ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ అయోధ్యకు వెళ్లలేదు. కుటుంబంతో కలిసి తర్వాత సందర్శిస్తానని చెప్పారు. మందిర ప్రారంభానికి ఆహ్వానం అందిన సమాజ్‌వాదీ పార్టీ అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ సోమవారం సోషలిస్ట్ నేత జ్ఞానేశ్వర్ మిశ్రాకు నివాళి అర్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు. కొద్ది రోజుల తర్వాత కుటుంబంతో కలిసి వెళ్తానని చెప్పారు. కాగా, ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో అధికార ఆప్ శ్రేణులు శోభా యాత్రలు, హారతులు, సుందరాకాండ పారాయణంలో పాల్గొన్నాయి. ఆప్ అధినేత, సీఎం కేజ్రీవాల్ ఆదివారం రామ్‌లీలా ఉత్సవంలో పాల్గొన్నారు. సోమవారంతో ఇవి ముగిశాయి. తనకు అధికారిక ఆహ్వానం లేదని.. కుటుంబంతో కలిసి త్వరలో అయోధ్య వెళ్తానని కేజ్రీ ఇప్పటికే తెలిపారు. మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాక్రే నాసిక్‌లోని కాలారామ్ ఆలయంలో పూజలు చేశారు. గోదావరి ఒడ్డున మహా హారతిలో పాల్గొన్నారు.

రాహుల్ జోడోయాత్రకు బ్రేకులు

- అసోంలో బతద్రవ సత్ర ఆలయ దర్శనానికి రాహుల్‌కు అనుమతి నిరాకరణ
- పార్టీ శ్రేణులతో కలసి రాహుల్ ధర్నా

న్యూఢిల్లీ, జనవరి 22: భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా అసోంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆటంకాలు ఎదురయ్యాయి. సోమవారం ఉదయం బతద్రవ సత్ర ఆలయ సందర్శనకు వెళ్తున్న రాహుల్‌ను అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత కొన్ని గంటలకే మోరిగావ్ జిల్లాలో రాహుల్ పాదయాత్రను, వీధి సమావేశాన్ని నిలిపివేయాలని ఆ జిల్లా యంత్రాంగం సూచించింది. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు దుండగులు ప్రయత్నించే అవకాశమున్నందున అనుమతి నిరాకరిస్తున్నట్లు పేర్కొంది. 'ఒకే రోజు రెండు ప్రధాన కార్యక్రమాలు.. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ, భారత్ జోడో న్యాయ్ యాత్ర జరుగుతున్నాయి. దీన్ని అదనుగా తీసుకుని సంఘ విద్రోహశక్తులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశముందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. శాంతి భద్రతలను కాపాడటంతో పాటు జెడ్ ప్లస్ సెక్యూరిటీలో ఉన్న రాహుల్‌ను దృష్టిలో ఉంచుకుని.. బిహుతోలి వద్ద కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహించవద్దని కోరుతున్నాం. అలాగే మోరిగావ్ పట్టణంలో శ్రీమంత శంకర్‌దేవ చౌక్ నుంచి పాదయాత్రను నిలిపివేయాలని అభ్యర్థిస్తున్నాం' అని కాంగ్రెస్ పార్టీకి మోరిగావ్ జిల్లా కమిషనర్ లేఖ రాశారు. అంతకుముందు బతద్రవ సత్ర ఆలయానికి వెళ్లకుండా తనను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులతో కలసి రాహుల్ ధర్నా చేశారు. ప్రధాని మోదీ, అసోం సర్కారుపై మండిపడ్డారు. 'నేను ఆలయ దర్శనానికి వెళ్తున్నాను. సమస్యలు సృష్టించడానికి రాలేదు. నేనేం నేరం చేశానని అడ్డుకున్నారు? ఆలయాన్ని ఎవరెవరు సందర్శించాలన్నది మోదీ నిర్ణయిస్తున్నారు' అని మండిపడ్డారు. కాగా సోమవారం అయోధ్యలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటలకు వరకు ఆలయ సందర్శనకు రాహుల్‌ను అనుమతించబోమని మేనేజింగ్ కమిటీ ఆదివారం ప్రకటించింది. ఆ తర్వాత దర్శించుకోవచ్చునని సూచించింది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కూడా రాహుల్‌కు ఇదే విషయం సూచించారు.



అసోంలోని బతద్రవ ఆలయంలోకి వెళ్లనీయకపోవడంతో అక్కడే బైఠాయించిన రాహుల్‌గాంధీ

మణిపూర్ చేరుకున్న కేంద్ర బృందం

మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక ఘటనల నేపథ్యంలో పరిస్థితి అంచనాకు కేంద్ర హోం శాఖ సలహాదారు, నాగా శాంతి చర్చల దూత ఎ.కె.మిశ్ర, ఢిల్లీలోని ఎస్ఐబీ జాయింట్ డైరెక్టర్ మన్‌దీప్ సింగ్ టులి, ఇంఫాల్‌లోని ఎస్ఐబీ జాయింట్ డైరెక్టర్ రాజేష్ కుంబ్లేలతో కూడిన కేంద్ర బృందం ఇంఫాల్ చేరుకుంది. ఈ బృందం తొలుత మెయిటీ సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ అయిన అరంబాయ్ టాంగోల్‌తో సమావేశమయింది. మిగిలిన జాతుల ప్రతినిధులతోనూ భేటీ కానుంది.

జ్ఞానవాపీ, షాహీ ఈద్గానూ

హిందువులకు అప్పగించాలి

- సమస్యకు అదే పరిష్కారం.. ముస్లిం పురావస్తు నిపుణుడు మొహమ్మద్
- బాబ్రీ మసీదు వద్ద తవ్వకాలు జరిపి మందిరం ఉనికిని చెప్పింది ఆయనే

న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో సీనియర్ పురావస్తు శాస్త్రవేత్త కె.కె.మొహమ్మద్ ఆసక్తికర సూచన చేశారు. వివాదాస్పద జ్ఞానవాపీ మసీదు (కాశీ), షాహీ ఈద్గా మసీదు (మథుర)లను హిందువులకు అప్పగించాలని కోరారు. భారత పురావస్తు సర్వే విభాగం(ఏఎస్ఐ) రీజనల్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన ఆయన బాబ్రీ మసీదు వద్ద తవ్వకాల్లో కీలక పాత్ర పోషించారు. మందిరం ఉండేదనడానికి అక్కడ చాలా ఆధారాలు లభించాయని, మందిరాన్ని కూలగొట్టి మసీదును నిర్మించారన్న వాదనను సమర్థించారు. అయోధ్య, మథుర, వారణాసి క్షేత్రాలు హిందువులకు పరమ పవిత్రమైనవని, అక్కడి మసీదులపై ముస్లింలకు ఎలాంటి సెంటిమెంట్లు లేవని తెలిపారు. అన్ని మతాల పెద్దలు కూర్చొని వీటిని హిందువులకు అప్పగించే విషయమై చర్చలు జరపాలని కోరారు. బాబ్రీ మసీదు వద్ద జరిగిన తవ్వకాల్లో మొహమ్మద్‌కు ప్రముఖ పాత్ర ఉంది. 1976లోనే ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ బి.బి.లాల్ ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాల్లో ఆయన పాలుపంచుకున్నారు.

కోటి ఇళ్లపై సౌర ఫలకాలు

- 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన' పథకం ప్రారంభం
- అయోధ్య నుంచి ఢిల్లీ వచ్చిన వెంటనే మోదీ ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 22: అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నుంచి ఢిల్లీకి తిరిగి వచ్చిన వెంటనే ప్రధాని మోదీ కీలక ప్రకటన చేశారు. దేశంలోని కోటి ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసేందుకు "ప్రధానమంత్రి సూర్యోదయ యోజన" పేరిట కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ఎక్స్‌లో వెల్లడించారు. ఇది పేదలు, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంతో పాటు, విద్యుత్ ఉత్పత్తిలో దేశాన్ని స్వావలంబన దిశగా నిలబెట్టేందుకు తోడ్పడుతుందని చెప్పారు. ఈ పథకానికి సూర్యవంశానికి చెందిన రాముడే స్ఫూర్తి అని ప్రకటించారు. రాముడు ఒక శక్తి అని, ఆయన ప్రతి ప్రశ్నకు జవాబు అని, ఆయన ప్రతి ఒక్కరి దేవుడని పేర్కొన్నారు. సూర్యవంశానికి చెందిన రాముడి నుంచి ఆయన్ను పూజించే భక్తులకు శక్తి లభిస్తుందని పేర్కొన్నారు. కాగా, మోదీ అయోధ్య నుంచి వచ్చిన తర్వాత ఢిల్లీలోని తన ఇంటిని దీపాలతో అలంకరించి వేడుక చేసుకున్నారు.

సోనీ-జీ బ్రేకప్

రూ.83,000 కోట్ల విలువైన విలీన ఒప్పందం రద్దు
రూ.747 కోట్లు చెల్లించాలని 'జీ'కి నోటీస్ పంపిన సోనీ

న్యూఢిల్లీ: భారత మీడియా, వినోదం రంగంలో రెండేళ్ల క్రితం కుదిరిన మెగా విలీన ఒప్పందం రద్దయింది. భారత్‌కు చెందిన జీ గ్రూప్‌తో జపాన్‌కు చెందిన సోనీ గ్రూప్ కార్పొరేషన్ తెగదెంపులు చేసుకుంది. జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కుదుర్చుకున్న 1,000 కోట్ల డాలర్ల (రూ.83,000 కోట్లు) విలువైన విలీన ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు సోనీ గ్రూప్ భారత అనుబంధ విభాగమైన సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ప్రస్తుతం కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్) సోమవారం ప్రకటించింది. డీల్ రద్దు నోటీసును జీ గ్రూప్‌నకు పంపిన సోనీ.. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు మధ్యవర్తిత్వం కోరిన నేపథ్యంలో బ్రేకప్ ఫీజు కింద 9 కోట్ల డాలర్లు (రూ.747 కోట్లు) చెల్లించాలని డిమాండ్ చేసింది. విలీనం తర్వాత ఏర్పడే సంస్థకు ఎవరు నేతృత్వం వహించాలన్న విషయంపై ప్రతిష్టంభన తొలగకపోవడంతో సోనీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

ఇరు వర్గాలకూ కీలక ఒప్పందం: భారత్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మీడియా రంగంలో పోటీని తట్టుకునేందుకు ఈ విలీన ఒప్పందం ఇరు కంపెనీలకూ కీలకమే. ఎందుకంటే, 70కి పైగా టీవీ చానెళ్లు, 2 వీడియో స్ట్రీమింగ్ సేవల వేదికలు (జీ5, సోనీ లివ్), రెండు ఫిల్మ్ స్టూడియోల (జీ స్టూడియో, సోనీ పిక్చర్స్ ఫిల్మ్స్ ఇండియా)తో విలీన కంపెనీ దేశంలోనే అతిపెద్ద ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్‌గా అవతరించి ఉండేది. అంతేకాదు, తమ ప్రధాన ప్రత్యర్థులైన స్టార్, డిస్నీ నెట్‌వర్క్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునేందుకు, సోనీ అనుబంధ సంస్థ ఎస్‌పీఎన్ఐకి భారత్‌లో వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడి ఉండేది.

సోనీ వాదనలను ఖండించిన జీ: డీల్ రద్దుకు సంబంధించి సోనీ గ్రూప్ వాదనలను ఖండించిన జీ.. చట్టపరంగా పరిష్కారాలను అన్వేషిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. ఈ నేపథ్యంలో తమ సంబంధిత వర్గాల ప్రయోజనాలను రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తన ప్రకటనలో పేర్కొంది. విలీనాన్ని పూర్తి చేసేందుకు అగ్రిమెంట్‌కు లోబడి అన్ని చర్యలు చేపట్టామని జీ అంటోంది.

రూ.366 కోట్లు వెచ్చించాం: ఈ డీల్ కోసం ఇప్పటివరకు రూ.366.6 కోట్లు వెచ్చించామని జీ గ్రూప్ అంటోంది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ.176.20 కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రథమార్థంలో మరో రూ.190.39 ఖర్చు చేశామని అంటోంది.

గోయెంకా సారథ్యం ఇష్టంలేకే..

2021 డిసెంబరు 22న కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎండీ, సీఈఓ పునీత్ గోయెంకానే విలీన సంస్థకూ సారథ్యం వహించాల్సింది. కానీ, ఆ తర్వాత అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. అధికార దుర్వినియోగానికి పాల్పడటంతో పాటు స్వప్రయోజనాల కోసం కంపెనీ నిధులు దారి మళ్లించారన్న ఆరోపణలపై జీ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర గోయెంకా, ఆయన కుమారుడు పునీత్ గోయెంకాపై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ వేటు వేసింది. ఏ లిస్టెడ్ కంపెనీలోనూ డైరెక్టర్ లేదా మేనేజ్‌మెంట్‌లో కీలక పదవి చేపట్టకుండా ఇద్దరిపై ఏడాదిపాటు నిషేధం విధించింది. వీరిపై సెబీ దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో విలీన కంపెనీకి పునీత్ గోయెంకా సారథ్యాన్ని సోనీ నిరాకరించింది. అయితే, ఈ విషయంలో జీ వెనక్కి తగ్గకపోవడమే డీల్ రద్దుకు ప్రధాన కారణమైంది. ఒప్పందం ప్రకారం విలీనాన్ని రెండేళ్లలో (2023 డిసెంబరు 21 నాటికి) పూర్తి చేయాల్సింది. గడువు ముగియడంతో సోనీ మరో నెల రోజుల (2024 జనవరి 21 వరకు) గడువును పొడిగించింది. డెడ్‌లైన్ నాటికి విలీనానికి పరిస్థితులు ఏమాత్రం సంతృప్తికరంగా లేకపోవడం తీవ్రంగా నిరాశ కలిగించిందని సోనీ పేర్కొంది.

స్పందన స్ఫూర్తి లాభంలో 79% వృద్ధి

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.127 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 79 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం 75 శాతం పెరిగి రూ.657 కోట్లకు చేరింది. నికర మొండి బకాయిల భారం 2.52 శాతం నుంచి 0.48 శాతానికి తగ్గింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	536	విజయవాడ	555
23 జనవరి		విశాఖపట్నం	563
చిత్తూరు	563	వరంగల్	538
గోదావరి	555	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	87	గోదావరి	96
వరంగల్	87	విజయవాడ	96
కరీంనగర్	87	గుంటూరు	97
మహబూబ్‌నగర్	87	ఒంగోలు	97
కర్నూలు	87	చిత్తూరు	93
విశాఖపట్నం	96		

32% పెరిగిన సిప్లా లాభం

న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం సిప్లా.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,056 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.801 కోట్లు)తో పోల్చితే లాభం 32 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.5,810 కోట్ల నుంచి రూ.6,604 కోట్లకు పెరిగిందని సిప్లా ఎండీ, గ్లోబల్ సీఈఓ ఉమాంగ్ వోహ్రా వెల్లడించారు. అన్ని విభాగాల్లో మంచి పనితీరు కనబరచటంతో భారత వ్యాపారం 12 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఆయన పేర్కొన్నారు. అలాగే అమెరికా వ్యాపారం కూడా సానుకూలంగా ఉండటంతో 23 కోట్ల డాలర్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు చెప్పారు.

కేవీబీ లాభం రూ.412 కోట్లు

చెన్నై: తమిళనాడు కేంద్రంగా పనిచేసే కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి బ్యాంక్ రూ.412 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఇది 42.56 శాతం ఎక్కువ. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.2,012.71 కోట్ల నుంచి రూ.2,497.17 కోట్లకు పెరిగింది. మరోవైపు బ్యాంక్ మొత్తం వ్యాపారం 14.74 శాతం వృద్ధి చెంది రూ.1,58,357 కోట్లకు చేరుకుంది. కాగా ఈ కాలంలో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.7 శాతం నుంచి 1.58 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు 0.9 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ పేర్కొంది.

టెక్ కొలువులపైనే జెన్-జెడ్ విద్యార్థుల ఆసక్తి

ఐటీ ఉద్యోగుల్లో 90% వారే
గిగ్ వర్కర్ల వైపే కంపెనీల మొగ్గు
నాస్కామ్-ఇన్‌డీడ్ సర్వే

న్యూఢిల్లీ: ఐటీ, టెక్నాలజీ కొలువులపై నవ యువతలో ఆసక్తి కొనసాగుతోంది. ఎన్ని ఆటుపోట్లు ఉన్నా.. ఐటీ కొలువులే సో బెటర్ అంటున్నారు. నాస్కామ్-ఇన్‌డీడ్ సంయుక్తంగా జరిపిన ఒక సర్వేలోనూ ఇదే విషయం తేలింది. 1990వ దశకం చివరి నుంచి 2010వ దశకం ప్రారంభంలో జన్మించిన (జెనరేషన్ జెడ్) విద్యార్థుల్లో 77 శాతం మంది.. మాకు వేరే జాబ్స్ వద్దు, ఐటీ జాబే బెటర్ అని సెలవిచ్చారు. దీనికి తగ్గట్టే ప్రస్తుత భారత ఐటీ, టెక్నాలజీ కంపెనీల ఉద్యోగుల్లో దాదాపు 90 శాతం మంది జెనరేషన్ జెడ్, మిల్లీనియల్స్‌గా పేరొందిన 1980-1996 మధ్య కాలంలో జన్మించిన వారే ఉండడం విశేషం. మొత్తం 185 కంపెనీలకు చెందిన 2,500 మందికి పైగా ఉద్యోగుల అభిప్రాయాలను క్రోడీకరించి నాస్కామ్-ఇన్‌డీడ్ ఈ సర్వే విడుదల చేశాయి.

ఎంపికలో జాగ్రత్తలు

ఐటీ, టెక్నాలజీ ఉద్యోగాల మీద ఆసక్తి ఉన్నా విద్యార్థులు, యువకులు.. ఏ కంపెనీలో పడితే ఆ కంపెనీల్లో చేరడం లేదు. మంచి ప్యాకేజీతో పాటు ఉద్యోగంలో పైకి ఎదిగేందుకు,కొత్త నైపుణ్యాలు నేర్చుకునేందుకు ఉన్న అవకాశాలు, ఆయా కంపెనీల పని కల్చర్, నైతిక విలువలు వంటి విషయాలు చూసి మరీ కంపెనీలను ఎంచుకుంటున్నారు. కంపెనీలు కూడా దీనికి తగ్గట్టే కొత్త ఉద్యోగులకు మంచి శిక్షణతో పాటు జాబ్‌కు తగ్గట్టు ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి మరీ వారిని తీర్చిదిద్దుతున్నాయి.

'గిగ్' ఉద్యోగులపైనే ఆసక్తి

ఐటీ కొలువుల నియామక ప్రక్రియలోనూ మార్పు కనిపిస్తోందని సర్వే వెల్లడించింది. కంపెనీలు ఇదివరకటిలా పర్మినెంట్ ఉద్యోగులను తీసుకోవడం లేదు. తమ ప్రాజెక్టుల అవసరాలకు తగ్గ ప్రత్యేక నైపుణ్యాలు ఉన్న గిగ్ (తాత్కాలిక) ఉద్యోగుల నియామకాలకే మొగ్గు చూపుతున్నాయి. జీతాలు కొద్దిగా ఎక్కువైనా ప్రాజెక్టు పూర్తయిన తర్వాత వీరిని ఉద్యోగాల్లో కొనసాగించాల్సి అవసరం ఉండదు. అదే పర్మినెంట్ ఉద్యోగులను తీసుకుంటే కొత్త ప్రాజెక్టులు రాకపోయినా వారికి జీతభత్యాల ఖర్చులు తప్పవు. దీంతో సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో 84 శాతం కంపెనీలు గిగ్ వర్కర్లకే ఓటేశాయి. ప్రస్తుతం అమెరికా, ఈయూ దేశాల కంపెనీల్లో గిగ్ వర్కర్ల సంఖ్యే ఎక్కువ. ఇదే ట్రెండ్ మన దేశంలోనూ ముఖ్యంగా స్టార్టప్, బీపీఎం కంపెనీల్లో ప్రారంభమైందని భావిస్తున్నారు.

బ్యాంక్, ఫైనాన్స్ షేర్లపై కన్నేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మరింత డౌన్‌ట్రెండ్‌లో సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలక మద్దతు, నిరోధ స్థాయిల్లో సూచీలకు గట్టి పరీక్ష ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మార్కెట్లో బేరిష్‌నెస్ ఉండటమే ఇందుకు కారణం. సూచీలు ఇప్పటికీ గరిష్ఠ స్థాయిల్లోనే ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడుతున్నారు. అయితే ఆకర్షణీయ ధరల్లో లభించే బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లను కొనుగోలు (అక్యుములేట్) చేసుకోవటం ఉత్తమం.

స్టాక్ రికమండేషన్స్

ఫినోలెక్స్ కేబుల్స్: గత ఏడాది డిసెంబరు రెండో వారంలో కుదుపునకు లోనైన ఈ కౌంటర్‌లో ఇప్పుడు స్థిరత్వం వచ్చింది. నెల రోజులుగా కన్సాలిడేషన్ జరుగుతోంది. గత శనివారం సెషన్లో ఈ షేరు రూ.1,091.65 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.1,080/1,060 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.1,185/1,320 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,035 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్: కొన్నాళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ కౌంటర్‌లో ఇటీవల మూమెంటమ్ పెరిగింది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. కీలక మద్దతు స్థాయి రూ.255 స్థాయిల్లో నిలదొక్కుకుంది. గత శనివారం సెషన్‌లో ఈ షేరు రూ.271.30 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు రూ.270/260 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి అడుగుపెట్టి రూ.300/345 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.245 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్: డిసెంబరు 2022లో మొదలైన ఈ షేర్ల పరుగు ఇంకా కొనసాగుతోంది. దిద్దుబాటుకు ఆస్కారమే లేకుండా సుదీర్ఘ అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. నెల రోజులుగా ఈ షేరు కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. గత శనివారం ఈ షేరు రూ.834.40 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.840/830 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/1,140 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.810 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

షాపర్స్ స్టాప్: గత ఏడాది నవంబరు నుంచి ఈ షేరు కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. అంతకు ముందు కొన్ని నెలల వరకు ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లోనే ఉన్నాయి. క్యూ3 ఆర్థిక ఫలితాలు అంచనాల మేరకు ఫలితాలు లేనప్పటికీ ఈ కౌంటర్‌లో మూమెంటమ్ పెరుగుతోంది. గత శనివారం ఈ షేరు రూ.711 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.710/690 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.900/940 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.660 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండియన్ బ్యాంక్: గత ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు మంచి పనితీరును కనబరుస్తూ వస్తోంది. ప్రస్తుతం అప్‌ట్రెండ్ కన్సాలిడేషన్ జరుగుతోంది. గత శనివారం ఈ షేరు రూ.459.95 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.450/430 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.555/630 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.410 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్

ఆంధ్రకు తొలి విజయం

● 172 పరుగులతో అసోం చిత్తు

డిబ్రూఘర్: బౌలర్లు విజృంభించడంతో.. రంజీ సీజన్‌లో ఆంధ్ర తొలి విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-బిలో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 172 పరుగుల తేడాతో అసోంను చిత్తు చేసింది. ఆంధ్ర నిర్దేశించిన 363 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు ఆఖరి రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 81/5తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన అసోం 190 పరుగులకు ఆలౌటైంది. రియాన్ పరాగ్ (75), సుమిత్ (60) పోరాటం వృథా అయింది. లలిత్ మోహన్ నాలుగు వికెట్లు దక్కించుకోగా.. మనీష్, గిరినాథ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. సెంచరీ చేసిన కెప్టెన్ రికీ భుయ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఆంధ్ర 188, 334 పరుగులు చేయగా.. అసోం తొలి ఇన్నింగ్స్‌లో 160 రన్స్‌కు ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన ఏపీ ఆరు పాయింట్లను సొంతం చేసుకొంది.

మార్చి 22 నుంచి ఐపీఎల్!

న్యూఢిల్లీ: ఐపీఎల్ 17వ సీజన్ పోటీలు మార్చి 22 నుంచి మే 26 వరకు జరుగనున్నట్టు సమాచారం. అయితే ఈ లీగ్ ముగిశాక ఐదు రోజులకే వెస్టిండీస్/అమెరికా దేశాల్లో టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కానుండడం గమనార్హం. కానీ భారత జట్టుకు మాత్రం ఐపీఎల్ అయ్యాక తొమ్మిది రోజుల విశ్రాంతి లభిస్తుంది. జూన్ 5న ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అలాగే మహిళల ప్రీమియర్ లీగ్ ఫిబ్రవరి 22 నుంచి మార్చి 17 వరకు బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో నిర్వహించనున్నారు. అయితే లీగ్ షెడ్యూల్‌ను బీసీసీఐ ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మరీ ముఖ్యంగా ఇంచుమించుగా అదే సమయంలో దేశంలో జరిగే సాధారణ ఎన్నికల షెడ్యూల్‌పై ఐపీఎల్ ఆధారపడి ఉంది. ఎలాగైనా లీగ్‌ను భారత్‌లోనే నిర్వహించాలన్న పట్టుదలతో బీసీసీఐ ఉంది.

అల్కారజ్ అలా..

మొదటిసారి క్వార్టర్స్‌కు ● అజరెంకా అవుట్



కలినిస్కయా



అల్కారజ్

మెల్‌బోర్న్: ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్కారజ్ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. రౌండ్-8లో ఈ స్పెయిన్ స్టార్..ఒలింపిక్ చాంపియన్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో తలపడతాడు. 20 ఏళ్ల వింబుల్డన్ చాంపియన్ కార్లోస్ గాయంతో గత ఏడాది ఈ టోర్నీలో ఆడలేకపోయాడు. ఇక..సోమవారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో 6-4, 6-4, 6-0తో మోమిర్ కెక్‌మనోవిక్ (సెర్బియా)పై అల్కారజ్ సునాయాసంగా గెలిచాడు. క్వార్టర్స్ చేరే క్రమంలో అతడు కేవలం ఒక సెట్టే కోల్పోవడం గమనార్హం. మరోవైపు 19వ సీడ్ బ్రిటన్ ఆటగాడు కామెరాన్ నోరీతో ప్రీక్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) ఐదుసెట్ల పాటు పోరాడాల్సి వచ్చింది. నాలుగు గంటల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్ 7-5, 3-6, 6-3, 4-6, 7-6 (3)తో గెలిచి మూడోసారి ఇక్కడ క్వార్టర్స్ చేరాడు. ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జ్వెరెవ్-నోరీ మ్యాచ్ 32వ ఐదు సెట్ల పోరు కావడం విశేషం. ఓపెన్ ఎరాలో ఈ టోర్నీలో ఇది రికార్డు కూడా. మరో ప్రీక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 7-6 (4), 5-7, 6-1తో 69వ ర్యాంకర్ నునో బోర్గెస్ (పోర్చుగల్)పై నెగ్గాడు. 9వ సీడ్ హుబర్ట్ హుర్కాజ్ (పోలెండ్) 7-6 (6), 7-6 (3), 6-4తో ఫ్రెంచ్ సంచలనం ఆర్థర్ కజాక్స్ జోరుకు చెక్ పెట్టాడు.



అజరెంకా

అయ్యో.. అజరెంకా: పురుషుల్లో టాప్ ర్యాంక్ ఆటగాళ్లంతా ముందంజ వేయగా.. మహిళల్లో మాత్రం సీడెడ్‌ల ఓటమి కొనసాగుతూనే ఉంది. 18వ ర్యాంకర్, రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ విక్టోరియా అజరెంకా (బెలారస్)కు 7-6 (6), 6-4తో అన్‌సీడెడ్ దయానా యాస్ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్) నాలుగో రౌండ్‌లో షాకిచ్చింది. మరో ప్రీక్వార్టర్స్‌లో లిండా నోస్కోవా (చెక్ రిపబ్లిక్)తో 0-3తో వెనుకంజలో ఉన్న దశలో 23వ సీడ్ ఎలీనా స్విటోలినా (ఉక్రెయిన్) గాయంతో మ్యాచ్ నుంచి వైదొలగింది. ఇతర నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో అన్‌సీడెడ్ అనా కలిన్‌స్కయా (రష్యా) 6-4, 6-2తో 26వ సీడ్ జాస్మిన్ పౌలిని(ఇటలీ)ని, 12వ సీడ్ జెంగ్ (చైనా) 6-0, 6-3తో జోడిన్ (ఇటలీ)ని చిత్తు చేసి క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. కాగా, దయానా, లిండా, జాస్మిన్, జెంగ్ ఈ వేదికపై క్వార్టర్స్ చేరడం ఇదే మొదటిసారి.

దూసుకుపోతున్న బోపన్న జోడీ

భారత స్టార్ రోహన్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పురుషుల డబుల్స్‌లో జోరు కొనసాగిస్తూ రౌండ్-8కి చేరింది. మూడో రౌండ్‌లో బోపన్న ద్వయం 7-6 (6), 7-6 (4)తో వెస్లీ (హాలెండ్)/నికోలా (క్రొయేషియా) జంటను ఓడించింది.

ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు

కోహ్లీ దూరం



వ్యక్తిగత కారణాలవల్లే..

న్యూఢిల్లీ/ హైదరాబాద్: మరో రెండు రోజుల్లో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆరంభం కానుండగా టీమిండియాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అనూహ్యంగా తొలి రెండు టెస్టుల నుంచి వైదొలిగాడు. అయితే వ్యక్తిగత కారణాలతోనే అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీసీసీఐ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది. తొలి టెస్టుకోసం కోహ్లీ ఆదివారం హైదరాబాద్ చేరుకున్నాడు. గురువారం నుంచే హైదరాబాద్‌లో ఇరు జట్ల మధ్య మొదటి టెస్టు ఆరంభం కానుండగా, రెండో టెస్టు విశాఖపట్నంలో ఫిబ్రవరి 2 నుంచి జరుగుతుంది. 'ఇంగ్లండ్‌తో జరిగే తొలి రెండు టెస్టుల్లో ఆడలేనని విరాట్ బీసీసీఐకి విజ్ఞప్తి చేశాడు. ఈ విషయమై కెప్టెన్ రోహిత్, టీమ్ మేనేజ్‌మెంట్, సెలెక్టర్లతో కూడా తాను మాట్లాడాడు. దేశం తరఫున ఆడడం గర్వకారణమే అయినా.. ఈ సమయంలో కుటుంబంతో గడపాల్సిన కచ్చితమైన పరిస్థితి ఏర్పడిందని చెప్పాడు. బీసీసీఐ కూడా విరాట్ నిర్ణయాన్ని గౌరవిస్తూ అతడికి మద్దతుగా నిలుస్తోంది. అలాగే మీడియా, అభిమానులు కూడా ఈ క్లిష్ట సమయంలో అతడి ప్రైవసీకి భంగం కలిగించవద్దని కోరుతున్నాం. అలాగే ఇంగ్లండ్‌తో సిరీస్ విజయం కోసం జట్టుకు అండగా నిలవాలి' అని బోర్డు కార్యదర్శి జైషా తెలిపాడు.

రేసులో పటీదార్, సర్ఫరాజ్!

ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టుల కోసం విరాట్ స్థానంలో రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. భారత్ 'ఏ' తరఫున వీరిద్దరు చక్కగా రాణిస్తున్నారు. ఇంగ్లండ్ లయన్స్‌పై పటీదార్ 151 రన్స్ చేయగా, సర్ఫరాజ్ హాఫ్ సెంచరీ సాధించాడు. పుజార పేరు కూడా చర్చకు రావచ్చని సమాచారం.

ఏం జరుగుతోంది?

విరాట్ కోహ్లీ ఇటీవలి కాలంలో వ్యక్తిగత కారణాలతో తరచూ జట్టుకు అందుబాటులో లేకుండా పోతున్నాడు. గతంలో ఇలాంటి పరిస్థితి కనిపించేది కాదు. అఫ్ఘాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌కు ఎంపికైనా హఠాత్తుగా తొలి మ్యాచ్ నుంచి వైదొలిగాడు. అంతకంటే ముందు దక్షిణాఫ్రికా టూర్‌లో ఇదే కారణంతో ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ గేమ్స్ నుంచి తప్పుకొని లండన్ వెళ్లాడు. మరోవైపు ఇంతలా అతడిని చుట్టుముట్టిన కుటుంబ సమస్యలు ఏమై ఉంటాయనే ప్రశ్నలు అభిమానులను కలవరపెడుతున్నాయి.

ఐసీసీ టీ20 జట్టు

కెప్టెన్ సూర్య



న్యూఢిల్లీ: పొట్టి ఫార్మాట్‌లో గతేడాది ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లతో కూడిన జట్టును ఐసీసీ ప్రకటించింది. దీనికి సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయడం విశేషం. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలతో జరిగిన సిరీస్‌ల్లో సూర్య జట్టును విజయవంతంగా నడిపించాడు. అలాగే గతేడాది సూర్య ఆడిన 18 మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలతో 733 రన్స్ సాధించాడు. ఇక ఈ టీమ్‌లో భారత్ నుంచి జైస్వాల్, బిష్ణోయ్, అర్ష్‌దీప్‌లకు కూడా చోటు దక్కింది.

జట్టు: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ (భారత్), ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్), పూరన్ (వెస్టిండీస్), చాప్‌మన్ (న్యూజిలాండ్), సికిందర్ రజా, రిచర్డ్ ఎన్‌గరవ (జింబాబ్వే), మార్క్ ఐడెర్ (ఐర్లాండ్), రమ్‌జాని (ఉగాండా).



రవిశాస్త్రికి 'లైఫ్‌టైమ్' అవార్డు

నేడు హైదరాబాద్‌లో పురస్కారాల ప్రదానం

హైదరాబాద్: గతేడాది పరుగుల వరద పారించిన డాషింగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు బీసీసీఐ 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కింది. కాగా, టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, కోచ్ రవిశాస్త్రి జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో మంగళవారం ఈ అవార్డుల కార్యక్రమం ఉంటుందని భారత క్రికెట్ బోర్డు తెలిపింది. దీనికి భారత్, ఇంగ్లండ్ టెస్ట్ ఆటగాళ్లు హాజరయ్యే అవకాశాలున్నాయి. 61 ఏళ్ల శాస్త్రి భారత్ తరఫున 80 టెస్టులు, 150 వన్డేలు ఆడాడు. రిటైరైన తర్వాత టీమిండియా కోచ్, డైరెక్టర్‌గా పనిచేశాడు. క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌కు పాలీ ఉమ్రీగర్ అవార్డు, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్‌కు సీకే నాయుడు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

ఆధిక్యంలో గుకేష్

వీకాన్ జీ (నెదర్లాండ్స్): టాటా చెస్ టోర్నీ మాస్టర్స్ విభాగం ఎనిమిదో రౌండ్‌లో..మహిళల వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్‌తో గేమ్‌ను డ్రా చేసిన గుకేష్ (5) అనిష్ గిరీతో కలిసి సంయుక్త ఆధిక్యంలో నిలిచాడు. మరో భారత జీఎం ప్రజ్ఞానంద (4.5) మ్యాక్స్ వార్మెడమ్‌తో ఎనిమిదో రౌండ్‌ను ఫలితం లేకుండా ముగించాడు. చాలెంజర్ విభాగంలో జెమీ సాంటోస్‌తో ఎనిమిదో రౌండ్‌ను జీఎం హారిక డ్రా చేసుకుంది.



టైటాన్స్..మరో'సారీ'

తెలుగు జట్టు పరాజయం

హైదరాబాద్: గత మ్యాచ్ విజయంతో పరాజయ పరంపరకు చెక్ పెట్టినట్టే కనిపించిన స్థానిక జట్టు తెలుగు టైటాన్స్ మళ్లీ నిరాశపరిచింది. ప్రొ. కబడ్డీ లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో 30-37 స్కోరుతో హరియాణా స్టీలర్స్ చేతిలో ఓడింది. ఆల్‌రౌండర్ సంజీవి (6), రైడర్ ప్రఫుల్ (6) తప్ప టైటాన్స్‌లో ఎవరూ ఆకట్టుకోలేదు. హరియాణాలో..డిఫెండర్ రాహుల్ (8), వినయ్ (6), మోహిత్ (6), శివమ్ (6) సమష్టిగా రాణించారు. టైటాన్స్‌కు ఇది ఓవరాల్‌గా 15 మ్యాచుల్లో 13వ పరాజయం కావడం గమనార్హం. కేవలం రెండు విజయాలే అందుకున్న తెలుగు జట్టు 16 పాయింట్లతో పట్టికలో అట్టడుగు స్థానంలో కొనసాగుతోంది. ఇక, టేబుల్ టాపర్ జైపూర్ పింక్ పాంథర్స్ తన జోరు కొనసాగిస్తోంది. స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ (15) అదరగొట్టిన వేళ అంతకుముందు జరిగిన మొదటి మ్యాచ్‌లో 42-25 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. జైపూర్ మరో రైడర్ భవానీ రాజ్‌పుత్ (7), డిఫెండర్ అంకుశ్ (6) సత్తా చాటారు. బెంగాల్ జట్టులో మణిందర్ సింగ్ (9), వైభవ్ (5) పర్లేదనిపించారు.



కఠినమైన గ్రూపులో భారత్

పారిస్ ఒలింపిక్స్ పురుషుల హాకీ డ్రా

లౌజాన్ (స్విట్జర్లాండ్): పారిస్ ఒలింపిక్స్ పురుషుల హాకీలో భారత జట్టుకు కఠినమైన డ్రా ఎదురైంది. ఈ మేరకు పోటీల డ్రాను సోమవారం ఇక్కడ ప్రకటించారు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యంతో చరిత్ర సృష్టించిన భారత్..రాబోయే ఒలింపిక్స్‌లో క్లిష్టమైన గ్రూప్ 'బి' నుంచి బరిలో దిగనుంది. ఈ గ్రూపులో ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్, వరల్డ్ నెం.2 బెల్జియం, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్జెంటీనా, బలీయమైన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. గ్రూప్ 'ఎ'లో నెదర్లాండ్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, ఫ్రాన్స్, సౌతాఫ్రికా జట్లు తలపడనున్నాయి. మహిళల్లో..గ్రూప్ 'ఎ' నుంచి నెదర్లాండ్స్, బెల్జియం, జర్మనీ, జపాన్, చైనా, ఫ్రాన్స్, గ్రూప్ 'బి' నుంచి ఆస్ట్రేలియా, అర్జెంటీనా, బ్రిటన్, స్పెయిన్, అమెరికా, సౌతాఫ్రికా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. భారత మహిళల జట్టు ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైన సంగతి తెలిసిందే.

పాక్‌కు మళ్లీ నో చాన్స్

కరాచీ: పాకిస్థాన్ పురుషుల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఒమన్‌లో జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీలో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 2-3తో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. దరిమిలా..ఆ జట్టు వరుసగా మూడోసారి విశ్వక్రీడలకు దూరమైంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 23 జనవరి 2024
cinema@andhrajyothy.com



ప్రస్తుతం ఎలివేషన్స్ ట్రెండ్ నడుస్తోంది. డైలాగులతో, కెమెరా ట్రిక్కులతో హీరోను ఓ సూపర్ నాచురల్ పవర్‌లా చూపించడం నేటి దర్శకులకు పరిపాటైపోయింది. అసలు ఈ ఎలివేషన్ అనే దానికి విత్తనం ఎక్కడ పడిందో ముందు తెలుసుకుందాం. హీరో కేరక్టర్‌ని ఆకాశమంత ఎత్తులో చూపించే ప్రక్రియ రామాయణకావ్యం నుంచి మొదలైంది. దానికి నాంది పలికింది వాల్మీకి. 'రామాయణం'లో 'మారీచ ఉవాచ' చదివిన వాళ్లకు ఎలివేషన్ అంటే ఏంటో అర్థమవుతుంది. ఓ విధంగా రాముడికి వాల్మీకి ఇచ్చినంత ఎలివేషన్ ఆ తర్వాత ఏ కథల్లోనూ కావ్యాల్లోనూ, ఏ సినిమాల్లోనూ ఇప్పటికీ ఎవరూ ఇవ్వలేకపోయారన్నది వాస్తవం. అందుకే ఇప్పటికీ హీరో అనే పదానికి నిర్వచనం అంటే శ్రీరాముడే.







సినీజగమంతా రామమయం

రాముడు మానవుడిగా పుట్టిన వైకుంఠనారాయణుడు అనేది కోట్లాదిమంది నమ్మకం. అసలు మనిషిగా పుట్టిన రాముడు దేవుడెలా అయ్యాడు? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే రామాయణం చదవాలి. నూనూగు మీసాల ప్రాయంలోనే బ్రహ్మరాక్షసి తాటకిని చంపడం.. వీరాధివీరులకే సాధ్యంకాని శివధనుస్సును విరిచేయడం.. పరశురాముని గర్వాన్ని అణిచేయడం.. 40వేలమంది కరదూషణాదులను ఒక్కడే ఒకే యుద్ధంలో చంపేయడం.. రావణుడి పదితలల్నీ తెంచి ఆవతల పారేయడం.. అన్నింటినీ మించి ధర్మనిరతి, మాటపై నిలబడే తత్వం. ఇవన్నీ మనుషులకు సాధ్యంకాదు. కాబట్టే రాముడు దేవుడు. ఓ విధంగా వెండితెరపై తయారయ్యే సూపర్‌హీరో పాత్రలన్నింటికీ ప్రేరణ రాముడే. హీరో లక్షణాలంటే ఏవోకావు.. రాముడి గుణగణాలే.. మరి అలాంటి రామయ్య సంపూర్ణమూర్తిని వెండితెరపై ఆవిష్కరించిన నటదిగ్గజాలెవరో ఇప్పుడు చూద్దాం.

● వెండితెరపై రాముడిగా ఎందరు నటించినా అగ్ర తాంబూలం మాత్రం నటరత్న ఎన్టీరామారావుదే. ఎన్టీయార్ రాముడిగా కనిపించిన తొలి సినిమా 'చరణదాసి'(1956). ఇందులో ఓ పాటలో రాముడిగా కనిపించారాయన. ఆ తర్వాత 'వినాయకచవితి'(1957)లో ఓ సన్నివేశంలో రాముడిగా మెరిశారు. ఇక ఎన్టీయార్ పూర్తిస్థాయిలో రాముడిగా నటించిన తొలి సినిమా 'సంపూర్ణరామాయణం'(తమిళం). 1958లో విడుదలైన ఈ తమిళ సినిమా ఘనవిజయాన్ని అందుకుంది. ఇందులో భరతుడిగా శివాజీగణేశన్ నటించడం విశేషం.

ఇక 'లవకుశ'(1953).. తెలుగు సినీచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సినిమా 'లవకుశ'. జనం తండోపతండాలుగా బళ్లుకట్టుకొని మరీ వెళ్లి ఈ సినిమా చూశారు. ఆడుతున్న థియేటర్లన్నీ రామాలయాలైపోయాయి. వాణిజ్యపరంగా తెలుగుసినిమా స్థాయిని పెంచిన సినిమా 'లవకుశ'. 'కోటి' అనే అంకెను సినీ పరిశ్రమకు పరిచయం చేసిన సినిమా ఇది.

ఆ తర్వాత శ్రీకృష్ణసత్య, శ్రీరామాంజనేయయుద్ధం, శ్రీరామపట్టాభిషేకం, శ్రీకృష్ణాంజనేయయుద్ధం చిత్రాల్లో రాముడిగా నటించి తెలుగు ప్రజల గుండెల్లో కోదండరాముడిగా చెరగని ముద్రవేశారు తారకరాముడు.

● ఈ సందర్భంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. హీరోగా ఆయన నటించిన తొలి సినిమా 'సీతారామజననం'. ఇందులో అక్కినేని కల్యాణరాముడిగా నటించారు. అంటే హీరోగా ఆయన కెరీర్ మొదలైంది రాముడి పాత్రతోనే అనమాట.

● ఎన్టీయార్ తర్వాత రామచంద్రుడి పాత్రలో మెప్పించిన మరో నటుడు హరనాథ్. ఎన్టీయార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'సీతారామకల్యాణం' చిత్రంలో తొలిసారి రాముడిగా నటించారు హరనాథ్. కల్యాణరాముడిగా ఆయన రూపం తెలుగుప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆ తర్వాత శ్రీరామకథ, భక్తశబరి చిత్రాల్లో రాముడిగా అలరించారాయన.

● కాంతారావు విషయానికొస్తే.. ఆయన అందరికీ లక్ష్మణుడిగానే గుర్తుంటారు. 'లవకుశ'లో లక్ష్మణస్వామిగా కాంతారావు చూపించిన అభినవపాటవం అలాంటిది. ఆయనే ఆ తర్వాత వీరాంజనేయ, మైరావణ, పాదుకాపట్టాభిషేకం చిత్రాల్లో రాముడిగా కూడా భళా అనిపించారు.

● శోభన్‌బాబుని రాముడిగా వెండితెరపై ఆవిష్కరించిన తొలి సినిమా 'భక్త పోతన'. ఆ తర్వాత రాముడిగా కనిపించిన చిత్రం దర్శకుడు బాపు 'సంపూర్ణరామాయణం'. రామజననం నుంచి రావణ సంహారం వరకూ జనరంజకంగా ఈ సినిమాను ఆవిష్కరించారు బాపు-రమణ. ఇందులో రాముడిగా శోభన్‌బాబు నటన అద్భుతం. ఎన్టీయార్ వెండితెరపై సూపర్‌స్టార్‌గా వెలుగుతున్న రోజుల్లోనే రాముడిగా నటించి ఆయనతోనే శభాష్ అనిపించుకున్నారు శోభన్‌బాబు. 'లవకుశ'లో ఆయన శత్రుఘ్నుడిగా నటించిన విషయం తెలిసిందే.







● ఆ తర్వాతి తరంలో రాముడిగా మెప్పించిన హీరోల్లో నందమూరి బాలకృష్ణ కూడా ఒకరు. ఆయన తొలిసారి 'మంగమ్మగారి మనవడు' సినిమాలో రాముడిగా మెరిశారు. ఆ తర్వాత జంధ్యాల 'సీతారామకల్యాణం' సినిమాలోని ఓ సన్నివేశంలో రాముడిగా కనిపించారు. ఇక బాపుగారి చివరి సినిమా 'శ్రీరామరాజ్యం'లో పూర్తిస్థాయిలో రాముడిగా నటించి తండ్రిని తలపించారు బాలకృష్ణ.

● పూర్తిస్థాయి రాముడిగా నటించిన మరో హీరో జూనియర్ ఎన్టీయార్. గుణశేఖర్ దర్శకత్వంలో ఎంఎస్‌రెడ్డి నిర్మించిన 'రామాయణం'లో ఆయన రాముడిగా నటించారు. 1996లో విడుదలైన ఈ సినిమా నాటికి తారక్ వయసు 13ఏళ్లు. పిల్లలే ప్రధానపాత్రధారులుగా వాల్మీకి రామాయణాన్ని సినిమాగా తీయాలన్న ఎంఎస్ రెడ్డి సాహసోపేతమైన ఆలోచనకు తెరరూపం 'రామయణం'. గుణశేఖర్ దర్శకత్వం వహించారు. బాలుడైన తారక్ రాముడిగా ఆ సినిమాలో అద్భుతం అనిపించారు. ఆ వయసులోనే 'తాతకు తగ్గ మనవడు' అంటూ పలువురి కితాబులందుకున్నారు . ఆ ఏడాది జాతీయ పురస్కారాలు అందుకున్న సినిమాల్లో ఈ సినిమా కూడా ఒకటి.



● 'అన్నమయ్య' సినిమాలో వెంకటేశ్వరస్వామిగా అద్భుతంగా నటించిన హీరో సుమన్.. 'శ్రీరామదాసు' చిత్రంలో రాముడిగా నటించారు. ఆ తర్వాత 'సత్యనారాయణస్వామి' అనే సినిమాలో కూడా రామచంద్రమూర్తిగా తళుక్కున మెరిశారు. ఏదేమైనా అటు ఏడుకొండలవాడిగా, ఇటు రామచంద్రమూర్తిగా సుమన్ అభినయాన్ని.. ఆహార్యాలను జనం మెచ్చారు. ఇక 'దేవుళ్లు' సినిమాలో హీరో శ్రీకాంత్ కూడా రాముడిగా కనిపించారు.

ఈ విధంగా జనంమెచ్చిన కథానాయకులందరూ.. జగం మెచ్చిన కథానాయకుడైన రామచంద్రమూర్తి పాత్రను పోషించి.. శభాష్ అనిపించుకున్నారు.

అయోధ్యలో బాలరామయ్య కొలువు తీరగా, కోట్లాదిమంది భారతీయుల కల నెరవేరిన ఈ శుభవేళ.. వెండితెర రాముళ్లను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..



చెల్లి ఎంగేజ్‌మెంట్.. సాయిపల్లవి డాన్స్



హీరోయిన్ సాయిపల్లవి చెల్లెలు పూజా కన్నన్ వివాహం ఆమె చిరకాల మిత్రుడు, ప్రియుడు వినీత్‌తో జరగనుంది. వీరి నిశ్చితార్థ వేడుక మిత్రులు, కుటుంబ సభ్యుల మధ్య జరిగింది. వినీత్‌తో రిలేషన్‌లో ఉన్న సంగతిని పూజ సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన వారం రోజులకే ఈ వేడుక జరగడం గమనార్హం.. పూజ కూడా నటే. ఓ తమిళ చిత్రంతో ఆమె నటిగా అరంగేట్రం చేశారు. నిశ్చితార్థ వేడుకలో కాబోయే వధూవరులతో కలసి సాయి పల్లవి డాన్స్ చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మాట విలువ చెప్పే బాలరాజు



'బిగ్‌బాస్' సోహైల్ హీరోగా శ్రీ కోనేటి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'బూట్ కట్ బలారాజు' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఎం.డి. పాషా ఈ సినిమాకు నిర్మాత. ఈ చిత్రం ట్రైలర్‌ను ఆదివారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు.ఈ వేడుకలో సోహైల్ మాట్లాడుతూ 'నేను 'బిగ్‌బాస్' నుంచి బయటకు రాగానే నాతో సినిమా చేస్తానని పాషా భాయ్ చెప్పారు. ఈ సినిమా కోసం బాగా కష్టపడ్డాం. భీమ్స్ అన్న ఈ సినిమాకు మంచి పాటలు ఇచ్చారు. టీమ్ అందరికీ ధన్యవాదాలు' అని చెప్పారు. హీరో శివాజీ మాట్లాడుతూ 'సోహైల్‌లో మంచి తపన ఉంది. పరిశ్రమలో తప్పకుండా నిలబడతాడు. ఎదుగుతున్న నటుడిని అందరూ ప్రోత్సహించాలి' అన్నారు. దర్శకుడు శ్రీ కోనేటి మాట్లాడుతూ 'మంచి వినోదాత్మక చిత్రం ఇది. మాటకి ఉన్న విలువ, గౌరవం గురించి ఈ చిత్రంలో చెబుతున్నాం' అన్నారు. 'కంటెంట్ ఉన్న ప్రతి సినిమా హిట్ అవుతుంది. రెండున్నర ఏళ్లగా ఈ సినిమా కోసం హార్డ్ వర్క్ చేశాం. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది. అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. 'బిగ్‌బాస్' ఏడు సీజన్ల స్టార్స్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్న ఈ వేడుక గ్రాండ్‌గా జరిగింది.

జై హనుమాన్ ప్రారంభం



'హను-మాన్' వేడి ఇంకా చల్లారక ముందే ఆ సినిమాకు సీక్వెల్‌ని ప్రకటించేశారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ఈ సినిమాకు 'జై హనుమాన్' అని నామకరణం చేశారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్‌ను అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠామహోత్సవం సందర్భంగా సోమవారం మొదలుపెట్టారు. హైదరాబాద్‌లోని హనుమాన్ ఆలయంలో యాగంలో పాల్గొని, స్క్రిప్ట్‌ని హనుమంతుని పాదాలదగ్గర ఉంచి ప్రీప్రొడక్షన్ వర్క్‌ని లాంఛనంగా ప్రారంభించారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేయనున్న ఈ సినిమాకి సంబంధించిన నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రేమలో.. ఎమోషన్స్



చందు కోడూరి హీరోగా, చరిష్మా శ్రీకర్ హీరోయిన్‌గా రూపొందిన 'ప్రేమలో' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. చందు కోడూరి దర్శకత్వంలో రాజేశ్ కోడూరి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను నటుడు శివాజీ రాజా సోమవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రంలో మూడు రోజుల పాత్ర చేయడానికి అంగీకరించాను. అయితే దర్శకుడు చందు ప్యాషన్ చూసి నేను మూడు రోజులు ఉంటే ఖర్చు ఎక్కువ అవుతుందని ఒకటిన్నర రోజుల్లోనే కంప్లీట్ చేయమన్నాను. అతను పడిన కష్టానికి మంచి పేరు వస్తుంది. ఇలాంటి చిత్రాలను తప్పకుండా ఆదరించాలి' అని కోరారు.

హీరో, దర్శకుడు చందు మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటివరకూ ఎవరూ ట్రై చేయని కథ తీసుకున్నాను. సహజంగా ఉండేలా తీర్చిదిద్దాను. ఇది ప్రేమకథే. అయినా మంచి ఎమోషన్స్ ఉన్నాయి. కథలో బలం ఉంది కనుక ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. మా అన్నయ్య నిర్మాతగా మారి ఈ సినిమా కోసం బాగా ఖర్చు పెట్టారు. ఓ మేనేజర్‌గా ఎంతో కష్టపడ్డారు. టీమ్‌లో అందరి సహకారంతో సినిమా పూర్తి చేశాం. ఈ చిత్రం హిట్ అయితే మరిన్ని సినిమాలు తీస్తాను. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం రోజునే మా సినిమా ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. జై శ్రీరామ్' అన్నారు.

'ప్రేమలో' చిత్రం విజయం సాధించాలని సంగీత దర్శకుడు సందీప్, పాటల రచయిత సత్య, నటుడు భోగిరెడ్డి శ్రీనివాస్ తదితరులు కోరారు.

తండ్రీకొడుకుల రామం రాఘవం



నటుడు ధన్‌రాజ్ దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రానికి 'రామం రాఘవం'. అనే పేరును ఖరారు చేశారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం మేకర్స్ టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి పృథ్వీ పోలవరపు నిర్మాత. ఇందులో తండ్రీకొడుకులుగా సుముద్రఖని, ధన్‌రాజ్ కనిపిస్తారని, ఇప్పటివరకూ చూడని కొత్త కథాంశంతో ఈ సినిమా రూపొందుతోందని నిర్మాత తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఈ చిత్రంలో మోక్ష, హరీశ్ ఉత్తమన్, సత్య పృథ్వి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఇతర పాత్రధారులు. 'విమానం'ఫేం శివప్రసాద్ యానాల కథను అందిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గాప్రసాద్. తెలుగు, తమిళభాషల్లో ఒకేసారి ఈ చిత్రం విడుదల కానుంది.

మస్తు షేడ్స్ ఉన్నాయ్‌రా..



కమెడియన్ అభినవ్ గోమఠం హీరోగా మారాడు. ఆయన హీరోగా 'మస్త్ షేడ్స్ ఉన్నాయ్‌రా' అనే పేరుతో సినిమా రానుంది. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో అభినవ్ చెప్పిన పాపులర్ డైలాగ్ ఇది. అదే హీరోగా అతని తొలి సినిమా టైటిల్ కావడం విశేషం. వైశాలీ రాజ్ హీరోయిన్. తిరుపతిరావు ఇండ్ల దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్.వి నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ లోగోను దర్శకుడు తరుణ్‌భాస్కర్ ఆవిష్కరించారు. నటుడిగా అభినవ్ గోమఠంలోని కొత్తకోణాన్ని ఇందులో చూస్తారని, అన్ని ఉద్వేగాలూ ఈ సినిమాలో ఉంటాయని, వచ్చేనెల ద్వితీయార్థంలో సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు. తరుణ్‌భాస్కర్, అలీ రేజా తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సిద్దార్థ్ స్వయంభూ, కథ, అన్వర్ సాథిక్, మాటలు: రాధామోహన్ గుంటి, సంగీతం: సంజీవ్ టి.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 23 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

యోగ సైన్స్‌లో ఫౌండేషన్ కోర్సు



భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్ఐవై)- 'ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగా సైన్స్ ఫర్ వెల్‌నెస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఒక నెల. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్రతి బ్యాచ్‌కు రెండు గంటల శిక్షణ ఉంటుంది. ఒక్కో బ్యాచ్‌లో 30 సీట్లు ఉన్నాయి. వయసు కనీసం పదిహేనేళ్లు నిండినవారందరూ అర్హులే. అభ్యర్థులందరూ మెడికల్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.2,500
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.250
- **సర్టిఫికేషన్ ఫీజు:** రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 29
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** అభ్యర్థి ఫొటో, వ్యాలిడ్ ఐడీ కార్డ్
- **తరగతులు ప్రారంభం:** ఫిబ్రవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.yogamdniy.nic.in

నిట్ వరంగల్‌లో ఇంటిగ్రేటెడ్ ఎఫ్‌డీపీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్- 'లూపింగ్ టెక్నాలజీస్ ఫర్ సస్టయినబుల్ పవర్ అండ్ హైడ్రోజన్ ప్రొడక్షన్' అంశానికి సంబంధించి ఇంటిగ్రేటెడ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. దీనిని కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అకడమిక్ అండ్ రీసెర్చ్ కొలాబరేషన్(స్పార్క్) స్పాన్సర్ చేస్తోంది.

స్వీడన్‌లోని చామర్స్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ(సీయూటీ), యూఎస్‌ఏలోని ఎన్‌సీ స్టేట్ యూనివర్సిటీ సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి ఒక వారం. దీనిని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహిస్తారు. వివిధ అకడమిక్ సంస్థలకు చెందిన ఫ్యాకల్టీలు; సీసీయూ టెక్నాలజీపై ఆసక్తి ఉన్న పీజీ అభ్యర్థులు, రీసెర్చ్ సైంటిస్ట్‌లు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్; థర్మల్ పవర్ ప్లాంట్స్‌కు చెందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో మొత్తం 60 మందికి అవకాశం కల్పిస్తారు.

ప్రోగ్రామ్‌లోని అంశాలు

ఈ ప్రోగ్రామ్‌లో ప్రిన్సిపల్స్ అండ్ థర్మోడైనమిక్స్ యాస్పెక్ట్ ఆఫ్ సీఎల్‌సీ, ప్రాపర్టీస్ అండ్ ప్రిపరేషన్ ఆఫ్ ఆక్సిజన్ క్యారియర్స్, కెమికల్ లూపింగ్ గ్యాసిఫికేషన్, కెమికల్ లూపింగ్ హైడ్రోజన్ అండ్ కెమికల్ ప్రొడక్షన్, డిజైన్ అండ్ ఆపరేషన్ ఆఫ్ సీఎల్‌సీ యూనిట్స్, సీఎల్‌సీ ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ సిమ్యులేషన్స్ అంశాలకు సంబంధించి 15 గంటలసేపు లెక్చర్స్, 3 ట్యుటోరియల్ సెషన్స్ ఉంటాయి. నిట్ వరంగల్, సీయూటీ(స్వీడన్), ఎన్‌సీఎస్‌యూ (యూఎస్‌ఏ)లకు చెందిన ప్రొఫెసర్లు సెషన్స్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నిర్దేశించిన ప్రకారం అసైన్‌మెంట్స్ పూర్తిచేయాలి. ప్రోగ్రామ్ చివరలో గ్రేడెడ్ ఎగ్జామ్ ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఈ - సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** ఫ్యాకల్టీ మెంబర్లకు రూ.590, రీసెర్చ్ స్కాలర్స్/పీజీ/పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.354; ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్‌కు రూ.1180. ● **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 5
- **వెబ్‌సైట్:** nitw.ac.in



ఐఐఎం రోహ్‌తక్‌లో డాక్టోరల్ ప్రోగ్రామ్

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (డీపీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఇది నాలుగేళ్ల వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు

ఎకనామిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.

అర్హత

ఏదేని స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్/ ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నాలుగేళ్ల డిగ్రీ లేదా ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు 2024 జూన్ 1 నాటికి ఏడాది అనుభవం ఉన్నవారు; అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ, పీజీ స్థాయుల్లో కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 డిసెంబరు 31 నాటికి పీజీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్/జీఆర్‌ఈ/జీమ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. లేదంటే నిర్దేశించిన ప్రకారం కామర్స్, కంప్యూటర్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, లేబర్ వెల్ఫేర్ అండ్ పర్సనల్ రిలేషన్స్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, మేథమెటికల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో యూజీసీ నెట్ అర్హత పొంది ఉండాలి. ఐఐఎం సంస్థల నుంచి పీజీడీఎం/ఎంబీఏ పూర్తిచేసినవారికి పై స్కోర్‌లు అవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

ఫెలోషిప్

మొదటి రెండేళ్లు నెలకు రూ.34,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000ల ఫెలోషిప్ ఇస్తారు. నిబంధనల ప్రకారం రెండో ఏడాది నెలకు రూ.10,000; మూడో ఏడాది నుంచి నెలకు రూ.15,000ల మెరిట్ ఫెలోషిప్ ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద రూ.2,50,000 చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.2928
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 29
- అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్: మార్చి 15న
- ఇంటర్వ్యూలు: ఏప్రిల్ 15, 16
- ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: ఏప్రిల్ 25న
- అభ్యర్థుల రిపోర్టింగ్, జాయినింగ్ తేదీ: జూన్ 6
- వెబ్‌సైట్: iimrohtak.ac.in

చదవడమే కాదు చేతిరాతా ముఖ్యమే



అసలే పరీక్షల సమయం. విద్యార్థులు పరీక్షలకు ఎంతో సమయాన్ని కేటాయించి కష్టపడి బాగా చదువుతారు. కాని కొందరి రాతను చూస్తే వంకరటింకరగా, పదాల మధ్య ఎక్కువ గ్యాప్‌లు ఇస్తూ రాస్తుంటారు. ఇలా చేయడం వల్ల ఎగ్జామినర్‌ను ఆకట్టుకోలేరు. నిజానికి మంచి దస్తూరికి కనీసం అయిదు నుంచి పదిశాతం మార్కులు అదనంగా పొందే వీలుంది.

ప్రధాన దోషాలు

చిన్న చిన్న దోషాలే... విలువలైన మార్కులకు కోత పెడతాయి. సాధారణంగా విద్యార్థులు పరీక్షల్లో నాలుగు రకాల తప్పులను చేస్తుంటారు.

1) ప్రశ్నకు తగ్గట్టు సమాధానం రాయకపోవడం
2) వ్యాకరణ దోషాలు 3) అక్షర దోషాలు
4) చేతిరాత గజిబిజిగా ఉండటం

ముఖ్యంగా...

1) సమాధానాలు రాసేటప్పుడు విరామ చిహ్నాలు మరిచిపోతారు
2) పదాల, అక్షరాల మధ్య ఖాళీ స్థలాన్ని వదలడం
3) అక్షరాలను, సంఖ్యలను అస్పష్టంగా రాయడం
4) కాగితంపై పెన్ను ఒత్తిపెట్టి రాస్తే, సమాధానాన్ని నిదానంగా పూర్తిచేస్తారు, ఒత్తిడి స్పష్టంగా తెలుస్తుంది.
5) కొట్టివేతలు... విద్యార్థులు పరీక్షకు సరిగా సిద్ధం కాలేదని చెబుతాయి.
6) ఎ4 సైజు కాగితంలో 20 నుంచి 25 వరసలు రాస్తుంటారు.
7) పెన్నును ఇష్టం వచ్చినట్టు పట్టుకోవడంతో జవాబు పత్రం గజిబిజిగా తయారవుతుంది. లైన్లు వంకరటింకరగా ఉంటాయి.
8) నలుపు, నీలం, ఎరుపు జెల్ పెన్నులను ఉపయోగించకూడదు.
9) సమాధానాలు రాసేటప్పుడు సంక్షిప్త సందేశాలు పంపేటప్పుడు ఉపయోగించే షార్ట్ కట్ భాషను వాడకూడదు.
10) బిట్ పేపర్‌లో చిన్న ఆంగ్ల అక్షరాలను వాడకూడదు.
11) అంకెలు రాసేటప్పుడు స్పష్టత లేక పొరపాటు చేస్తుంటారు. మూల్యాంకనం చేసేవారు అర్థం చేసుకోలేక మార్కులు వేయకపోవచ్చు.

ఈవిధంగా నేర్చుకొని, పాటించాలి

1) తెలుగు, హిందీ, ఆంగ్ల అక్షరాలు రాసేటప్పుడు అక్షరాలు నిటారుగా, గుండ్రంగా ఉండాలి.
2) ఆంగ్లంలో కలిపి రాత రాసేవారు 90 డిగ్రీల కోణంలో, విడివిడిగా రాసేవారు 60 డిగ్రీల కోణంలో వంచి రాయాలి.
3) కొట్టివేతలు, దిద్దివేతలు లేకుండా ఉంటే మంచిది. ఒకవేళ తప్పుగా రాసినప్పుడు ఇష్టం వచ్చినట్లు దిద్దకుండా ఆ పదంపై పెన్సిల్‌తో ఒక గీత గీసి దాని పక్కనే తిరిగి రాయడం ఉత్తమం.
4. ఎ4 సైజు కాగితంలో 15 నుంచి 18 లైనులే రాయాలి
5) మూడువేళ్లతో పెన్ను పట్టుకోవాలి.
6) రోజూ ఉదయం 10 నుంచి 15 నిమిషాలసేపు యోగ, ధ్యానం చేయాలి. అప్పుడే మనం రాసే అక్షరాలపై దృష్టి కేంద్రీకరించగలం.
7) కాగితంపై పెన్ను ఒత్తి పెట్టి రాయకుండా, సున్నితంగా రాయాలి.
8) ఆంగ్లంలో కలిపి రాత రాసేవారు ముందుగా ఇంక్ పెన్ లేదా జెల్ పెన్‌తో సాధన చేసి, బాల్‌పెన్‌తో వేగంగా రాయడం అలవాటు చేసుకోవాలి.
9) అక్షరాల మధ్య కాకుండా పదాల మధ్యే నిర్ణీత ఖాళీ ఇవ్వాలి. ముఖ్యంగా విరామ చిహ్నాలను పాటించాలి
10) రోజూ అపసవ్య దిశలో సున్నాలను గీస్తూ ఉంటే అక్షరాలను గుండ్రంగా రాసేందుకు అవకాశం ఉంటుంది.
11) పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు రోజూ ఎక్కువగా నీళ్లు తాగుతూ శాఖాహార భోజనం తీసుకోవాలి
12) ఎట్టి పరిస్థితుల్లోనూ షార్ట్‌కట్ భాష ఉపయోగించకూడదు. ఒకవేళ రాస్తే పేపర్ దిద్దే వారికి మీపై ఒక దురభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉంది.
13) డ్రాయింగ్‌ను సాధన చేస్తే దస్తూరి మెరుగుపడుతుంది
14) కంటికి, కాగితానికి మధ్యలో దూరం 20 నుంచి 25 సెంటీమీటర్ల మధ్య ఉండాలి.
15) కాగితం పైభాగంలో రాసే మొదటి వరుసను శ్రద్ధ పెట్టి జాగ్రత్తగా రాయాలి. అప్పుడు కింది వరుసలు చక్కగా వస్తాయి.
16) సైన్స్(సామాన్య, భౌతికశాస్త్రంలో) బొమ్మలు గీస్తే ఆ బొమ్మల్లోని భాగాలు గుర్తించడంలో ఒక క్రమపద్ధతిని పాటించాలి
17) గణితానికి సంబంధించిన అంకెలు సక్రమంగా, స్పష్టంగా రాయాలి.
18) గణితంలో పరిచయానికి మాత్రమే కలిపి రాత ఉపయోగించాలి
19) తెలుగు, హిందీ, మేథ్స్, ఆంగ్లం, సైన్స్, సోషల్ సమాధాన పత్రంలో మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకు ఒకే పెన్నుతో, ఒకే దస్తూరిలో రాయాలి.
20) జవాబు రాసే తీరు పరీక్ష పేపర్ మూల్యాంకనం చేసేవారికి ఇబ్బందిపెట్టే విధంగా ఉండకూడదు. సమాధానాలు అన్నీ మూల్యాంకనం చేసే ఉపాధ్యాయునికి తెలుసన్న సంగతి గుర్తుంచుకోవాలి.

కాలిగ్రఫీ: ఈ హ్యాండ్ రైటింగ్‌లో అక్షరాలు ఎక్కువగా మెలకువలు ఆధారంగా ఉంటాయి. ఈ రైటింగ్ ఎక్కువగా గ్రీటింగ్ కార్డ్స్, ఇన్విటేషన్ కార్డ్సులో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ హ్యాండ్ రైటింగ్‌ను పరీక్షల్లో ఉపయోగించకూడదు.

స్ప్రిట్: విడివిడిగా రాసే అక్షరాలను స్ప్రిట్ హ్యాండ్ రైటింగ్‌గా పిలుస్తారు. ఇది చాలా సాంప్రదాయక చేతిరాత. ఈ హ్యాండ్ రైటింగ్ ఎదుటివారికి స్పష్టంగా అర్థమవుతాయి. ఎక్కువగా ఒకటో తరగతి నుంచి మూడో తరగతి విద్యార్థులు దీనిని ఉపయోగిస్తారు. ఈ హ్యాండ్ రైటింగ్‌ను పరీక్షల్లో ఉపయోగించవచ్చు.

కాలిగ్రఫీ కర్సివ్: అక్షరాలను కలిపి రాయడమే ఈ చేతిరాత ప్రత్యేకత. ఇది ఒక యూనిఫాంలో ఉంటుంది. ఇది యూనివర్సల్ హ్యాండ్ రైటింగ్ ప్రపంచంలో ఈ చేతిరాతకి చాలా ప్రాముఖ్యం ఉంది. ప్రపంచంలో ఏ ఇద్దరు వ్యక్తుల రైటింగ్‌లు ఒకేలా ఉండనిదే కాలిగ్రఫీ కర్సివ్ హ్యాండ్ రైటింగ్ అసలైన ప్రత్యేకత. దీనిని పరీక్షల్లో ఉపయోగించవచ్చు.

లూసిడా:

ఈ హ్యాండ్ రైటింగ్ కూడా మెలకువల ఆధారంగానే ఉంటుంది. నిదానంగా రాస్తే ఇది చాలా బాగుంటుంది. వేగంగా రాసే సమయంలో ఈ రైటింగ్‌లో అక్షరాల్లో సఖ్యత ఉండదు. ఫాంట్, క్లారిటీ తగ్గుతుంది.

1) చదువులో ముందున్న, వెనుకబడి ఉన్న విద్యార్థులను చదువుపై ఆసక్తి పెరగడానికి చేతిరాత ఒక మెడిసిన్‌లా ఉపయోగపడుతుంది.
2. విద్యార్థుల చేతిరాత రకరకాలుగా ఉంటుంది. వీరిలో కొందరు చిన్న చిన్న అక్షరాలకు అలవాటు పడి ఉంటారు. మరికొందరు పెద్ద పెద్ద అక్షరాలు రాస్తుంటారు. ఇంకొందరు అక్షరాలను కలిపేస్తూ అష్టవంకర్లుగా రాస్తుంటారు. ఇది సరైన పద్ధతి కాదు.

కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు విపరీతంగా వాడుతున్న ఈ తరంలో చేతిరాతను మర్చిపోకుండా, దాని ప్రాముఖ్యాన్ని గుర్తించడమే జనవరి 23 జాతీయ చేతిరాత దినోత్సవ ముఖ్యోద్దేశం.

జవాబు రాసే తీరు పరీక్ష పేపర్ మూల్యాంకనం చేసేవారికి ఇబ్బందిపెట్టే విధంగా ఉండకూడదు. సమాధానాలు అన్నీ మూల్యాంకనం చేసే ఉపాధ్యాయునికి తెలుసన్న సంగతి గుర్తుంచుకోవాలి.

పి.భువనచంద్ర,
జాతీయస్థాయి చేతిరాత నిపుణులు

జాబ్ కార్నర్

'ఐవోసీఎల్ పైప్‌లైన్స్'లో అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, పైప్‌లైన్స్ డివిజన్ పరిధిలోని అయిదు రీజియన్లలో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పైప్‌లైన్ రీజియన్లు: వెస్ట్రన్, నార్తర్న్, ఈస్ట్రన్, సదరన్, సౌత్ ఈస్టన్.

పోస్టు: అప్రెంటిస్ **ఖాళీలు:** 473

ట్రేడులు: మెకానికల్, ఎలక్ట్రికల్, టీ అండ్ ఐ, హ్యూమన్ రిసోర్స్, అకౌంట్స్/ఫైనాన్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్.

అర్హత: 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత

వయోపరిమితి: 2024 జనవరి 12 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, వైద్య పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు. **ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** ఫిబ్రవరి 1

రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 18

వెబ్‌సైట్: https://iocl.com/

వీఎస్‌ఎస్‌సీలో రీసెర్చ్ ఫెలో

తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్‌ఎస్‌సీ), స్పేస్ ఫిజిక్స్ ల్యాబొరేటరీ... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో. **ఖాళీలు: 5**

అర్హతలు: ఎమ్మెస్సీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/స్పేస్ ఫిజిక్స్/అట్మాస్ఫియరిక్ సైన్స్/మెటీరియాలజీ/ప్లానెటరీ సైన్సెస్), ఎంఎస్/ఎంఈ, ఎంటెక్(ఫిజిక్స్/అట్మాస్ఫియరిక్ సైన్స్/ప్లానెటరీ సైన్స్/ఎర్త్ అండ్ స్పేస్ సైన్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ఇంజనీరింగ్ ఫిజిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్/గేట్/జెస్ట్‌లో అర్హత సాధించి ఉండాలి.

వయోపరిమితి: జనవరి 30 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ షార్ట్-లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి తుది ఎంపిక చేపడతారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 30

వెబ్‌సైట్: https://www.vssc.gov.in/

ఎన్‌హెచ్‌ఏఐలో డిప్యూటీ మేనేజర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ)....డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** డిప్యూటీ మేనేజర్(టెక్నికల్)

ఖాళీలు: 60

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ / ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

పే స్కేల్: రూ.15,600 - రూ.39,100


ఎంపిక ప్రక్రియ: యూపీఎస్సీ 2023లో నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://nhai.gov.in/



లిటిల్



తాత ఆలోచన.. రాజుగారికి సంతోషం!

అనగనగా ఉత్తరదేశంలోని ఓ రాజ్యం. ఆ రాజ్యంలోని రాజు పేరు పల్లవుడు. రాజుగారికి సకల కళల్లో ప్రావీణ్యముంది. మంచి పాటగాడు. రాజుగారు ఎంతో ఆశావహులు. ఆయన యుద్ధంలో అరివీర భయంకరుడు. ఇతరులకు సాయం చేయటంలో అతనికి అతనే సాటి. అలాంటి రాజ్యంలో ప్రజలకెన్నో సంక్షేమ పథకాలు ఇచ్చాడు. తన వల్లే వీరంతా సంతోషంగా ఉంటారని అనుకున్నాడు.

ఒకరోజు రాజుగారు గుర్రంమీద ముసుగు కప్పేసుకుని మరీ బయలుదేరాడు. రాజ్యంలో జనాల ఆలోచలను విందామని వెళ్లాడు. సంక్షేమపథకాలు బాగా ఉన్నాయి. అయితే ఇంకా మాకు ధనం, ధాన్యం.. ఇలా ఏవేవో కావాలని అడుగుతున్నారు. ప్రతి ఒక్కరు విచారంతోనో, బాధతోనో ఉన్నారు. ఇది చూసి నా రాజ్యంలో సంతోషంగా ఎవరూ లేరా? అని బాధపడ్డాడు. ఇన్నాళ్లు సుభిక్షపాలన అందిస్తూ ఉన్నాను అని అనుకున్న తన ఆలోచనలో నిజం లేదని తెలిసింది. ఇలా రైతు, దళారి, కూలీ.. అందరినీ




కలిసినా ఫలితం ఒక్కటే. చాలామందిలో ఏదో నిరాశ ఉంది. ఇలాంటప్పుడు నేను రాజును ఎలా అవుతాననే బాధలో ఉన్నాడు పల్లవుడు.

పగటిపూట ఒక రోజు తన పరివారంతో వెళుతూంటే ఓ ముసలివాడు చెట్లు నాటుతూ కనిపించాడు. రాజుగారి రాకను పట్టించుకోలేదు. దీంతో రాజుగారు ఆయన్ని కలవాలని వెళ్లారు. అతని ముఖం తేజంగా ఉంది. వృద్ధాప్యం ఛాయలున్నా అతని ఆశావాదం రాజును ఆశ్చర్యపరిచింది. వెంటనే రాజుగారు ఆ తాతను ఇలా అడిగాడు.. 'ఈ చెట్టును ఇంత ప్రయాసతో నాటుతున్నావెందుకు?' అనడిగాడు. 'ప్రయాసకాదు రాజావారు. సంతోషంతో నాటుతున్నా' అన్నాడు ముసలాయన. 'చూస్తే ఆరేళ్లు కూడా బతికేట్లు లేవు. మరి ఈ చెట్టు కాయలు ఎప్పుడు కాస్తుంది?' అనడిగాడు రాజు. 'ఈ మామిడిచెట్టు ఐదేళ్లకు కాయలు కాస్తుంది. మా మనవళ్లకు ఈ కాయలు ఉంటాయి' అన్నాడు. రాజుగారు ఆశ్చర్యపోయారు. ఎలాగ అన్నాడు. అసలు ఆ అవసరం నీకెందుకు? అన్నాడు. 'అలా అనుకుంటే ఎలా అయ్యా.. మనిషి ఆశాజీవి. మా తాతయ్యగారు నాటిన చెట్లు ఇప్పుడు కాయలు కాస్తున్నాయి. ఆ ఫలితం నాకు ఉంది కదా. నేను కూడా అందుకే.. నా మనవళ్లకోసం ఈచెట్టు నాటుతున్నా' అన్నాడు. అతని ఆలోచన, అతనిలోని ఉండే సంతోషం చూసి రాజుగారు సంతోషపడ్డారు. ఆయన మాటలు విని ఇంటికి బయలుదేరాడు. గుర్రం ఎక్కి వెళ్తున్నప్పుడు 'ఇంతటి ఆశాజీవి. నా రాజ్యంలో ఉన్నందుకు గర్వంగా ఉంది' అని మనసులో అనుకున్నాడు. అప్పటి నుంచి ఆ తాత బతికి ఉండేవరకు బంగారు నాణేలను రాజుగారు పంపించేవారు.

దారి కనుక్కోండి



10 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 210

4	2		9		5			
6	8				3	9		
			2					
1		4					7	
3								8
	9					4		6
					2			
		7	4				1	5
			6		7		2	9

సుడోకు - 209 సమాధానం

8	5	3	4	9	6	2	7	1
2	9	7	8	3	1	4	6	5
1	4	6	2	7	5	3	8	9
3	2	8	6	4	9	5	1	7
5	7	4	3	1	8	6	9	2
9	6	1	5	2	7	8	4	3
6	3	9	7	5	4	1	2	8
4	1	5	9	8	2	7	3	6
7	8	2	1	6	3	9	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.